PRAJASAKTI Regd.No. 15795/68

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 307 | విజయవాడ, సోమవారం 9 జూన్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 9 June 2025 | Rs

## వెబ్ కౌన్సిలింగ్ వద్దు

- రాష్ట్ర వ్యాప్తంగా కదంతొక్కిన ఉపాధ్యాయులు
- లోకేష్ జోక్యం చేసుకోవాలి : ఎమ్మెల్సీ గోపీమూర్తి

2

విజయనగరంలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

## పోరాటాల కేంద్రం విశాఖ వేదికగా..

డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు..

## సిఐటియు 18వ జాతీయ మహాసభ

ఆహ్వాన సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఎన్నో పోరాటాల కేంద్రం, ఉక్కు నగరం మరో చరిత్రాత్మక సంఘటనకు వేదికగా నిలువనుంది. కార్మిక హక్కుల ఉద్యమ సారధి, ఐక్య పోరాటాల పతాక సిఐటియు 18వ అఖిలభారత జాతీయ మహాసభకు విశాఖపట్నం ఆతిధ్యమివ్వనుంది. ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకు బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో అఖిల భారత మహాసభ నిర్వహించనున్నట్లు సిఐటియు కోశాధికారి సాయిబాబు ప్రకటించారు. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కార్మిక సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న 1300 మంది ఈ మహాసభలో ప్రతినిధులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు. నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వంతో పాటు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కూడా కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న నేపథ్యంలో సిఐటియు మహాసభ విశాఖలో జరగనుండటం ప్రాధాన్యత నంతరించుకుంది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్థానిక కార్మికులు ఏళ్లతరబడి పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. మహాసభ నిర్వహణ కోసం ఆహ్వాన కమిటీ ఏర్పాటు సమావేశం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వివరించారు. వీటికి వ్యతిరేకంగా జులై 9న జరగనున్న అఖిలభారత సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలకు విశాఖపట్నంను ప్రయోగశాలగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, సిఐటియు మహాసభను విజయవంతం చేయడం ద్వారా ఆ కుట్రను తిప్పికొట్టాలని అన్నారు. నాడు డిసిఐ రక్షణ పోరాటంలో ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చి పవన్ కల్యాణ్ రాజకీయాల్లో తొలి అడుగు వేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆయనే స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తున్న ఎన్‌డిఎ పక్షాన నిలవడం దురదృష్టకరమన్నారు. అనంతరం సిహెచ్ నర్సింగరావు ఛైర్మన్, ఆర్‌కె ఎస్‌వి కుమార్ ప్రధాన కార్యదర్శిగా, ఎవి నాగేశ్వరరావు కోశాధికారిగా ఆహ్వానసంఘం ఏర్పాటైంది.

ఆహ్వాన సంఘ సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబు

## బాలురదే హవా

### ఎపిఇఎపి సెట్ ఫలితాలు విడుదల

ఇంజనీరింగ్‌లో..

అనిరుధ్ (1 ర్యాంకు)

ఎం.భానుచరణ్‌రెడ్డి (2వ ర్యాంకు)

యశ్వంత్‌సాత్విక్ (3వ ర్యాంకు)

అగ్రికల్చర్‌లో..

హర్షవర్ధన్ (1వ ర్యాంకు)

షణ్ముఖ నిషాంత్ (2వ ర్యాంకు)

అకిరానంద (3వ ర్యాంకు)

ప్రజాశక్తి- కాకినాడ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నేతృత్వంలో జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎపిఇఎపిసెట్)-2025 ఫలితాల్లో బాలుర హవా నడిచింది. ఇంజనీరింగ్ విభాగంలోనూ, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలోనూ టాప్ టెన్ ర్యాంకులను వారు హస్తగతం చేసుకున్నారు. ఈ ఫలితాలను కాకినాడలోని జెఎన్‌టి యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ కాన్ఫరెన్స్ హాలులో సెట్ ఛైర్మన్, జెఎన్‌టియుకె వైస్‌ఛాన్సలర్ సిఎస్‌ఆర్‌కె.ప్రసాద్, కన్వీనర్ వివి.సుబ్బారావు ఆదివారం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ర్యాంకు కార్డులను ఎపిఇఎపిసెట్ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని చెప్పారు. ప్రవేశ పరీక్షలో భాగంగా జువాలజీ సబ్జెక్ట్, ఫిజిక్స్ సబ్జెక్ట్ టైపోగ్రాఫికల్ లోపం వల్ల రెండు ప్రశ్నలకు సంబంధించిన ఆప్షన్స్ మార్పు చేశామన్నారు.

**ఇంజనీరింగ్‌లో టాప్ టెన్ ర్యాంకర్లు వీరే...**

తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన అవనగంటి అనిరుధ్‌రెడ్డి 1వ ర్యాంకు, మన రాష్ట్రంలోని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఎం.భానుచరణ్‌రెడ్డి 2వ ర్యాంకు, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కోటిపల్లి యశ్వంత్‌సాత్విక్ 3వ ర్యాంకు, నంధ్యాల జిల్లా మహానందికి చెందిన ఉడగండ్ల రామచరణ్‌రెడ్డి 4వ ర్యాంకు, అనంతపురానికి చెందిన భూపతి నితన్ అగ్నిహోత్రి 5వ ర్యాంకు, గుంటూరుకు చెందిన తెలగతొట్టి విక్రమ్‌లెవి 6వ ర్యాంకు, చిత్తూరు జిల్లా సోదమకు చెందిన దేశిరెడ్డి మనిదీప్ రెడ్డి 7వ ర్యాంకు, తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా హనుమ కొండకు చెందిన సహగంటి త్రిశూల్ 8వ ర్యాంకు, శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన ధర్మాన జ్ఞానరుత్విక్ సాయి, 9వ ర్యాంకు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన భద్రిరాజు వెంకటమణిప్రీతమ్ 10వ ర్యాంకు సాధించారు.

**అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలో టాప్ టెన్ ర్యాంకర్లు వీరే...**

కృష్ణా జిల్లా పెనుమలూరుకు చెందిన రామాయణం వెంకటనాగసాయి 1వ ర్యాంకు, తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మదీనాగూడకు చెందిన షణ్ముఖ నిషాన్ అక్షింతల 2వ ర్యాంకు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరుకు చెందిన దేగల అకీరానంద వినయ్ మల్లేష్‌కుమార్ 3వ ర్యాంకు, తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన యండపర్తి షణ్ముఖ 4వ ర్యాంకు, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన యెలమోలు సత్యవెంకట్ 5వ ర్యాంకు, కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన సిరిదెల్ల శ్రీశశిగోవర్ధన్ 6వ ర్యాంకు, విశాఖ జిల్లా చినవాల్తేరుకు చెందిన గిరధ లక్ష్మీచరణ్ 7వ ర్యాంకు, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన దర్బ కార్తీక్ రామ్‌కిరీటి 8వ ర్యాంకు, చాగల్లుకు చెందిన కొడవటి మోహిత్ శ్రీరామ్ 9వ ర్యాంకు, కాకినాడ జిల్లా తొండంగికి చెందిన దేశిన సూర్యచరణ్ 10వ ర్యాంకు సాధించారు.

## మహిళల వ్యక్తిత్వంపై దాడిని సహించం

- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళల వ్యక్తిత్వంపై దాడిని ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. రాజకీయ, మీడియా ముసుగులో మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమది ఆడబిడ్డలను గౌరవించే సంస్కృతి అని పేర్కొన్నారు. స్త్రీమూర్తులను ఆరాధించే సమాజం మన సంప్రదాయమని వెల్లడించారు. ముఖ్యంగా తెలుగు ప్రజలు ఆడబిడ్డను, అమ్మను ఎంతో ఆదరణతో చూస్తారని వివరించారు. అలాంటి రాష్ట్రంలో రాజకీయ కక్షతో, మీడియా విశ్లేషణల పేరుతో నిస్సిగ్గుగా ఏకంగా మన తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్లు ఎప్పుడూ అనుసరించే ఈ విష సంస్కృతిపై తిరుగుబాటుగా గత ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చినా వారి వైఖరిలో మార్పు రాలేదనేది సుస్పష్టమని తెలిపారు. రాజధాని గురించి, ఆ ప్రాంత మహిళల వ్యక్తిత్వాలను అవమానించేలా వేశ్యలు అంటూ చేసిన దారుణ వ్యాఖ్యలను ఉపేక్షించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. రాజకీయ, మీడియా ముసుగులో జరుగుతున్న ఇటువంటి వికృత పోకడలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తన సొంత మీడియా ఛానెల్ ద్వారా జరిగిన ఈ దారుణాన్ని ఒక మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఇప్పటికీ ఖండించకపోవడం, స్త్రీ జాతికి క్షమాపణ చెప్పకపోవడం మరింత విచారకరమని విమర్శించారు. రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టు దాటి మహిళల మనోభావాలను గాయపరిచిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత విధ్వంస ప్రభుత్వంపై రాజధాని మహిళల పోరాటాన్ని మనసులో పెట్టుకుని ఆ ప్రాంత మహిళలపై ఉద్దేశపూర్వకంగా, నీచాతినీచంగా చేసిన ఈ వ్యాఖ్యలు మొత్తం మహిళా సమాజాన్నే అవమానించడమని పేర్కొన్నారు. మహిళలను గౌరవించే, వారి ఆత్మగౌరవానికి అండగా నిలిచే కూటమి ప్రభుత్వం ఈ నీచ సంస్కృతికి చెక్ పెట్టే బాధ్యత తీసుకుంటుందని వెల్లడించారు.

**అమరావతిపై కుట్రలు : పవన్‌కల్యాణ్**

రాజధాని అమరావతిపై కుట్రలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ హెచ్చరించారు. అమరావతిపై ఓ ఛానెల్‌లో విశ్లేషకుడు, జర్నలిస్ట్ ముసుగులో ఒక వ్యక్తి చేసిన దారుణ వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృతమైన కుట్ర దాగి ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, అధికార యంత్రాంగం లోతుగా విశ్లేషించాలన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చర్చ సందర్భంలో కనీసం ఖండించకపోవడం, తప్పుపట్టకపోవడం వెనుక మహిళలను, ఈ ప్రాంత చారిత్రక నేపథ్యాన్ని విలసిల్లిన బౌద్ధాన్ని అవమానించి అవహేళన చేయాలనే కుటిల యత్నం దాగి ఉందన్నారు. టివి ఛానెల్‌లో డిబేట్ ద్వారా రాజధాని ప్రాంత మహిళలపై నీచ వ్యాఖ్యలు చేయించారని, అక్కడున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇతర సామాజిక వర్గాల మహిళలందరినీ అవమానించడమే కదా? అని పవన్‌కల్యాణ్ ప్రశ్నించారు. రాజధానిపై కుట్రలు చేసేవారితో పాటు దుష్ప్రచారం చేసిన వ్యక్తులపైనా, వారి వెనుక ఉన్న వారిపైనా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు.

## విశాఖ, అల్లూరి జిల్లాల్లో విషాదం

### నీట మునిగి నలుగురు విద్యార్థుల మృతి

ప్రజాశక్తి - దుంబ్రిగుడ, ఎంవిపి కాలనీ (విశాఖ, అల్లూరి)

విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఆదివారం నీటమునిగి నలుగురు విద్యార్థులు చనిపోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలంలోని గంగవలసలో సరదాగా స్నానం చేయడానికి చెరువులో దిగి ముగ్గురు గిరిజన విద్యార్థులు మునిగిపోయారు. కుటుంబీకుల కథనం మేరకు.. గుంటసీమ పంచాయతీ కేంద్రానికి ఆనుకొని ఉన్న గంగవలసకు చెందిన కొర్ర సుశాంత్ (14), పోతంగి పంచాయతీ బిల్లపుట్టు గ్రామానికి చెందిన గుంట భానుతేజ్ (14), గుంట సాయి కిరణ్ (14) స్నానం చేయడానికి సమీపంలోని చెరువుకు వెళ్లారు. చెరువు లోతు, బంకమట్టి ఊబి కారణంగా వారు అందులో కూరుకుపోయి మృతి చెందారు. భానుతేజ్ నర్సీపట్నంలో, సాయి కిరణ్ అరకులోయ సిహెచ్ స్కూల్‌లో, సుశాంత్ గుంటసీమ ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. బిల్లపుట్టుకు చెందిన ఇద్దరు విద్యార్థులు వేసవి సెలవులు కావడంతో గంగవలసలోని వారి మేనమామ ఇంటికి వచ్చి అనుకోని ప్రమాదానికి గురయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌బి పోతురాజు కోరారు. విశాఖ బీచ్‌లోనూ విషాదం చోటు చేసుకుంది. బీచ్‌లో వాకింగ్ కోసం తెల్ల వారుజామునే దువ్వాడకు చెందిన పి సంతోష్ తన భార్య, ఇద్దరు కుమారులతో వచ్చారు. కుటుంబ సభ్యులంతా ఒడ్డునే కూర్చోగా ఏడేళ్ల సూర్య మాత్రం సముద్రంలోకి స్నానానికి వెళ్లాడు. అలలు లాక్కెళ్లి పోయాయి. త్రీటౌన్ ట్రాఫిక్ హోంగార్డు దౌలపల్లి పరదేశి ఆ బాలుడిని రక్షించి కెజిహెచ్‌లో చేర్చారు. పరిస్థితి విషమించడంతో ఆ బాలుడు మృతి చెందాడు.

భానుతేజ, సాయికిరణ్ (ఫైల్)

కొర్ర సుశాంత్ (ఫైల్)

## పేదల ఇళ్లకు వెంటనే పట్టాలు

- వి. శ్రీనివాసరావు డిమాండ్
- పెరుగుతున్న బుల్డోజర్ సంస్కృతిపై ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్న పేదలకు వెంటనే జిఓ 30 ప్రకారం పట్టాలివ్వాలని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావుతో కలిసి ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పేదలకు అందిస్తానన్న ఇంటి స్థలాలు కాగితాలకే పరిమితమయ్యాయని చెప్పారు. పేదలకు ఇళ్లు ఇచ్చే అంశంపై జివో 30ను జనవరిలో ప్రభుత్వం విడుదల చేసిందని, కానీ ఇప్పటి వరకు ఆ దిశలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు. ప్రభుత్వ స్థలాలు, రెవిన్యూ పోరంబోకుల్లో , కాలువగట్ల మీద ఎక్కడైనా నివసిస్తున్న పేదలు దరఖాస్తులు పెట్టుకుంటే, వాటిని క్రమబద్దీకరించి, ఇళ్లపట్టాలు ఇచ్చి, నెల రోజుల్లో ఇళ్లు కేటాయిస్తామంటూ జిఓ 30లో పేర్కొన్నారని ఆయన తెలిపారు. ఈ ఉత్తర్వులపై ప్రభుత్వం ఇంటింటికి ప్రచారం చేయకపోగా, ప్రజలే దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ వాటిని పెండింగ్‌లోనే ఉంచారని తెలిపారు. పాలకోడేరు లాంటి చోట దరఖాస్తులు తీసుకోకుండా తిరస్కరించారన్నారు. పేదలను ఆదుకునే పద్ధతి ఇది కాదని, ఇలా అయితే సంక్షేమం ముందుకుపోదని అన్నారు. జిఓ ప్రకారం ప్రతి మండలంలో భూ సలహా కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉందని, 5 నెలలు గడిచినా ఇప్పటి వరకు నియమించలేదన్నారు. జిఓ 30 విడుదలైన తరువాత పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రజలు పట్టాలు కోసం దరఖాస్తు చేసుకుంటే పట్టాలు ఇవ్వకుండా ఇళ్లు కూల్చివేసిన సంఘటనను ఆయన గుర్తుచేశారు. వీటిని కూల్చిన అధికారులు, పోలీసులపై చర్యలు తీసుకోవాలని, కూల్చిన చోటే పేదలకు వెంటనే ఇళ్లు కట్టడం గానీ, ప్రత్యామ్నాయ ఇళ్లు కానీ ఇవ్వాలని వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

**యోగా కాదు... కనీస వేతనాలు ఇవ్వండి**

పేదలకు అవసరమైన వాటిపై ప్రచారం కల్పించకుండా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మెప్పుకోసం ప్రభుత్వ తన యంత్రాంగాన్ని మొత్తం యోగాంధ్రకు దించడం సరికాదని ఆయన అన్నారు. గత ప్రభుత్వ ఓటమికి మోడీని అనుసరించడమే 50 శాతం కారణమని చెప్పారు. గత ప్రభుత్వానికి మించి ప్రస్తుతం ప్రభుత్వం మోడీ భజన చేస్తోందని, ఇలా అయితే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రధాని కార్యక్రమం కోసం ఈ నెల 21న లక్షల మందిని వైజాగ్ తరలించడం సరికాదని, ఇది రాష్ట్ర అభివృద్ధికి సహకరించదన్నారు. శ్రామికులకు కావలసింది యోగా కాదని, కనీసం వేతనం అమలు చేస్తేనే వారి ఆరోగ్యాలు బాగుంటాయని తెలిపారు. అలా కాకుండా 8 గంటల పనివిధానం బదులు 12 గంటలు పని చేయిస్తే ఆరోగ్యం బాగుంటుందా అని ప్రశ్నించారు. శ్రామికులు ప్రతిరోజు యోగా చేస్తునే ఉన్నారని తెలిపారు.

**భూ మాఫియా, బుల్డోజర్ వ్యవస్థపై ...**

రాష్ట్రంలో చెలరేగిపోతున్న భూ మాఫియా, బుల్డోజర్ వ్యవస్థపై దృష్టిపెట్టాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తిరుపతిలో పేద, మిగతా 7లో

### గ్రెటా థన్‌బర్గ్ నేతృత్వంలోని ‘మానవత’ నౌకను అడ్డుకుంటాం

- ఇజ్రాయిల్

**టెల్ అవీవ్ :** ప్రముఖ పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్ నేతృత్వంలో పాలస్తీనా వాసులకు మానవతా సహాయం అందించేందుకు వస్తున్న నౌకను అడ్డుకుంటామని ఇజ్రాయిల్ రక్షణమంత్రి కాట్జ్ ఆదివారం ప్రకటించారు. ఇజ్రాయిల్ అమానుష దాడులతో పాలస్తీనాలో నెలకొన్న మానవతా సంక్షోభంపై ప్రపంచానికి అవగాహన కల్పించడం, ఇజ్రాయిల్ సముద్ర దిగ్బంధనాన్ని ఛేదించి మానవతా సహాయం అందించడం లక్ష్యంగా ఈ నౌక గాజా బయల్దేరింది. గ్రెటాతోపాటు పాలస్తీనా సంతతికి చెందిన ఫ్రెంచ్ యూరోపియన్ పార్లమెంట్ సభ్యురాలు రీమా హసన్‌సహా 12మంది కార్యకర్తలు ఫ్రీడమ్ ఫ్లోటిల్లా ఆధ్వర్యాన ఈ నెల 1న ఇటాలియన్ ఓడరేవు కాటానియా నుంచి మాడ్లీన్ నౌకలో బయల్దేరారు. ఆదివారం నాటికి గాజా ప్రాదేశిక జలాల్లోకి చేరుకో వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తమ దాడులను వ్యతిరేకిస్తున్నం దున ఇప్పటికే ఇజ్రాయిల్ రీమా హసన్‌ను బహిష్కరిం చింది. గత నెలలో ఫ్రీడమ్ ఫ్లోటిల్లా ఆధ్వర్యాన సహాయం అందించేందుకు వస్తున్న నౌకపై రెండు డ్రోన్లు దాడి చేయడంతో ఆ ఓడ ముందు భాగం దెబ్బతింది. ఇజ్రాయిల్ దాడి చేసినట్లు అప్పట్లో ఉద్యమకారుల బృందం విమర్శించింది.

## మణిపూర్‌లో మళ్లీ అశాంతి

- స్వచ్ఛంద సంస్థ నేత అరెస్టుతో పెల్లుబికిన హింస
- ఐదు జిల్లాల్లో కర్ఫ్యూ, ఇంటర్నెట్ నిలిపివేత

**ఇంఫాల్ :** మణిపూర్‌లో మళ్లీ అశాంతి చెలరేగింది. మైతీ - కుకీ తెగల మధ్య జరుగుతున్న ఘర్షణలతో ప్రమేయం ఉన్నదన్న ఆరోపణలపై మైతీ తెగకు చెందిన స్వచ్ఛంద సంస్థ అరంబై తెంగల్ (ఎటి) నేత కనన్ సింగ్‌ను పోలీసులు శనివారం ఎయిర్‌పోర్ట్‌లో అరెస్ట్ చేయడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆయనతోపాటు మరో నలుగురిని విచారణ కోసం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు వార్తలు వచ్చాయి. ఎటి కార్యకర్తలు భద్రతా దళాలతో ఘర్షణకు దిగారు. విమానాశ్రయ రహదారిపై భద్రతా దళాలు ప్రయాణించే బస్సును తగలబెట్టారు. భద్రతా సిబ్బందిసహా పలువురు ఈ ఘర్షణల్లో గాయపడ్డారు. తమ నేతను విడిచిపెట్టకపోతే ఆత్మాహుతి చేసుకుంటామంటూ కొందరు యువకులు రాజధాని ఇంఫాల్‌లో పెట్రోల్ పోసుకుని ఆందోళన చేశారు. శనివారం రాత్రి రోడ్లపై టైర్లకు నిప్పు పెట్టి ట్రాఫిక్‌ను అడ్డుకున్నారు. కాల్పుల శబ్దాలు కూడా వినిపించాయని ఇంఫాల్ వాసులు తెలిపారు. ‘మేము ఆయుధాలను విడిచి పెట్టాము. వరదల సమయంలో మీరు చేయాల్సిన పనుల్ని మేమే చేశాం. ఇప్పుడు మీరు మమ్మల్ని అరెస్ట్ చేస్తున్నారు. ఇప్పుడు మేము ఆత్మాహుతి చేసుకుంటాం’ అంటూ కొందరు యువకులు కేకలు వేశారు. అరెస్టులను నిరసిస్తూ ఇంఫాల్ వ్యాలీలోని ఇంఫాల్ తూర్పు, పశ్చిమ, బిష్ణుపూర్, కాక్సింగ్, థౌబల్ జిల్లాల్లో పది రోజులపాటు షట్ డౌన్ విధిస్తామంటూ అరంబై తెంగల్ తెలిపింది. ఈ ఐదు జిల్లాల్లో ప్రభుత్వం కర్ఫ్యూ విధించడంతోపాటు ఇంటర్నెట్‌పై నిషేధం విధించింది. దీంతో ఆదివారం రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి.

పోలీసులు అరెస్టు చేసిన కనన్‌సింగ్ మాజీ హెడ్ కానిస్టేబుల్. అరంబై తెంగల్ సభ్యుడైన కరన్‌సింగ్‌ను అరెస్టు చేసినట్లు సిబిఐ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 2023లో వివిధ క్రిమినల్ కార్యకలాపాల్లో కనన్‌సింగ్ పాల్గొన్నాడని, అరెస్టు చేస్తున్న విషయాన్ని అతని కుటుంబ సభ్యులకు తెలియజేశామని పేర్కొంది. సుప్రీంకోర్టు మిగతా 7లో

ఇంఫాల్ విమానాశ్రయం వద్ద నిరసనకారులు దగ్ధం చేసిన బస్సు

### నేడు పలుచోట్ల అత్యధిక ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గరిష్టంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. సోమవారం నాడు అత్యధికంగా 41 డిగ్రీల నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఆ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. మరో వైపు కర్నూలు, ప్రకాశం, బాపట్ల, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని పేర్కొంది.

ఏలూరులో డిఇఒ కార్యాలయ ముట్టడిలో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

కడప డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించిన ఉపాధ్యాయులు

# వెబ్ కౌన్సిలింగ్ వద్దు

- రాష్ట్ర వ్యాప్తంగా కదంతొక్కిన ఉపాధ్యాయులు
- లోకేష్ జోక్యం చేసుకోవాలి : ఎమ్మెల్సీ గోపీమూర్తి

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎస్‌జిటిలకు వెబ్ కౌన్సిలింగ్ వద్దని, మాన్యువల్ పద్ధతిలో కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం ఉపాధ్యాయులు కదంతొక్కారు. డిఇఒ కార్యాలయాలను, కలెక్టరేట్లను ముట్టడించారు. 'మాయాదారి వెబ్ వద్దు... మాన్యువలే ముద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యాశాఖలో ఉపాధ్యాయ సంఘాల ప్రమేయం లేకుండా పనికిమాలిన నిర్ణయాలు చేసి ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థను నాశనం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఉపాధ్యాయ సంఘాల సూచనలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. యుటిఎఫ్, ఎస్‌టియు, ఎపిటిఎఫ్ 1938, పిఆర్‌టియు, పిఇటిల అసోసియేషన్ నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజయగరం కలెక్టరేట్ ప్రాంగణంగల డిఇఒ కార్యాలయానికి వెళ్తున్న ఉపాధ్యాయులను పోలీసులు అడ్డుకొని కలెక్టరేట్ గేట్లు మూసివేశారు. దీంతో, కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ఉపాధ్యాయులు బైఠాయించారు. అనంతరం కలెక్టరేట్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు, ఎపిటిఎఫ్ (1938) రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, పిఆర్‌టియు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏలూరు డిఇఒ కార్యాలయాన్ని ఉపాధ్యాయులు ముట్టడించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి, ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని తక్షణమే ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో చర్చించి విద్యా శాఖలో నెలకొన్న బదిలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని నిలుపుకోవాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడారు. వైఎస్‌ఆర్ జిల్లాలోని డిఇఒ కార్యాలయ ముట్టడికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు రెండు వేల మంది ఉపాధ్యాయులు తరలి వచ్చారు. చిత్తూరు జిల్లా డిఇఒ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. బదిలీల విషయంలో ప్రభుత్వం అన్యాయం చేయాలని చూస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు. విశాఖలో డిఇఒ కార్యాలయ ముట్టడి అనంతరం ప్రాంతీయ విద్యా సంచాలకులు (ఆర్‌జెడి) విజయ భాస్కర్‌కు, విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టరేట్‌ను ఉపాధ్యాయులు ముట్టడించారు.

ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేని అసమర్థత విద్యా శాఖ మంత్రి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల తదితరులు ప్రసంగించారు. కర్నూలు డిఇఒ కార్యాలయం వద్ద నిరసనకు ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు, ఆపాస్ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ, అప్ట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రావు, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె. సురేష్ కుమార్ హాజరై ప్రసంగించారు. అనంతపురం, గుంటూరు డిఇఒ కార్యలయాలను, శ్రీకాకుళం కలెక్టరేట్‌ను ముట్టడించారు.

కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని విద్యాశాఖ కార్యాలయం వరకు ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తమ సమస్యను జిల్లా విద్యాశాఖాధికారికి తెలియజేసేందుకు కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో, కొద్దిసేపు తోపులాట జరిగింది. పోలీసుల తీరును నిరసిస్తూ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు బైఠాయించారు. విషయం తెలుసుకున్న విద్యా శాఖాధికారి పివిజె రామారావు ఉపాధ్యాయులతో చర్చించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

## మాన్యువల్ 'కౌన్సిలింగ్' నిర్వహించలేం

- ఉపాధ్యాయ సంఘాలకు తేల్చి చెప్పిన విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు
- నేడు, రేపు నిరసనలకు ఐక్యవేదిక పిలుపు

సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి), తత్సమాన క్యాడర్ల ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ మాన్యువల్‌గా నిర్వహించలేమని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు తేల్చి చెప్పారు. మాన్యువల్ ద్వారా కౌన్సిలింగ్ చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యాన ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం డిఇఒ కార్యాలయాలను ముట్టడించారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాలతో ఆన్‌లైన్ ద్వారా డైరెక్టర్ చర్చలు నిర్వహించారు. మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించలేమని, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని సంఘాల నాయకులకు తేల్చి చెప్పారు. దీంతో, మాన్యువల్ కౌన్సిలింగ్ కోసం సోమ, మంగళవారాల్లో కూడా నిరసనలకు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. సోమవారం అన్ని జిల్లాల డిఇఒ కార్యాలయాల ఎదుట నిరాహార దీక్షలు చేపట్టాలని ఎన్ వెంకటేశ్వర్లు (యుటిఎఫ్), ఎల్ సాయి శ్రీనివాస్ (ఎస్‌టియు), సిహెచ్ మంజుల (ఎపిటిఎఫ్-257), ఎస్ చిరంజీవి (ఎపిటిఎఫ్-1938), ఎం కృష్ణయ్య (పిఆర్‌టియు), ఎస్ బాలాజీ (ఎపియుఎస్), వి శ్రీనివాసరావు (ఎపిహెచ్‌ఎంఎ), కె ప్రకాష్‌రావు (ఆప్టా), వై.అశోక్‌కుమార్ రెడ్డి (వైఎస్‌ఆర్‌టిఎ) ఐక్యవేదిక తరఫున ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల పదిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల డిమాండ్లను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వాట్సాప్, ఇ-మెయిల్ ద్వారా పంపించామని తెలిపారు.

## సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లిన పెరుమాళ్లు

- 'ఉద్యమ జీవి-పుస్తక ప్రాణి' పుస్తకావిష్కరణ సభలో మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

'ఉద్యమ జీవి పుస్తక ప్రాణి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం, గుమ్మా సాంబశివరావు తదితరులు

పుస్తకానికి సముచితమైన ధరను నిర్ణయించి ప్రజల్లోకి తీసుకువెళ్లటంలో పబ్లిషర్ మువ్వల పెరుమాళ్లు ఎంతో కృషి చేశారని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. మువ్వల పెరుమాళ్లు శత జయంతిని పురస్కరించుకొని, జయంతి పబ్లికేషన్స్ స్థాపనకు 70 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రూపొందించిన ప్రత్యేక పుస్తకం 'ఉద్యమ జీవి-పుస్తకప్రాణి' ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం విజయవాడ బుక్ ఎగ్జిబిషన్ సొసైటీ హాలులో జరిగింది. ఈ పుస్తకాన్ని విఠపు బాలసుబ్రమణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విలువైన సాహిత్య పుస్తకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న దృక్పథంతో మంచి పుస్తకాలను ముద్రించి సామాన్య పాఠకులకు అందుబాటులోకి తీసుకువచ్చారని కొనియాడారు. ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థల అధ్యక్షులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ... సామాన్య ప్రజలకు సాహితీ పుస్తకాలను పరిచయం చేసిన గొప్ప వ్యక్తి పెరుమాళ్లు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలవరపు కోటేశ్వరరావు, సాహిత్య సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణరావు, శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు, పల్లవి పబ్లికేషన్ అధినేత నారాయణరావు, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య, సీనియర్ పాత్రికేయులు వెంకటరావు, ప్రముఖ హిందీ అనువాద రచయిత డాక్టర్ వెన్న వల్లభరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని మువ్వల సుబ్బరామయ్య నిర్వహించారు.

## ముగిసిన మసులా బీచ్ పెస్టివల్

- పర్యాటకానికి పెద్దపీట : మంత్రి అనగాని

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కష్ణా)

బీచ్ ఫెస్టివల్‌కు వచ్చిన వారికి అభివాదం చేస్తున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర తదితరులు

గేట్ వే అఫ్ అమరావతి పేరుతో కృష్ణా జిల్లా మచిలీపట్నం మంగినపూడి సముద్ర తీరాన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మసులా బీచ్ ఫెస్ట్ ఆదివారంతో ముగిసింది. నాలుగురోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ, సి కాయకింగ్, వాలీబాల్ వంటి క్రీడల పోటీలు నిర్వహించారు. నాలుగు రోజుల్లో సుమారు పది లక్షల మంది పర్యాటకులు బీచ్ పెస్టివల్‌ను సందర్శించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. చివరిరోజైన ఆదివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ హాజరయ్యారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం పర్యాటకానికి పెద్ద పీట వేస్తున్నట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. భారతదేశంలో బెస్ట్ పెస్టివల్‌గా మసులా బీచ్ పెస్టివల్ నిలుస్తుందన్న మంత్రి కొల్లు రవీంద్ర ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, డిసిఎం ఎస్ చైర్మన్ బండిరామకృష్ణ పాల్గొన్నారు. చివరి రోజు కావడంతో లక్షలాది మంది పర్యాటకులు తరలిరావడంతో కిలోమీటర్ల కొద్ది ట్రాఫిక్ నిలిచిపోయింది.

## మెప్మాకు 9 స్కోచ్ అవార్డులు

- డైరెక్టర్ తేజ్ భరత్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పట్టణ ప్రాంత పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రతిష్ఠాత్మక 9 స్కోచ్ ప్లాటినం అవార్డులు దక్కించుకున్నట్లు మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్ తెలిపారు. పేదరిక నిర్మూలనలో చేసిన అసాధారణ కృషి, వినూత్న కార్యక్రమాలకు ఈ అవార్డులను స్కోచ్ సంస్థ ప్రకటించినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కోచ్ అవార్డులు పొందిన 9 కార్యక్రమాల్లో.. నివాసం, లైవ్‌లీహెడ్ ట్రాకర్, బ్యాంక్ లింకేజీ, ఇ-కామర్స్ సహకారంతో ఎస్‌హెచ్‌జి మహిళలకు సాధికారత కల్పించడం, స్కిల్, గిగ్ ఎకానమీల సహకారంతో ఎస్‌హెచ్‌జి మహిళలకు సాధికారత కల్పించడం, స్వయం సహాయ సంఘాల ఆధ్వర్యాన సంస్థలు, ఉద్యోగాలు సృష్టించడం, ప్రేరణ సఖీలు, వీధి విక్రేతల నిర్వహణ కార్యక్రమం, దుర్బల వృత్తి సమూహాల నిర్మాణం ఉన్నాయని తెలిపారు. ఈ విజయాన్ని సాధించడానికి సిఎం చంద్రబాబు, పురపాలకశాఖ మంత్రి పి నారాయణ మార్గదర్శకాలను పాటించడం, ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్ కుమార్, సిఎం సెక్రటరీ ప్రద్యుమ్న సమయానుకూల సూచనలే కారణమన్నారు. ఉత్తేజపూరితంగా పనిచేసిన మెప్మా సిబ్బంది, పట్టణ స్వయం సహాయక సంఘాల పనితీరు కారణమన్నారు. ఈ అవార్డు మెప్మా సంకల్పాన్ని మరింత బలపరుస్తుందని పేర్కొన్నారు.

# అమరావతిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనలు

- పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసిన మహిళ నాయకులు
- సాక్షి కార్యాలయాల వద్ద నిరసన - దినపత్రికలు దహనం

ప్రజాశక్తి - యంత్రాంగం

పెనుకొండలో ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

సాక్షి మీడియా వేదికగా జరిగిన ఓ డిబేట్‌లో అమరావతిని 'వేశ్యల రాజధాని'గా వ్యాఖ్యానించిన ఘటనపై టిడిపి నాయకులు, మహిళలు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో నిరసనలు తెలిపారు. డిబేట్‌లో పాల్గొన్న జర్నలిస్టు కృష్ణంరాజు, డిబేట్ నిర్వహించిన కొమ్మినేని శ్రీనివాసులు, సాక్షి యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వారిపై పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

ఏలూరు సాక్షి ప్రధాన కార్యాలయం వద్ద టిడిపి మహిళా నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. సాక్షి ప్రతులను దహనం చేశారు. అనంతరం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాలకొల్లులో పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. తాడేపల్లిగూడెంలో సాక్షి కార్యాలయం ఎదుట రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డా.శిరిగినీడి రాజ్యలక్ష్మి నిరసన కార్యక్రమం చేపట్టి సాక్షి దిన పత్రికను దహనం చేశారు.విశాఖ జిల్లా ఆనందపురం పోలీసుస్టేషన్ ఎదుట టిడిపి నాయకులు, మహిళలు నిరసన తెలిపారు. సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అల్లూరి జిల్లా పాడేరు పోలీసుస్టేషన్‌లో తెలుగు మహిళలు ఫిర్యాదు చేశారు. ప్రకాశం జిల్లా కంభం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దండంగి మమత ఫిర్యాదు చేశారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో మహిళలు ఫిర్యాదు చేశారు. పెద్దాపురంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో టిడిపి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా టిడిపి నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు ఆందోళనలు చేశారు. ప్రధాన కూడళ్ల వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సాక్షి దినపత్రికలను దహనం చేశారు.

### చర్యలు తీసుకుంటాం : మంత్రి అనిత

అమరావతి రైతులపైనా, అక్కడి మహిళలపైనా సాక్షి కథనాలను తాము ఖండిస్తున్నామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం మధ్యాహ్నం విశాఖపట్నంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒక జర్నలిస్టు సాక్షిలో మాట్లాడిన మాటలు దారుణంగా ఉన్నాయని, సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉన్నాయని ఉన్నారు. అమరావతిపై జగన్‌మోహన్‌రెడ్డి అక్కసు వెళ్లగలుగుతున్నా రని, అమరావతిని కమరావతి అంటూ విమర్శలు చేశారని ఆరోపించారు. అమరావతిపై దారుణ వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అమరావతి ప్రజలకు జగన్, భారతిలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# అదృశ్యమైన బాలిక దారుణహత్య

- నాలుగు రోజుల క్రితం ఫిర్యాదు
- పోలీసుల నిర్లక్ష్యంతోనే ఈ ఘటనని తల్లిదండ్రుల ఆరోపణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో బాలికపై అత్యాచార ఘటన మరువక ముందే అనంతపురం జిల్లాలో మరో బాలికను దారుణంగా హత్య చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాలిక అదృశ్యమై నాలుగు రోజులైందని.. ఫిర్యాదు చేసినా పోలీసులు సకాలంలో స్పందించకపోవడంతోనే తమ కుమార్తె చనిపోయిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు మాత్రం ఫిర్యాదు అందిన వెంటనే స్పందించామని చెబుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి బాలిక తండ్రి లక్ష్మీపతి తెలిపిన సమాచారం మేరకు... అనంతపురం నగరంలోని రామకృష్ణ కాలనీలో నివాసముంటున్న లక్ష్మీపతి కుమార్తె తన్మయి (17) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మంగళవారం సాయంత్రం నుంచి ఆ బాలిక కనిపించకపోవడంతో అనంతపురం నగరంలో ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారిస్తున్నామని చెబుతున్నారే తప్ప ఎక్కడికెళ్లిందని గుర్తించలేదు. ఆదివారం మధ్యాహ్నం కూడేరు మండలం పరిధిలోని మణిపాల్ విద్యా సంస్థల వెనుక కాలిపోయి, సగం కుళ్లిపోయివున్న బాలిక మృతదేహం లభించింది. పోలీసుల సమాచారంతో అక్కడికి వచ్చి పరిశీలించిన తన్మయి తల్లిదండ్రులు అది తమ కుమార్తెదేనని గుర్తించారు. అదృశ్యమైన తమ కూతురు శవమై కనిపించిందని బాలిక తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

### పోలీసులు అనుమానితులకు ప్రశ్నించి ఉంటే

తమ కుమార్తె అదృశ్యమైన రోజే పోలీసులకు ఫిర్యాదు చేసామని తన్మయి తల్లిదండ్రులు చెబుతున్నారు. అనుమానితులుగా ఉన్న వారి ఫోన్ నంబర్లు సైతం ఇచ్చామని, అనుమానితులను విచారించి వారికి సంబంధం లేదని పోలీసులు వదిలేశారని ఆరోపించారు. ఆ రోజే స్పందించి తగిన చర్యలు తీసుకుని ఉంటే తమ కుమార్తె బతికేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నిందితుల కోసం గాలింపు ?

ఈ ఘటనలో పోలీసు యంత్రాంగం నిందితుల కోసం గాలింపు చేపడుతోంది. అదృశ్యమైన రోజు బాలికతో మాట్లాడిన వారితోపాటు, ఎవరు ఈ హత్యకు కారణమై ఉంటారన్నది గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.

### నేడు మహిళా కమిషన్ సభ్యురాలు రాక

సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాల పల్లిలోని బాలిక అత్యాచారానికి గురికావడంతో ఆమె కుటుంబాన్ని పరామర్శించేందుకు ఎపి మహిళా కమిషన్ సభ్యులు డాక్టర్ షేక్ రుఖీయా బేగం జిల్లాకు సోమవారం రానున్నారు. బెంగళూరు నుంచి వస్తున్న ఆమె బాలిక కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం రామగిరి సర్కిల్ పోలీసుస్టేషన్ సందర్శించి వివరాలు తెలుసుకుంటారు. అనంతరం పుట్టపర్తికెళ్లి జిల్లా ఎస్‌పిని కలసి కేసు పురోగతికి సంబంధించి పూర్వాపరాలు తెలుసుకుంటారు.

## కృష్ణంరాజు, కొమ్మినేనిని అరెస్టు చేయండి

- రాజధాని రైతు జెఎసి డిమాండ్

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

నినాదాలు చేస్తున్న రాజధాని రైతు జెఎసి నాయకులు

రాజధాని మహిళలను కించపరుస్తూ మాట్లాడిన వివిఆర్ కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావును తక్షణమే అరెస్టు చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రాజధాని రైతు ఐక్య కార్యాచరణ సమితి (జెఎసి) హెచ్చరించింది. గుంటూరు జిల్లా తుళ్లూరులో రైతు జెఎసి నాయకులు అప్పారావు మాట్లాడుతూ... కృష్ణంరాజు, శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేసినా అరెస్ట్ చేయకుండా పోలీసులు ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. వైసిపి పాలనలో రైతులు, మహిళా రైతులు మానసిక క్షోభకు గురయ్యారని, టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధాని నిర్మాణ పనులు జరుగుతుండడంతో రైతులు సంతోషంగా ఉండడాన్ని భరించలేక ఉద్దేశపూర్వకంగా మహిళలపై నీచంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు కళ్ళం రాజశేఖరరెడ్డి, గౌర్నెని స్వరాజ్యరావు మాట్లాడుతూ, మహిళలు అన్ని జిల్లా కేంద్రాల్లోని పోలీస్ స్టేషన్లలో కృష్ణంరాజు, శ్రీనివాసరావు పై కేసులు పెట్టాలని అన్నారు. వైఎస్ భారతి వెంటనే క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు.

రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు వి.వి.ఆర్. కృష్ణంరాజును వైసిపికి అనుకూలంగా ఉన్న అన్ని మీడియా సంస్థల నుంచి బహిష్కరించాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ డిమాండ్ చేశారు. విలేకర్లతో మాట్లాడుతూ... కుసంస్కారమైన భావజాలం ఉన్న వ్యక్తులు చర్చ వేదికల్లో పాల్గొనకూడదన్నారు. జగన్ కళ్లలో ఆనందం చూడటం కోసమే కృష్ణంరాజు అటువంటి వ్యాఖ్యలు చేశారని డొక్కా మండిపడ్డారు. కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ ఆధ్వర్యంలో కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దీక్షల్లో కూర్చున్న బిహెచ్‌ఇఎల్, విశాఖ డెయిరీ కార్మిక సంఘాల నాయకులు

## స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఊరుకోం

- బిహెచ్‌ఇఎల్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తే ఊరుకునేది లేదని బిహెచ్‌ఇఎల్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జిటిపి.ప్రకాష్ హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 1532వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో బిహెచ్‌ఇఎల్, విశాఖ డెయిరీ కార్మిక సంఘాల నాయకులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ఇచ్చిన ప్యాకేజీ బ్యాంకులు, జిఎస్‌టి అప్పులు తీర్చడానికే సరిపోయిందన్నారు. ఆ ప్యాకేజీ వల్ల ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనమూ కలగకపోగా నిరాశే మిగిలిందని తెలిపారు. ఉక్కు పరిశ్రమ ప్రగతిలో కీలకమైన కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి, సొంత గనులు కేటాయిస్తే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ, అధ్యక్షులు వరాహమూర్తి, బిహెచ్‌ఇఎల్ ఎంప్లాయీస్ నాయకులు ఎస్.జగన్నాథరావు, కె.నారపరెడ్డి, పి.శివరాం, జి.అచ్చున్నాయుడు పాల్గొన్నారు.

## 'గోదావరి-బనకచర్ల'పై ఏకపక్ష నిర్ణయం వద్దు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదని, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, కొత్తగా చేపట్టబోయే ప్రాజెక్టులపై సిఎం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. అలా కాకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకుంటే.. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టుకు పట్టిన దుస్థితి రాష్ట్రంలోనూ పునరావృతం అవుతుందన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెవివి ప్రసాద్‌తో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. గోదావరి-బనకచర్ల పేరుతో దాదాపు రూ.82 వేలకోట్లు ఖర్చు చేసి, దాన్ని నిర్మించాలన్న ప్రతిపాదనలతో ప్రభుత్వం హడావిడిగా ముందుకు వెళ్లడం సరికాదన్నారు. నీటిపారుదలశాఖ అధికారులను సైతం పక్కనపెట్టి సిఎం చంద్రబాబే స్వయంగా ఓ పెద్ద కాంట్రాక్టరుతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోందన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా ఇంత పెద్ద ప్రాజెక్టును చేపట్టడం అర్థరహితమన్నారు. రేషన్ స్థానంలో నగదు బదిలీ చేస్తామన్న సిఎం ఆలోచనను వ్యతిరేకించారు. రాజధాని అమరావతి మహిళలపై జర్నలిస్టు కృష్ణంరాజు వ్యాఖ్యలు అమానుషమన్నారు.

సమావేశానికి హాజరైన ఎసిఎ సభ్యులు, ఇంటర్నేషనల్ క్రీడాకారులు

## 25 జిల్లాల్లో క్రికెట్ స్టేడియాల నిర్మాణానికి ప్రణాళిక

- ఎసిఎ అధ్యక్షుడు కేశినేని శివనాథ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

రాష్ట్రంలోని 25 జిల్లాల్లో క్రికెట్ స్టేడియాలు ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తామని, రాబోయే రెండేళ్లలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ)కు సొంత స్టేడియాలు ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ 72వ యాన్యువల్ జనరల్ బాడీ మీటింగ్ విజయవాడలోని నోవాటెల్‌లో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ఎసిఎ అపెక్స్ సభ్యులతో పాటు డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇంటర్నేషనల్ క్రీడాకారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కేశినేని శివనాథ్, సెక్రటరీ సానా సతీష్, అపెక్స్ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. శివనాథ్ మాట్లాడుతూ... వైజాగ్‌లో ఎసిఎ- విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఐపిఎల్ మ్యాచ్‌లు జరిగే విధంగా స్టేడియాన్ని కేవలం 45 రోజుల్లో ఆధునీకరణ పనులు పూర్తి చేశామన్నారు. వైజాగ్‌లో నాలుగు ఐపిఎల్ మ్యాచ్‌లు కేటాయించాలని కోరగా, సమయం లేకపోవడంతో రెండు మ్యాచ్‌లు మాత్రమే జరిగాయన్నారు. స్టేడియం ఆధునీకరణ పనులు చూసి బిసిసిఐ ప్రతినిధులు, ఐసిసిఐ చైర్మన్ జైషా సంతృప్తి వ్యక్తం చేయటంతో పాటు, వైజాగ్ స్టేడియానికి మరిన్ని మ్యాచ్‌లు కేటాయించాలని బిసిసిఐకి జైషా సూచించారని తెలిపారు. అందుకు అనుగుణంగా వైజాగ్ స్టేడియంలో ఉమెన్స్ క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్‌లు ఐదు జరగనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఇంటర్నేషనల్ వన్డే క్రికెట్ మ్యాచ్ కూడా జరిగే అవకాశం ఉందన్నారు. రాబోయే కాలంలో క్రీడాకారులను తయారు చేయటమే కాకుండా క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు, వసతులు కల్పించి వారిని ప్రోత్సహించటమే ధ్యేయంగా ఎసిఎ పనిచేయనుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.వెంకట రమా ప్రశాంత్, ట్రెజరర్ దండుమూడి శ్రీనివాసరావు, కౌన్సిలర్ దంతు విష్ణు తేజ, పురుషుల రిప్రజెంటివ్ ప్రసన్న కుమార్, ఉమెన్స్ రిప్రజెంటివ్ గీత, ఇంటర్నేషనల్ ప్లేయర్స్ ఎమ్మెస్‌కె ప్రసాద్, ఆర్.కల్పన పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లపై క్షేత్రస్థాయి విచారణ

- మంత్రి గొట్టిపాటి రవి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పరిశ్రమలు, వాణిజ్య వినియోగదారులకు అమర్చిన స్మార్ట్ మీటర్లపై క్షేత్రస్థాయి విచారణ నిర్వహిస్తామని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్మార్ట్ మీటర్లు అమర్చిన తరువాత విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయనే ఆరోపణలు వచ్చాయని తెలిపారు. దీనికి గల కారణాలు తెలుసుకోవాలని విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో స్మార్ట్ మీటర్ల పనితీరు ఎలా ఉంది? విద్యుత్ ఛార్జీలు అధికంగా రావడం వాస్తవమా? కాదా? అనే విషయాలపై సోమవారం నాటికి తనకు సమగ్ర నివేదిక సమర్పించాలని తెలిపారు. ఈ మీటర్ల పనితీరుపై నిశిత పరిశీలన జరుగుతోందని, ఎవరిపైనా అనవసరంగా ఒక్క రూపాయి భారం మోపేది లేదని పేర్కొన్నారు.

## అభిశంసన తప్పించుకోవాలంటే... జస్టిస్ వర్మ రాజీనామా చేయాల్సిందే

- న్యాయనిపుణులు

న్యూఢిల్లీ : పార్లమెంట్ ద్వారా అభిశంసన ముప్పును తప్పించుకోవాలంటే జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేయక తప్పదని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తన నివాసంలో కాలిపోయిన నోట్ల కట్టలు వెలుగుచూడటంతో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్ట్ జడ్జి జస్టిస్ వర్మను పదవి నుండి తప్పించేందుకు అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. జస్టిస్ వర్మ ఉభయ సభలలో ఏదో ఒక సభ ముందుకు వచ్చి తన వాదనను వినిపించాల్సి ఉంటుంది. దానికి ముందే పదవి నుండి వైదొలుగుతున్నానని ఆయన ప్రకటించవచ్చునని, ఆ మౌఖిక ప్రకటననే రాజీనామాగా భావిస్తారని న్యాయ నిపుణులు తెలిపారు. రాజీనామా చేయాలని జస్టిస్ వర్మ నిర్ణయించుకుంటే రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తికి లభించినట్లుగానే ఆయనకు పెన్షన్, ఇతర ప్రయోజనాలు వస్తాయి. పార్లమెంటే ఆయనను తొలగిస్తే ఆయనకు అలాంటి ప్రయోజనాలేవీ లభించవు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 217 ప్రకారం పదవి నుండి వైదొలుగుతున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి రాష్ట్రపతికి లేఖ రాయవచ్చు. న్యాయమూర్తి చేసే రాజీనామాకు ఎవరి ఆమోదం అవసరం లేదు. రాజీనామా లేఖ ఉంటే సరిపోతుంది. తాను పదవి నుండి వైదొలిగే తేదీని న్యాయమూర్తే తెలియజేయవచ్చు. అలాంటప్పుడు ఆ తేదీకి ముందు న్యాయమూర్తి తన రాజీనామాను ఉపసంహరించుకునే అవకాశం కూడా ఉంటుంది.

## శ్రీవారి దర్శనానికి 24 గంటలు

- క్యూలలో యాత్రికుల నిరీక్షణ

ప్రజాశక్తి- తిరుమల:

తిరుమలలో యాత్రికుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవులు.. ఆదివారం కావడంతో యాత్రికుల రద్దీ మరింత ఎక్కువైంది. అలిపిరి టోల్ గేట్ నుంచి ప్రారంభమైన రద్దీ చివరకు శ్రీవారి దర్శనం వరకూ యాత్రికుల రద్దీతో కొండ కిటకిటలాడుతుంది. యాత్రికులు ఎక్కడా ఇబ్బంది పడకుండా అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు టిటిడి అధికారుల తెలిపారు. సామాన్యులకు సత్వరం దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గతకొద్ది రోజుల నుంచి తిరుమలకు యాత్రికు రద్దీ పెరుగుతుండడంతో అందుకు అవసరమైన చర్యటలను టిటిడి జాగ్రత్తలు తీసుకుంటుంది.

**మే నెలలో హుండీ ఆదాయం రూ.108 కోట్లు**

తిరుమలలో సామాన్య యాత్రికులకు టిటిడి పెద్దపీట వేసింది. సౌకర్యాలు పెరిగాయని యాత్రికులు చెబుతున్నారు. గత మే నెలలో 23.79 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీ కానుకల ద్వారా రూ.108 కోట్ల ఆదాయం వచ్చినట్లు టిటిడి అధికారులు తెలిపారు.

మే నెలలోనే 1.62 కోట్ల లడ్డూలు యాత్రికులు విక్రయించారని, రికార్డు స్థాయిలో 1.33 కోట్ల మంది అన్నప్రసాదాలు స్వీకరణ చేశారని వెల్లడించారు. ఈ నెల ఇంకా మరింత ఆదాయం తిరుమలకు పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనం 24 గంటల సమయం పడుతోందని తెలిపారు. టైమ్ స్లాట్ దర్శనం ఐదు నుంచి ఆరు గంటల సమయం పడుతుంది. రూ.300ల ప్రత్యేక దర్శనం టికెట్లు కొనుగోలు చేసినవారికి శ్రీవారి దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది.

# శ్రీశైలానికి ముప్పు తొలగేనా?

- ప్లంజ్ పూల్‌పై కొనసాగుతున్న అధ్యయనాలు
- తాజాగా లోతుగా పూణే నిపుణుల బృందం పరిశీలన
- ఈసారైనా కేంద్ర ప్రభుత్వం స్పందించేనా?

శ్రీశైలం డ్యాం దిగువన ఏర్పడిన భారీ గొయ్యి

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

రెండు తెలుగు రాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలనేగాక విద్యుత్తు సైతం అందిస్తున్న బహుళార్థ సాధక ప్రాజెక్టు శ్రీశైలం ప్రమాదంలో పడింది. డ్యాం గేట్లు ఎత్తినప్పుడు వరద ప్రవాహ తీవ్రతకు దిగువ భాగంలో ఏర్పడిన భారీ గొయ్యి (ప్లంజ్‌పూల్) ఇంజనీర్లను కూడా ఆందోళనకు గురిచేస్తోంది. 2009 అక్టోబరులో కనీవినీ ఎరుగని రీతిలో వరదలు వచ్చాయి. జలాశయానికి 25.5 లక్షల క్యూసెక్కుల ప్రవాహం చేరింది. మళ్లీ ఆ స్థాయి వరద వస్తే తట్టుకోగలదా? ప్లంజ్‌పూల్‌లో గొయ్యి వల్ల ప్రాజెక్టు భద్రతకు ముప్పు పొంచి ఉందా? 2009 నాటి వరదలకు ఆనకట్ట సహా కుడి, ఎడమ గట్లు ఏ మేరకు దెబ్బతిన్నాయి? తదితర విషయాలు తెలుసుకునేందుకు చాలా కమిటీలు అధ్యయనం చేశాయి. మరమ్మతులకు సూచనలు చేస్తూ నివేదికలు కూడా ఇచ్చాయి. శ్రీశైలం సహా వివిధ ప్రాజెక్టుల భద్రతా, నిర్వహణ లోపాలను సమీక్షించేందుకు కేంద్ర జలవనరుల శాఖ 2014 సెప్టెంబరు 23న ఆయా రాష్ట్రాల ఇంజనీరింగ్ నిపుణులతో సమావేశం నిర్వహించింది. శ్రీశైలం భద్రతపై అధ్యయనం కోసం అప్పటి జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావుతోపాటు పలువురు ఇంజనీర్లతో నిపుణుల కమిటీని నియమించారు. ఈ కమిటీ అదే ఏడాది అక్టోబరు 28న ప్రాజెక్టును పరిశీలించి డ్యాం భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇచ్చింది. 2017 జులై 13న కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ డాక్టర్ వైకె మూర్తి నేతృత్వంలోని కమిటీ, 2018 జూన్ 11, 12న జలవనరుల శాఖ రిటైర్డ్ ఇఎన్‌సి పి.రామరాజు, రిటైర్డ్ సిఇ కె.సత్యనారాయణ, రిటైర్డ్ ఇఇ కె.కృష్ణ కమిటీ, 2020 ఫిబ్రవరి 25న కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్, డ్యాం భద్రతా నిపుణులు ఎబి పాండ్యా నాయకత్వంలో కేంద్ర నిపుణుల కమిటీ డ్యాంను పరిశీలించాయి. అన్ని కమిటీలూ ప్లంజ్‌పూల్ వల్ల జలాశయానికి ముప్పు పొంచి ఉందని నివేదికలు ఇచ్చాయి. గతేడాది ఫిబ్రవరి 8న నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) చైర్మన్ వివేక్ త్రిపాఠి నాయకత్వంలో ఎన్‌డిఎస్‌ఎ సభ్యులు, కేంద్ర జలసంఘం, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, సెంట్రల్ సాయిల్ మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ (సిఎస్‌ఎంఆర్‌ఎస్) నిపుణులు, ఎపి, తెలంగాణ ఇంజనీర్ల కమిటీ సభ్యులు శ్రీశైలం జలాశయాన్ని సందర్శించారు. ఆనకట్ట స్పిల్‌వే గేట్ల నుంచి అతివేగంగా కింద పడే వరద మళ్లీ ఎగిరి పడే ప్రాంతంలో ఏర్పడిన భారీ గొయ్యిని పరిశీలించారు. ఈ గొయ్యి 45 మీటర్లు లోతు, 270 మీటర్లు వెడల్పు, 400 మీటర్లు పొడవు ఉంటుందని అంచనా వేశారు. ప్లంజ్‌పూల్ ప్రాంతంలో ఏర్పడిన భారీ గొయ్యి వల్ల డ్యాం భద్రతకు, ప్రాజెక్టు రెండు వైపులా ఉన్న గట్లు, ఆనకట్ట పునాదిపై తీవ్ర ప్రభావం పడుతోందని, ఇప్పటికే నష్టం జరిగిన ప్రొటెక్షన్ సిలిండర్స్ రిహాబిటేషన్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని, కుడి, ఎడమ గట్లకు నష్టం జరగకుండా మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రాజెక్టు శాశ్వత మరమ్మతుల కోసం 'డ్యాం రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం' (డ్రిప్-2) కింద రూ.139 కోట్లు ఇవ్వాలని ఇంజనీర్లు గతంలో కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు. నిధులు ఇవ్వకపోగా కేంద్రం పలు కొర్రీలు పెట్టింది. మరోసారి రూ.190 కోట్లతో మరో ప్రతిపాదన పంపిస్తే దానిని కూడా ఆమోదించలేదు. తాజాగా పూణేకు సంబంధించిన నలుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన సిడబ్ల్యుపిఆర్ఎస్ (సెంట్రల్ వాటర్ పవర్ రీసర్చ్ స్టేషన్) బృందం గత నెల 20న శ్రీశైలం డ్యాంను పరిశీలించింది. మళ్లీ ఈ నెల మూడు నుంచి గురువారం వరకూ పర్యటించింది. సాంకేతిక పరిజ్ఞాన పరికరాలతో బేతమేటికల్ సర్వే చేసింది. ఈ సర్వేలో అండర్ వాటర్ డ్రోన్‌లు, పరికరాల సాయంతో ద్వారా ప్లంజ్ పూల్‌లోతు, వెడల్పుతోపాటు డ్యాముకు ప్లంజ్ పూల్ వల్ల కలిగే పరిమాణాల వంటి పలు అంశాలపై అధ్యయనం చేసింది. ఈ నివేదికను సిడబ్లుసి (సెంట్రల్ వాటర్ కమిషన్)కి సమర్పించనుంది. ఈసారైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ప్లంజ్ పూల్‌ను పూడ్చేందుకు చర్యలు చేపట్టి శ్రీశైలం జలాశయానికి పొంచి ఉన్న ముప్పును తొలగిస్తుందో? లేదో? వేచి చూడాల్సిందే.

## పతంజలికిచ్చిన భూములు వెనక్కి తీసుకోవాలి

- సిఎస్‌కు ఐఎఎస్ శర్మ లేఖ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఫుడ్‌పార్కు పేరిట విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చినరావుపల్లి రెవెన్యూ పరిధిలోని సుమారు 172.84 ఎకరాలను తీసుకుని ఎనిమిదేళ్లు గడిచినా ఫుడ్‌పార్కు ఏర్పాటుకు ముందుకు రాని పతంజలి సంస్థపై చర్యలు తీసుకోవాలని, ఆ భూములను తిరిగి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజల తరపున రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి (ఐఎఎస్) శర్మ లేఖ రాశారు. ఆ లేఖను శనివారం మీడియాకు విడుదల చేశారు. 2017 ఫిబ్రవరి 28న అప్పటి టిడిపి ప్రభుత్వం భూములను కేటాయించిందని, కాలపరిమితి దాటినప్పటికీ పార్కు ఏర్పాటు చేయలేదని, ఆయా భూముల్లో అప్పటి వరకు జీవనోపాధి పొందిన కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. ఈ పార్కు ద్వారా కొత్తగా సృష్టిస్తామన్న ఉద్యోగాలూ రాలేదు సరికదా, అప్పటి వరకు ఆ భూమిపై జీవనోపాధి పొందే పేదలు కూడా ఆర్థికంగా కుదేలయ్యారని తెలిపారు. ఆ భూములను పేదలకు అప్పగించడంతో పాటు వారికి డి-పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూములను ప్రయివేట్ కంపెనీలకు కేటాయించడం చట్టవిరుద్ధమని 2011 జనవరి 28న జగపాల్‌సింగ్ కేసులో రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసిందని గుర్తుచేశారు. భూమి ధర ఎకరా రూ.20 లక్షల వరకు ఉన్నప్పటికీ కేవలం రూ.మూడు లక్షల చొప్పున కేటాయించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరించడమే అవుతుందని, ఈ నేపథ్యంలో సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు రాజకీయ నాయకులు, అధికారులు జవాబుదారీగా ఉండడం అవసరమని లేఖలో పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్ తేజ, పక్కన నాయకులు

# అభివృద్ధిలో శ్రమ పాత్రే కీలకం

- ప్రముఖ సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ
- సిఐటియు ఆధ్వర్యాన ఏలూరులో 60వ శ్రమకావ్యం గానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమాజ పరిణామం, అభివృద్ధిలో శ్రమ పాత్రే కీలకమైందని ప్రముఖ సినీ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ అన్నారు. ఏలూరులోని టొబాకో మర్చంట్స్ కల్యాణ మండపంలో సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 60వ శ్రమకావ్య గానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ ఆహ్వానం పలకగా, సిఐటియు జిల్లా అధ్యక్షులుఆర్.లింగరాజు అధ్యక్షత వహించారు. తాను రచించిన శ్రమకావ్యం పుస్తకంలో అనేక ఘట్టాలను అశోక్ తేజ ఆలపిస్తూ సవివరంగా విశ్లేషించారు. మానవ సమాజాభివృద్ధిలో శ్రమ పాత్రను వచన కవిత్వంతో వివరిస్తూ శ్రోతలను విశేషంగా ఆకర్షించారు. రిటైర్డ్ జిల్లా రిజిస్ట్రార్, రచయిత లంక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. శ్రమకావ్యం రచనలో శ్రమను వస్తువుగా తీసుకుని రచన చేయడం సాహసోపేతమని అన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... సంపద సృష్టికర్తలైన కార్మికుల శ్రమను తక్కువ చేసి కార్పొరేట్లే సంపద సృష్టికి మూలం అని ప్రస్తుత పాలకులు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వాలని దేశవ్యాప్తంగా సిఐటియు అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో జులై తొమ్మిదిన దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ... అత్యంత సరళంగా సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా శ్రమకావ్యాన్ని సుద్దాల రచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జివిఎల్.నరసింహారావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య ప్రసంగించారు. సిఐటియు జిల్లా కోశాధికారి ఐవి.సుధాకర్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.విజయలక్ష్మి, ఎం.నాగమణి, బి.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు పశువుల కాపరి మృతి

- మరో ముగ్గురికి అస్వస్థత

ప్రజాశక్తి - చాట్రాయి (ఏలూరు)

పిడుగుపాటుకు పశువుల కాపరి మరణించిన సంఘటన ఏలూరు జిల్లా చాట్రాయి మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..పోతనపల్లి గ్రామానికి చెందిన కాపరులు తమ పశువులను తోలుకుని గ్రామ పొలాల్లోకి వెళ్లారు. ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కాపరులందరూ చెట్టుకిందకు వెళ్లారు. ఆ చెట్టుపైన పిడుగుపడడంతో అబ్బదాసరి శాంతకుమారి (45) అక్కడికక్కడే మరణించారు.

మరో ముగ్గురు కంచర్ల ఇజ్రాయేలు, పచ్చిగోళ్ల వెంకీ, కొమరవరపు రమేష్ అస్వస్థతకు గురయ్యారు. మెరుగైన వైద్యం నిమిత్తం వారిని చింతలపూడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలు శాంతకుమారికి భర్త, వివాహితురాలైన కుమార్తె ఉన్నారు.

## అక్టోబర్ 2, 3 తేదీల్లో సత్తెనపల్లిలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ అక్టోబర్ 2, 3 తేదీలలో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న కార్పొరేట్ విధానాల్లో భాగంగా చేనేతను ధ్వంసం చేసేలా పవర్‌లూమ్‌లను ప్రోత్సహిస్తున్నారని, యజమానులకు రాయితీలు ఇస్తున్నారని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లను అమలు చేయడం లేదని విమర్శించారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పక్కనే ఉన్న బత్తలపల్లి గ్రామంలో జెట్లూమ్స్ ఏర్పాటు చేసిన 200 మగ్గాలకు కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్ల వరకు సబ్సిడీ ఇచ్చినట్లు ప్రచారం జరిగిందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఆందోళన చేసిన చేనేతలను, నాయకులను అరెస్ట్ చేశారని తెలిపారు. చంద్రబాబు సిఎం అయిన తర్వాత ఈ సంవత్సరం కాలంలో చేనేతకు నామమాత్రపు బడ్జెట్‌తో మోసం చేశారని, ఉచిత కరెంటు అమలుకు ఆదేశాలు ఇవ్వలేదని, త్రిఫ్ట ఫండుకు కేటాయించిన రూ.ఐదు కోట్లనూ విడుదల చేయలేదని చెప్పారు. ఈ సమస్యలపై మహాసభలో పలు తీర్మానాలు చేసి చేనేత కార్మికులను పోరాటాల్లోకి తీసుకురావడానికి సమాయత్తం చేస్తామన్నారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె రాజు, సహాయ కార్యదర్శి డి రామారావు, నాయకులు వి గంగాధరరావు పాల్గొన్నారు.

కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

# డిఎస్సీ ప్రత్యేకం -ఎస్ఎ/ఎస్‌జిటి

## జనరల్ నాలెడ్జ్ : కరెంట్ ఎఫైర్స్

### ప్రపంచంలో అత్యంత పొడవైనవి

1. ప్రపంచంలో అత్యంత ఎత్తులో హైస్పీడ్ రైలు సొరంగం ఎక్కడ ఉంది?
(ఎ) భారత్ (బి) అమెరికా (సి) చైనా ( డి) ఫ్రాన్స్

2. ప్రపంచంలో పొడవైన గాజు వంతెనను ఏ దేశంలో ప్రారంభించారు?
(ఎ) భారత్ (బి) అమెరికా (సి) చైనా (డి) ఫ్రాన్స్

3. ప్రపంచంలో కెల్లా అతి పెద్ద రేవు పట్టణం ఎక్కడ కలదు?
(ఎ) టోక్యో (బి) బుడాపెస్ట్ (సి) మాడ్రిడ్ (డి) న్యూయార్క్

4. ప్రపంచంలో అతిపెద్ద డ్యామ్?
(ఎ) త్రిగోర్జెస్ (బి) డేవిస్ (సి) హీరాకుడ్ (డి) ఎతోపా

5.ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ విద్యుత్ కేంద్రం భారత్‌లోని ఏ రాష్ట్రంలో ఉంది?
(ఎ) తమిళనాడు (బి) రాజస్థాన్
(సి) కేరళ (డి) మధ్యప్రదేశ్

6.ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రహదారిని భారత్‌లోని ఏ రాష్ట్రంలో నిర్మించారు?
(ఎ) పశ్చిమబెంగాల్ (బి) జమ్మూ కాశ్మీర్
(సి) కేరళ (డి) గుజరాత్

7. ప్రపంచంలో ఎత్తైన బుద్ధుని ఏకశిలా విగ్రహం ఎక్కడ ఉంది?
(ఎ) మయన్మార్ (బి) చైనా (సి) భారతదేశం (డి) శ్రీలంక

8.చంద్రునిపైకి మానవుడిని పంపిన తొలిదేశం ఏదీ?
(ఎ) అమెరికా (బి) రష్యా (సి) జపాన్ (డి) బ్రిటన్

9. ప్రపంచంలో మొదటి రైలుమార్గం ఎక్కడ వేయబడింది?
(ఎ) ఇంగ్లాండ్ (బి) అమెరికా
(సి) యూరప్ (డి) ఇండియా

10. ప్రపంచంలో అతిపెద్ద ఆకు ఏది?
(ఎ) విక్టోరియా అమెజానిక (బి) రఫ్లీషియా
(సి) యూకలిప్టస్ (డి) లయాడ్

11.ప్రపంచంలోనే ఎత్తైన గాలి సొరంగం (విండ్ టన్నెల్)ను ఏర్పాటు చేస్తున్న దేశం?
(ఎ) ఖతర్ (బి) భారత్ (సి) దుబాయ్ (డి) సింగపూర్

12. ఈ క్రింది వాటిలో అతిపురాతనమైన అబ్జర్వేటర్ ఎక్కడ ఉంది?
(ఎ) మౌంట్ ష్పిన్స్ (అమెరికా) (బి) గ్రీన్విచ్ (బ్రిటన్)
(సి) జెనీవా (స్విట్జర్లాండ్) (డి) కోపెన్హాగన్ (డెన్మార్క్)

13. ప్రపంచంలో పొడవైన కారిడార్ ఉన్న దేవాలయం ఎక్కడ ఉంది?
(ఎ) శ్రీరంగం (బి) రామేశ్వరం
(సి) కాంచీపురం (డి) మధురై

14. ప్రపంచంలో మొదటి ఉపగ్రహాన్ని ప్రయోగించిన దేశం ఏది?



(ఎ) జపాన్ (బి) అమెరికా
(సి) పూర్వ సోవియట్ యూనియన్ (డి) భారతదేశం

15.పోటీపరీక్షల ద్వారా ఉద్యోగులను నియమించే పద్ధతిని ప్రవేశపెట్టిన మొదటి దేశం ఏది?
(ఎ) నెదర్లాండ్స్ (బి) చైనా (సి) స్విట్జర్లాండ్ (డి) జపాన్

16.ఈ క్రింది వాటిలో ప్రపంచంలో ఎత్తైన జలపాతం ఏది?
(ఎ) జోగ్ జలపాతం (బి) నయాగర జలపాతం
(సి) మెనాల్ జలపాతం (డి) ఏంజెల్ జలపాతం

17.ప్రపంచంలోకెల్లా అతి పెద్ద దేవాలయం ఎక్కడ ఉంది?
(ఎ) అనంత పద్మనాభస్వామి దేవాలయం (భారత్)
(బి) అంగ్‌కోర్ వాట్ (కంబోడియా)
(సి) తిరుపతి (భారత్)
(డి) శ్రీరంగం (భారత్)

18.ప్రపంచంలో విస్తీర్ణం దృష్ట్యా అతిచిన్న దేశం ఏది?
(ఎ) గ్రెనెడా (బి) క్యూబా (సి) వాటికన్ సిటీ (డి) జపాన్

19. ఈ క్రింది వాటిలో ప్రపంచంలో ఎత్తైన సరస్సు ఏదీ?
(ఎ) విక్టోరియా సరస్సు (బి) కాస్పియన్ సముద్రం
(సి) టిటికాకా సరస్సు (డి)సుపీరియర్ సరస్సు

20. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తరువాత ప్రపంచంలో విస్తీర్ణం దృష్ట్యా పెద్ద దేశం ఏది?
(ఎ) రష్యా (బి) అమెరికా (సి) చైనా (డి) కెనడా

21. ప్రపంచంలో అతిపెద్ద ఉప్పునీటి సరస్సు ఏది?
(ఎ) సుపీరియర్ సరస్సు (బి) కాస్పియన్
(సి) బైకాల్ సరస్సు (డి) టిటికాకా సరస్సు

22. ప్రపంచంలో పొడవైన తీరరేఖ గల దేశం ఏది?
(ఎ) అమెరికా (బి) కెనడా (సి) రష్యా (డి) భారత్

23. ప్రపంచంలో పెద్దదైన ద్వీపం ఏది?
(ఎ) టాస్మానియా (బి) సైప్రస్
(సి) ఐస్‌లాండ్ (డి) గ్రీన్‌లాండ్

24. ఆసియాలో మొదటి పులుల సఫారీ కేంద్రాన్ని ఎక్కడ ఏర్పాటు చేశారు?
(ఎ) బ్యాంకాక్ (బి) ఉత్తరాంచల్ (సి) పెనాగ్ (డి) టోక్యో

25. మానవుడు మొట్టమొదటిసారి చంద్రుడిపై కాలుమోపడానికి ఉపయోగించిన అంతరిక్ష నౌక ఏది?
(ఎ) అపోలో (బి) ఈగల్ (సి)చాలెంజర్ (డి) ఎక్స్ ప్లోరర్

26.ప్రపంచంలో అతి పెద్ద ద్వీపాల సమూహం (ఆర్చిపెలాగో) ఏది?
(ఎ) ఇండోనేషియా (బి) జపాన్ (సి) వెస్టిండీస్ (డి) పిలిప్పీన్స్

27.అంతరిక్షంలోకి ప్రయోగించిన మొదటి ఉపగ్రహం ఏది?
(ఎ) పయనీర్ (బి) లూనా-1
(సి) స్పుత్నిక్ (డి) అపోలో-2

28.ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న చమురు శుద్ధి కర్మాగారాల్లో అతి పురాతనమైనది ఎక్కడ ఉంది?
(ఎ) కోయాలి (బి) గౌహతి (సి)దిగ్బోయ్ (డి) బరోడా

29. ప్రపంచంలో మానవ నిర్మిత కాలువల్లో పెద్దదైన కాలువ ఏది?
(ఎ) రైన్ కాలువ (బి) పనామా కాలువ
(సి) సూయిజ్ కాలువ (డి) కీల్ కాలువ

30. ప్రపంచంలో విశాలమైన సింధూశాఖ (గల్ఫ్) ఏది?
(ఎ) గల్ఫ్ ఆఫ్ మెక్సికో (బి) గల్ఫ్ ఆఫ్ కాంబే
(సి) పర్షియన్ గల్ఫ్ (డి) హోర్మూజ్ జలసంధి

31. ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ఇసుక ఎడారి (ఎర్గ్) ఏది?
(ఎ) సహారా (బి) కలహారి
(సి) థార్ (డి) రుబ్-అల్-ఖలి

32. ప్రపంచంలో అతి పెద్ద సముద్ర వంతెన ఏ దేశంలో ఉంది ?
(ఎ) జపాన్ (బి) అమెరికా (సి) చైనా (డి) భారత్

33.ప్రపంచంలో పెద్దదైన ఆటోమొబైల్ పరిశ్రమ ఎక్కడ ఉంది?
(ఎ) డెట్రాయిట్ (బి) టోక్యో
(సి) బర్మింగ్‌హామ్ (డి) బెర్లిన్

34. ప్రపంచంలో లోతైన సరస్సు ఏది?
(ఎ) టిటికాకా సరస్సు (బి) బైకాల్ సరస్సు
(సి) సుపీరియర్ సరస్సు (డి) కాస్పియన్ సరస్సు

35. ప్రపంచంలో అతిపెద్ద మంచినీటి సరస్సు ఏది?
(ఎ) సుపీరియర్ సరస్సు (బి) కాస్పియన్ సముద్రం (సి) మిచిగాన్ సరస్సు (డి) విక్టోరియా సరస్సు

36. ప్రపంచంలో పెద్దదైన పీఠభూమి ఏది?
(ఎ) అలస్కా (బి) లాబ్రడార్
(సి) ఆరేబియా (డి) స్కాండినేవియా

37.ప్రపంచంలో పొడవైన నది ఏది?
(ఎ) డాన్యూబ్ (బి) అమెజాన్ (సి) మిసిసిపి (డి) నైలు

38. ప్రపంచంలో అత్యంత లోతైన ప్రదేశం ఏది?
(ఎ) టోంగా కెర్మాడెక్ (బి) కురిల్-కమ్‌చట్‌కా
(సి) మేరియానా (డి) ఫిలిఫైన్స్

39. ప్రపంచంలో అతి పెద్ద ఎడారి ఏది?
(ఎ) ఆరేబియా (బి) సహారా
(సి) గ్రేట్ విక్టోరియా (డి) కలహారి

40. ప్రపంచంలో అతి పెద్ద, లోతైన మహా సముద్రం ఏది?
(ఎ) ఫసిఫిక్ మహాసముద్రం
(బి) అట్లాంటిక్ మహాసముద్రం
(సి) హిందూ మహాసముద్రం
(డి) ఆర్కిటిక్ మహాసముద్రం

41. ప్రపంచంలో కెల్లా పెద్దదైన లయాడ్ అనే వ్యవసాయ కాలువ ఏ దేశంలో ఉంది?
(ఎ) కెనడా (బి) రష్యా (సి) ఇంగ్లాండ్ (డి) పాకిస్తాన్

42. ప్రపంచంలో అతిపొడవైన పర్వతశ్రేణి ఏది?
(ఎ) రాకీ పర్వతాలు (బి) ఆండీస్
(సి) ఆప్పలేచియన్ (డి) యూరప్

43. ప్రపంచంలో ఎత్తైన పీఠభూమి ఏది?
(ఎ) పామీర్ పీఠభూమి (బి) అరేబియా పీఠభూమి (సి) మంగోలియా పీఠభూమి (డి) అలస్కా పీఠభూమి

44. ప్రపంచంలో విస్తీర్ణం దృష్ట్యా పెద్దదైన నది ఏది?
(ఎ) నైలునది (బి) అమెజాన్ నది
(సి) రైన్‌నది (డి) మిసిసిపి

45.ప్రపంచంలో పెద్దదైన అంతర్జాతీయ విమానాశ్రయం ఏది?
(ఎ) బాగ్దాద్ విమానాశ్రయం
(బి) లెహ్ విమానాశ్రయం
(సి) హార్ట్స్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం
(డి) హీత్రూ విమానాశ్రయం

46. ప్రపంచంలోనే అతి పెద్ద హైడ్రో ఎలక్ట్రిక్ డ్యామ్ ఏ దేశంలో ఉంది?
(ఎ) కాంగో (బి) భారత్ (సి) చైనా (డి) ఆస్ట్రేలియా

47. ప్రపంచంలో అతి పెద్ద ఖండం ఆసియా కాగా అతిచిన్న ఖండం ఏది?
(ఎ) ఆఫ్రికా (బి) ఉత్తర అమెరికా
(సి) దక్షిణ అమెరికా (డి) ఆస్ట్రేలియా

48. ప్రపంచంలో అత్యంత రద్దీ ఉన్న విమానాశ్రయం ఏది?
(ఎ) అట్లాంటా హార్ట్స్ ఫీల్డ్ విమానాశ్రయం
(బి) కింగ్ ఖలీద్ విమానాశ్రయం
(సి) టోక్యో విమానాశ్రయం (డి) బీజింగ్ విమానాశ్రయం

49. ప్రపంచంలో అతిపొడవైన గోడ ఎక్కడ ఉంది?
(ఎ అమెరికా (బి) రష్యా (సి) చైనా (డి) జపాన్

50.ప్రపంచంలో ఎత్తైన లైట్‌హౌస్ ఎక్కడ ఉంది?
(ఎ) జపాన్ (బి) చైనా (సి) బ్రిటన్ (డి) అమెరికా

51.ప్రపంచంలో అతి ఎత్తైన భవనం ఎక్కడుంది?
(ఎ) పెట్రోనాస్ టవర్ (కౌలాలంపూర్)
(బి)బుర్జ్ ఖలీఫా (సౌదీ అరేబియా)
(సి) నియర్స్ టవర్స్ (చికాగో)
(డి)ఎంపైర్ స్టేట్‌బిల్డింగ్ (న్యూయార్క్)

52. ప్రపంచ అద్భుతాల్లో ఒకటైన లివింగ్ టవర్ ఆఫ్ పీసా ఎక్కడ ఉంది?
(ఎ) జర్మనీ (బి) జపాన్ (సి)ఇటలీ (డి) ఫ్రాన్స్

53.నేటి ప్రపంచ అద్భుతాల్లో ఒకటైన ఈఫిల్ టవర్ ఎక్కడ ఉంది?
(ఎ) పారిస్ (బి) న్యూయార్క్
(సి) జెనీవా (డి) శాన్‌ఫ్రాన్సిస్కో

54.ఈ క్రింది వాటిలో ప్రస్తుత ప్రపంచ అద్భుతాల్లో ఒకటి కానిది ఏది?
(ఎ) ఈజిప్టులోని పిరమిడ్లు
(బి) ఆగ్రాలోని తాజ్‌మహల్
(సి) పారిస్‌లోని ఈఫిల్ టవర్ (డి) పైవన్నీ సరైనవే

55.ప్రపంచంలో ఎత్తయిన రాజధాని నగరం ఏదీ?
(ఎ) పారిస్ (బి) లాపాజ్ (సి) టోక్యో (డి) బీజింగ్

56. ప్రపంచంలో విశాలమైన పట్టణం ఏది?
(ఎ) మౌంట్ ఈసా (బి) అక్లాండ్
(సి) మెల్‌బోర్న్ (డి) వెంచువాన్

57. ప్రపంచంలో పెద్దవి అయిన కోనిఫెరస్ అడవులు ఎక్కడ ఉన్నాయి?
(ఎ) ఉత్తర అమెరికా (బి) ఉత్తర రష్యా
(సి) దక్షిణ చైనా (డి) మధ్య భారతదేశం

58.ప్రపంచంలో పెద్దదైన జంతువు ఏదీ?
(ఎ) నీటి తిమింగళం (బి) భారతదేశ ఏనుగు
(సి) నీటిగుర్రం (డి) జిరాఫీ

59. ప్రపంచంలో అతి పురాతనమైన రాచరిక వ్యవస్థ ఉన్న దేశం ఏది?
(ఎ) నేపాల్ (బి) సౌదీ ఆరేబియా (సి) జపాన్ (డి) బ్రిటన్

60.జూడోలో అత్యున్నత అవార్డు ఏదీ?
(ఎ) 10వ డాన్ (బి) 12వ డాన్
(సి) ఎల్లో బెల్ట్ (డి) బ్లాక్‌బెల్ట్

61. లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్ అనే సంచార రైలు ఆసుపత్రిని ప్రారంభించిన మొదటి దేశం ఏది?
(ఎ) అమెరికా (బి) బ్రిటన్ (సి) రష్యా (డి) ఇండియా

62 ఎవరెస్ట్ శిఖరాన్ని ఏ సంవత్సరంలో విజయవంతంగా అధిరోహించారు?
(ఎ) 1953 (బి) 1962 (సి) 1965 (డి) 1968

63 ఎవరెస్ట్ శిఖరాన్ని రెండుపార్లు అధిరోహించిన మొదటి వ్యక్తి ఎవరు?
(ఎ) ఎడ్మంట్ హిల్లరీ (బి) టెన్సింగ్ నార్కే
(సి) అంగ్‌రీటా షెర్పా (డి) నవాంగ్ గోంబు

64. భారత్‌లోనే అతి పెద్ద ఎత్తైన క్రీస్తు విగ్రహాన్ని ఎక్కడ నెలకొల్పారు ?
(ఎ)బెంగుళూరు (బి) చెన్నై
(సి) ముంబై (డి) తిరువనంతపురం

65. 'స్టాచ్యు ఆఫ్ యూనిటీ' విగ్రహం ఎక్కడ ఉంది?
(ఎ) గుజరాత్ (బి) పశ్చిమబెంగాల్
(సి) బీహార్ (డి) ఉత్తరప్రదేశ్

**రేపటి సంచికలో : ఆవిష్కరణలు**

**జవాబులు**

(1) సి (2) డి (3) డి (4) ఎ (5) ఎ (6) బి (7) సి (8) ఎ (9) ఎ (10) ఎ (11) సి (12) డి (13) బి (14) సి (15) బి (16) డి (17)బి (18) సి (19) సి (20) ఎ (21) బి (22) బి (23)డి (24) బి(25) ఎ (26) ఎ (27) సి (28) సి (29) సి (30) ఎ (31) 4 (32) 3 (33) 1 (34) 2 (35) 1 (36) 3 (37)4 (38) 3 (39) 2 (40) 1 (41) 4 (42) 2 (43) 1 (44) 2 (45) 3 (46) 1 (47) 4 (48) 1 (49) 3 (50) 1 (51) 2 (52) 3 (53) 1 (54) 4 (55) 2 (56) 1 (57) 2 (58) 1 (59) 3 (60) 4 (61) 4 (62) 1 (63) 4 (64) 4 (65) 1

# అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 9 జూన్ 2025

"సామాజిక జీవితం లేకపోతే
సాహిత్యం అనేదే సాధ్యం కాదు.
ఈ సంగతి జ్ఞప్తిలో ఉంచుకుంటే
సాహిత్యం ఎందుకు? ఎవరికి? అనే రెండు
ప్రశ్నలకూ జవాబు వస్తుంది.
– మహాకవి శ్రీశ్రీ

# సాహిత్య చతుర్భుజి ముకుంద రామారావు

'కవిత్వంలో జీవితమూ ఉంది, జీవితంలో కవిత్వమూ ఉంది. నా వరకూ నాకు రెండూ విడదీయలేనివి. వలస కూడా నాకు అటువంటిదే. నా కవిత్వంలోనే కాదు, బహుశ నా రక్తంలోనే వలస ఉంది. కనిపించే వలసలు కొన్నయితే, కనిపించని వలసలు మరెన్నో. చదువుకోసం, ఉద్యోగం కోసం జీవిత భాగస్వామి కోసం... ఏదైతేనేంఅన్నీ ఒక విధంగా వలసలే కదా! 'అంతెందుకు మన కలల్లో ఎన్నెన్ని వలసలో' అని అంటారు రామారావు తన 'ఆసక్తి' (2024) వ్యాస సంపుటిలో. ఇది స్థూలంగా ముకుందరావు సాహిత్యంలో తరుచూ కనిపించే ఇతివృత్తం.

'ఆకాశమంత విశాలమైన రాత్రిలో/ నా నీడలు నాలోనే నిద్రిస్తాయేమో/ రాత్రి రహస్యంగా రాత్రిని పోషిస్తున్నట్టు/ తెలిసీ తెలియనివేవో కలల్ని పోషిస్తాయేమో/' – అన్న 'రాత్రి వీస్తున్న గాలి' (2024) కవితలో ఒక అద్భుత సృష్టి వైచిత్రి కనపడుతుంది. అందరికీ 'రాత్రి' అనేది ఒకటి ఉందని తెలుసును. కానీ, ఆ రాత్రిలో నీడలు లీనమవుతాయని (నిద్రిస్తాయి) ఎంతమందికి తడుతుంది. ఇక్కడ 'నీడలు' అనంత అర్థాన్ని ఆపాదించుకొంటాయి. అంత అర్థం ఆపాదించినా చివరకు అవి 'నిద్ర' ద్వారా వాటి ఉనికిని కోల్పోక తప్పదు కదా! 'రాత్రిని రాత్రే పోషిస్తుంది' అనటంలో రాత్రి ఎంత స్వతంత్రత కలిగిన ఒక మహత్తర శక్తో మనకు తట్టి చెప్పినట్టయింది. 'కలలు' అందరూ కంటారు. కొన్ని కలలు చిందర వందరగా అర్థరహితంగా ఉంటాయి. కొన్ని మధురంగా కూడా ఉంటాయి. కానీ ఈ కలలకు పోషణ ఎక్కడినుంచి వస్తుందంటే – 'కలల్ని కలలే పోషిస్తాయి' అని అనల్పార్థాన్ని అల్పాక్షరాలలో అక్షరబద్ధం చేశారు రామారావు.

ముకుంద రామారావు సాహితీ ప్రయాణం ఒక చతుర్భుజి చుట్టూ సాగిందనిపిస్తుంది. ఒక భుజం 'వలస సాహిత్యం' అయితే, మరొకటి 'అనువాద సాహిత్యం'. మూడవది 'స్వీయ సాహిత్యం' అయితే, నాలుగవది అన్య దేశీయుల 'వేదనా సాహిత్యం'. ఇక్కడో కవితా వైశిష్ట్యం కనబరుస్తారు ముకుంద రామారావు. 'వలస సాహిత్యం' వలస ఇతివృత్త ప్రధానమైనా, అది ఆయన 'స్వీయ సాహిత్యం' అవటమే గాక, అందులో 'వేదన' వ్యక్తపరచడం ఈ సాహిత్య మరో కోణం.

'వలస వేదన/ చెరువులో నీరులా ఉండక/ సమస్తం వదిలి/ సముద్రాలు దాటిపోవట మెందుకో'తో ఆరంభించి 'అయినా ప్రవహించే నీరు/ ముందుకు పోలేనప్పుడు/ అక్కడే అలా/ ఇంకిపోవడం/ ఆరిపోవటం లోనే/

ఆనందముందేమో! అవునా తాతయ్యా?' అంటూ తన వంశీకులు తొలిసారి ఆఫ్రికాకు వలస పోవటం గురించి ప్రశ్నిస్తారు.

ఆశ్చర్యమేమంటే ముకుంద రామారావు తాతలు కాలంనాడు ఆఫ్రికాకు చెరకు తోటల సాగుచేయడానికి వలస వెళ్లారు. అక్కడినుంచి వీరి తల్లిదండ్రులు వచ్చి అనకాపల్లిలో కొంతకాలం ఉండి, అక్కడి నుండి తమ బంధువులున్న ఖరగపూర్ వెళ్లి స్థిరపడ్డారు. అక్కడే యల్లపు ముకుంద రామారావు నవంబరు 9, 1944లో జన్మించారు. ఇప్పుడు వీరికి 80 వసంతాలు నిండాయి. రామారావు తండ్రి పెద్దగా చదువుకోలేదు. ఆయన 13 ఏళ్లకే రైల్వేలో ఉద్యోగంలో చేరారు.

తాత గారికి ఉన్న సాహిత్యాభిలాష రామారావును చాలా ప్రభావితం చేసింది. ఆపైన ఖరగపూర్‌లో తెలుగు మాట్లాడేవారు ఎక్కువమంది ఉండటం, ఆయన చదువుకొన్న పాఠశాలలో ఆంధ్రా నుంచి వచ్చే అనేకమంది సాహిత్యవేత్తల పరిచయ భాగ్యం, వారి సాంగత్యం తనపైన ఎంతో ప్రభావం చూపిందని చెప్పుకొచ్చారు 'నా కవిత్వ ప్రయాణం (లేదా) సాహిత్యంతో నా సహవాసం' వ్యాసంలో (ఆసక్తి, 2024). పిన్న వయస్సులోనే రామారావుకు ప్రసిద్ధ తెలుగు రచయితలైన ముద్దంశెట్టి హనుమంతరావు, ఎన్ఆర్ నంది, ఘండికోట బ్రహ్మాజీరావు, వాసిష్ఠ, వజ్రపాణి, కుప్పిలి జానకిరామ్, పట్నాయక్ లాంటి వారితో పరిచయం కలిగింది. అప్పటికే రామారావు చిన్న చిన్న కథలు రాయటం ఆరంభించారు.

రామారావు ముందు తరాల్లో ఎవ్వరికీ పెద్దగా చదువు లేదు. కానీ, రామారావు మాత్రం సాగర్



విశ్వవిద్యాలయం నుండి సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ సాధించారు. కంప్యూటర్ నెట్వర్కింగ్‌లో అదనపు అర్హతలు సంపాదించారు. డిగ్రీకి ముందు ప్రీ యూనివర్సిటీ చదువు ఒక సంవత్సరం ఆయన తన స్వస్థలం అనకాపల్లిలో చేశారు. తిరిగి డిగ్రీకి ఖరగపూర్ వెళ్లారు. రైల్వేస్‌లో పనిచేస్తున్నప్పుడు ప్రయాణీకుల సౌలభ్యం కోసం ఈయన సృజించిన నెట్వర్కింగ్ టెర్మినల్స్ నేటికీ రైల్వేస్ వాడుతూనే ఉన్నాయి. రైల్వేలో పని మానేసి, ఆయన హెచ్‌పి (హ్యూవెలెట్ పకార్డ్) కంపెనీలో చేరి ఒక సంవత్సరం కంపెనీ పనిపై అమెరికా వెళ్లారు. ఈ పయనం ఆయన సాహితీ జీవితానికి కొత్త కోణాలను చేర్చింది.

రామారావు సాహిత్య ప్రయాణంలో ఎదురైన మలుపులు, ఒక్కో మలుపులో ఆయన చేనుంచి రాలిన అక్షయ అక్షర తూలికలు సవివరంగా పొందుపరిచారు 'వలస వేదన – నా కవిత్వం', 'నా కవిత్వ వేదన (లేదా) సాహిత్యంతో నా ప్రయాణం', 'రాయాల్సింది ఇంకా రాయనే లేదు', 'మా ఊరంటే నా కిష్టం', 'విన్నకోట రవిశంకర్‌తో ఇష్టాగోష్ఠి', 'చేకూరి రామారావు మాస్టారుతో మరిచిపోలేని జ్ఞాపకాలు' వంటి వ్యాసాలలో. అవన్నీ చదివి తీరవలసిన మైలు రాళ్లే.

స్వస్థలమైన తెలుగునాడు నుంచి దూరంగా ఉండడం రామారావుకు 'వేదన' కలిగించిందనటంలో ఎంత మాత్రం సందేహం లేదు. వలస వేదన/ చెరువులో నీరులా ఉండక/ సమస్తం వదిలి/ సముద్రాలు దాటిపోవటమెందుకో?/ సాహసం/ ఆకలి తీరకా? /ఆశ తీరకా? ... వందల సంవత్సరాలున్నా/ పరాయి ముద్ర పడ్డప్పుడే అనుమానితులం/ తరిగిపోయే ఆస్తులు అవకాశాలకు కారణభూతులం/ పాలులో నీరులా కలిసిపోతున్నా–అదంతా కలుషితం/.... అయినా ప్రవహించే నీరు–ముందుకు పోలేనప్పుడు/ అక్కడే అలా ఇంకిపోవటం/ ఆరిపోవటంలోనే ఆనందమేమో ! అవునా తాతయ్యా?

ఇదే ఆ ఆవేదన. ఈ ఆవేదన ఎన్ని రూపాలుగా 'ఇంతింతై, వటుడంతయి' అన్న చందంగా మానవ జీవితమంత కాన్వాస్ నిండా అలుముకొంటుందో వీరి సాహిత్యం చదివితే అవగతమవుతుంది. కూతురు వివాహమై అత్తారింటికి 'వలస'పోతుంటే వచ్చే వేదన అలాంటిదే అంటారాయన. తన కూతురు, తన ఆనందం, తన చిరు దరహాసం. ఆ చిన్నారి పెళ్ళై అత్తారింటికి వెళ్తే కలిగే ఆవేదనే 'వలసపోయిన మందహాసం'. ఇదే వారి తొలి వలస కవిత. 'వలస పోయిన మందహాసం/ నాకు మొలకెత్తిన ఓ సుందర చైతన్యాకృతి/ నాకే వీడ్కోలిస్తున్నప్పుడు/ ఇన్నాళ్లు గుండె గదిలో వొదిగి వొదిగి/ కళ్ళకేదో మంచుతెర కప్పి/ చూస్తూ చూస్తూనే/ గువ్వలా ఎగిరిపోయినట్టుంది' అంటూ సాగుతుంది ఈ కవిత. ఇది తండ్రిగా తనకే కాదు, తల్లులందరికీ వ్యక్తమై, వ్యక్తం కాని బాధ.

రామారావు గారి 'అనువాద కవిత్వం' మరో సాహితీ సౌధం. 'అపరిచితత్వంలోనే ఉంది అనువాదపు అందం', 'అనువాదపు అనుభవాలు', నిఖిలేశ్వర్ 'అనుసజన' అనువాద సంకలనంపై ప్రసంగం ', వంటివి అనువాదం పై రామారావుగారి సాధికారతకు అద్దం పడతాయి.

అదే ఆకాశం (2010, 2023), అదే గాలి (2016), అదే నేల (2019), అదే కాంతి (2022), అదే నీరు (2023) వంటి అనువాద కవితా సంపుటాలు ప్రచురించటంలో ఆయన ప్రపంచానికి చెందిన కొన్ని వేలమంది కవుల కవితలను తెలుగులోకి అనువదించారు. ఒక్కో సంపుటి వందల పుటలతో భిన్న సంస్కృతుల, జాతుల కవిత సౌరభాలను వెదజిమ్ముతుంది. అదే ప్రేరణతో ఆయన 1901 నుంచి నోబెల్ బహుమతి పొందిన సాహిత్యవేత్తల కవిత్వాలను (37 మంది కవుల, 171 కవితలను) తెలుగులోకి అనువదించారు. శతాబ్దాల సూఫీ కవిత్వం పేరుతో 52 మంది సూఫీల 121 కవితలను తెలుగులోకి అనువదించారు. 'భరత వర్షం'– సీతాకాంత మహాపాత్ర ఒరియా కావ్యానికి తెలుగు అనువాదం చేసి 2017లో వెలువరించారు.

పదవ శతాబ్దపు మహాయాన బౌద్ధుల నిర్వాణ గీతాలను 'చర్యాపదాలు' పేరున 2019లో సంపుటిగా వెలువరించారు. రవీంద్ర నాథ్ టాగోర్ రాసిన 'ఫైర్ ఫ్లైస్' అనే ఆంగ్ల రచనకు తెలుగు అనువాదం వెలువరించారు. ఖలీల్ జిబ్రాన్ రాసిన 'ఇసుక నురగ'కు కూడా తెలుగు అనువాదం చేసి ఒక సంపుటి వెలువరించారు. 'బెంగాల్ బౌల్ కవిత్వం' అనే శీర్షికతో సుమారు 80 మంది బౌల్ కవుల 170 కవితలను ఓ సంపుటిగా (2023)లో వెలువరించారు. అస్సాంలోని ముస్లింల అస్తిత్వ స్వరాన్ని 'మియా కవిత్వం' పేరుతో 2022లో అచ్చువేశారు.

'నిజానికి కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడటం లాంటిది అనువాదం. తెలియని ప్రదేశంలో, తెలిసిన వివరాలతో సరైన వీధినో, ఇంటినో కనుగొనడం లాంటిది.' అంటారు ముకుంద రామారావు. వాస్తవానికి 'స్వేచ్ఛ రచన' లేక స్వీయ రచన ' కన్నా అనువాద రచనా సాహిత్యం చాలా క్లిష్టమైంది. ఒకరకంగా 'కృతజ్ఞత పొందని వృత్తి' (థాంక్ లెస్ జాబ్) అనువాదం. అలాంటి అనువాద సాహిత్యాన్ని కౌగిలించుకోవటమేగాక వేల పుటల్లో అన్య సాహిత్యాలను అనువాదం చేసిన ఘనత రామారావుది.

రామారావుది ఒక విలక్షణమైన భావుకత. గతంలో చెప్పినట్టు దానిలో అంతర్లీనంగా తాత్వికత ఉంటుంది. పొట్టి, కురచ పంక్తుల్లో ఎంత అర్థం ఇముడుస్తారో చూడండి ఈ కవిత మూడు పంక్తులలో. 'ఎవరికీ తెలియకుండా/ చురుకుగా గమనిస్తూ యోచిస్తున్న/ తలలోని మరో కన్ను' (అనుభూతి అనుభవం), 'పలక మీద/ చెరిపి వేయబడ్డ అక్షరాల్లా/ గుర్తుకు తెచ్చుకోలేని/ జ్ఞాపకాలు' (అనుభూతి అనుభవం), 'నీడల్ని మింగుతూ నిశ్శబ్దం ఔషధాన్ని తాగుతూ ఎవరికీ తెలియని చిరునామాకి అందరికంటే ముందు చేరాలని ఆత్రంగా అతనొక్కడే (వాలిపోతున్న నీడ), 'వస్తానని ఊరించేవారు/ వస్తారేమో ఎప్పుడో/ వచ్చిన దగ్గరనుంచీ/ వెళ్లిపోయే సన్నహాలే' (వాలిపోతున్న నీడ), ఒకద్దాన్నొకటి/ అనంతంగా చూసుకొంటూ/ ఆకాశం సముద్రం/ ఏకాంతాన్ని మరిచిపోతాయి/. అవి లాలించి పెంచే మేఘాలూ అంతే' (వర్షాభినయం), గమ్యం చేరే వరకూ ఏ ఉనికిలో ఉన్నా మొదలెట్టి కొనసాగించే రెండు సూత్రాలు మీదే సాగుతోంది యాత్ర (యాత్రలో)... ఇలా అనంతంగా సాగే ఆణిముత్యాల లాంటి భావ శకలాలున్న కవితా సరాలు రామారావు గారికే ప్రత్యేకం. ఇవన్నీ ఒక్కచోటన గుమ్మరించిన కవితా సంకలనమే 'రాత్రి వీస్తున్న గాలి'. రామారావు బహుభాషా ప్రవీణుడు. బెంగాలీ, హిందీ, తెలుగు, ఆంగ్లంతో వారిది లోతైన పరిచయం. అది 'వలస' వలననే సాధ్యమైంది. రామారావు 'వలస' జీవితాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడం వారి ఔన్నత్యానికి నిదర్శనం. ఒకవేళ వారు 'వలస' జీవి కాకపోయినా ఏ విశ్వనాథలాగానో, శ్రీశ్రీ లానో అనంత అద్భుత సాహిత్య సృష్టి చేయగలిగే వారే ననటం అతిశయోక్తి కాదు. పరభాషా సాహిత్యాన్ని తెలుగు వారికి చేర్చే ప్రయత్నంలో వారు ఒక విశాల సాహిత్య సామ్రాజ్యాన్నే సృజించారు. అది ఎనభై వసంతాల జీవిత సాఫల్యం.

– డా. కొప్పరపు నారాయణ మూర్తి
76719 09759

# నీలికళ్ల నేలలో సల్లంగ ఉండాలె!

పల్లిపట్టు నాగరాజు రాజకీయ కవి. ఇతని కవిత్వంలో 'దళిత బహుజన తాత్వికతే' అగుపిస్తుంది. ఇటీవల 'నీలికళ్ళ నేల' కవిత్వాన్ని ఆవిష్కరించుకున్నారు. ఈ సంపుటిలో దేశ రాజకీయాలను బహుజనవాద దక్కోణంలో చూస్తారు. తొలి కవితా సంపుటి 'యాలైపూడ్సిందికి, నీలికళ్ళ నేల' కు మధ్య నాలుగేళ్ళు విరామముంది. ఈ కాలంలో దేశ పరిస్థితులు ఏమీ మారలేదంటాడు. ఆధిపత్యం, అణచివేత, విద్వేషపు రాజకీయాలు లాంటి అవలక్షణాలు బాగా ముదిరిపోయా యంటాడు. దీనికి స్వార్థ రాజకీయాలే కారణమంటాడు. నిజమే కదా! పాలకులు ఎవరైనా ఒకటే. వారికొక ప్రత్యేక ఎజెండా ఉంటుంది. దాన్నే ముందుకు మోసుకుపోతారు. నేడు దేశభక్తి చాటున విధ్వంసం విలయతాండవం చేస్తున్నది. అభివృద్ధి మాటున సామ్రాజ్యవాదం వెర్రితలలు వేస్తున్నది. మధ్య యుగాల నాటి సంస్కృతిని తిరగదోడుతున్నారు. ఆధిపత్య భావజాలాన్ని ఎగదోస్తున్నారు. ఏవేవో పాత చింతకాయ పచ్చడలను పట్టుకొని, పంచభక్ష్య పరమాన్నాలుగా మాయజేసి చూపిస్తున్నారు. మనువాద సంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. రాజ్యాంగ వ్యతిరేక భావనలే రాజ్యమేలుతున్నాయి. సంపుటిలో 55 కవితలు ఉన్నాయి.

'ప్రేమ తుమ్మెద' కవితలో కవిలా చెబుతాడు. ప్రేమే ముఖ్యం కాదనీ, ప్రేమైక జీవనమే పరమార్థం కాదనీ, వీటికన్నా అస్తవ్యస్తంగా ఉన్న దేశ పరిస్థితులను చక్కదిద్దడమే ముఖ్యమనే భావనను ఈ ప్రేమకవిత చెబుతున్నది. "ప్రియా మన్నించు నన్ను/ఈ మారణ హెూమాల్ని/మానవత్వం తగలబడుతున్న దారుల్ని దాటుకుని/ఇప్పుడే నిన్ను చేరుకోలేను/ప్రియా మనం కాకపోతే/దేశాన్ని ఎవరు పట్టించుకుంటారు చెప్పు/మనం లేకపోతే మనుషులు ఏమైపోతారో చెప్పు/దేశం నిండా పారుతున్న విద్వేషాన్ని శుద్ధిచేసి/దుఃఖం లేని ఓ సాయంత్రాన/నీ ఎదపై ప్రేమ తుమ్మెదనై వాలిపోతాను" నిత్యమూ అణగారిన వర్గాలపై దారుణ మారణకాండలు సాగుతున్నాయి. జాతుల, మతాల మధ్య వైరుధ్యాలు పెచ్చరిల్లుతున్నాయి. వీటిని చూసీచూడనట్లు ఉండలేను, వదిలేసి రాలేను. ఈ ఆధిపత్యాన్ని దునుమాడడానికి నావంతు ప్రయత్నం చేస్తాను. ప్రాణాల సైతం అర్పిస్తాను. నువ్వే కదా! పోరాటాన్ని ప్రేమగా నాలోకి వొంపింది. సమస్త నిర్బంధాలు బద్దలు కొట్టమని చెప్పింది. అని ప్రేమ కవితను విప్లవం వైపు మళ్ళిస్తాడు.

'నీలికళ్ళ కోడికూత'లో దేశంలో జరిగిన జరుగుతున్న విషయాలను ఎరుకుపరుస్తూ, జరగబోవు వాటిని అంచనా కడతాడిలా. మనువాదులు, కులవాదులు మతాన్ని మరియు కులాన్ని ఎగదోస్తూ ప్రజల్లో అనైక్యతను సృష్టిస్తారు. ఈ కుట్రను ఎరుగుక మనుషులంతా 'కుడితిలో పడ్డ ఎలుకల్లా' బలైపోతున్నారు. డబ్బుతో ఓట్లకు గాలం వేసి తమ రాజకీయ అభీష్టాలను నెరవేర్చుకుంటున్నవారు కొందరు. అగ్రవర్ణ ఆధిపత్య వ్యవస్థల ఇష్ట ప్రకారం ఈ దేశాన్ని నాశనం చేస్తున్నవారు ఇంకొందరు. వీరంతా గారడీవాడు ఆడిస్తున్నట్లు దేశాన్ని ఆడిస్తూ మాయ జేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలంతా నీలికళ్ళ నేలలో నీలిజెండాలు ఎగరవేస్తూ, నీలినీలి ఊసులెన్నో చెప్పు కుంటూ సేదతీరాలంటాడు కవి. "నీలికళ్ళ కోడిపుంజును పిలవండి/నీతిమాలిన గెద్దచూపుల నుంటి/పిల్లలని కాపాడుకునే/నీలిరెక్కల కోడిపెట్టను పిలవండి/యీ భక్తిరంగు పురుగుల్ని నుంచి/యీ దేముడు భజన పేడబురగల్ని నుంటి/మన నేలను మన చేలను/కావిలిగాసుకుని కాపాడుకుంటాయేమో"

'దుఃఖానంతర భూమీ'లో 'బిల్కిస్ బానో' కుటుంబంపై దాడి జరిగితే, కుటుంబ సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. మహిళలు అత్యాచారానికి గురయ్యారు. చావు నుండి తప్పించు కున్న బానో ఆధిపత్యవాదులు మీద పదిహేనేళ్ల న్యాయపోరాటం చేసింది. చివరికి దోషులకు శిక్షపడింది. శిక్ష అనుభవిస్తున్న నేరస్తులకు రాష్ట్ర ప్రభుత్వం పెరోల్ పై విడుదల చేసింది. దీన్ని సభ్యసమాజం తప్పుబట్టింది. వేలాది పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. ధర్మాసనం నేరస్తుల విడుదలను అడ్డుకుంది. చివర వరకూ ధైర్య సాహసాలతో పోరాటం చేసిన బానోకు కవి సంఘీభావం తెలుపుతాడిలా. "ఏడుపైనా గెట్టిగానే ఏడుద్దాం/అరుపైన గెట్టిగానే అరుద్దాం/చుట్టూ ప్రపంచమేమీ గొడ్డుపోలేదు/మందిగా మనం కొందరిమే కావచ్చు/రేపోమాపో కూలబోయే కుట్రలకూటానికి/సత్యాన్ని ఎక్కువపెడుతున్న మన చేతులు వేలవేలు".

హంతకదేముడు'లో దేవుడి పేరుజెప్పి మోసాలు చేసేటోళ్లు, వ్యాపారం చేసేటోళ్ల, వైషమ్యాలు సృష్టించేటోళ్ళను తుదముట్టించాలంటాడు. "అది మఠమో బౌద్ధపీఠమో/మసీదు మందిరమో/మనిసి సావులపై కొలువుదీరే దేవలమేదైనా/దేవలమెట్టా అవతాదని/మనుషులమద్దెన తంటాలు పెట్టేవోడెవుడైనా/వాడు దేముడెట్టా అవుతాడని/ఒరేయ్..మమ్మల్ని సంపుకుతింటున్న దేముడా/నిన్ను సంపకపోతే మేం బతికిబట్టకట్టేలాలేము" దేవుణ్ణి పదకొండో అవతారంగా 'హంతకావతారమెత్తిన దేముడు' అని కవి సంబోధించడం వైవిధ్యంగా ఉంది. దేవుడి పేరుతో జరుగుతున్న ఉన్మాదాలకు ముగింపు పలకాలంటాడు.

'దుఃఖ మణిపురం'లో ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్ లో జాతుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. గిరిజన తెగలపై అఘాయిత్యాలు చూస్తున్నాం. పాలకులు హింసను ఆపడానికి ప్రయత్నించడం లేదు. ఒక వర్గానికే కాపు కాస్తున్నారు. పీడనకు గురైన వారిని ఓదార్చడానికి ఎవరూ రావడం లేదు. ఆపన్న హస్తం అందించటం లేదు. పీడితులకు సంఘీభావం ప్రకటిస్తూ, పాలకుల వైఖరి పట్ల ఖిన్నుడై కవిలా అంటాడు. "పన్నాగమేమిటో పసిగట్టలేవా/లోపల మణులున్న పూరా/నా కుకీజనుల ఊరా/పీనుగుల మీద కట్టుకునే పీఠాలపై/ఎవడైనా ఎన్ని /దినాలు కులుకుతాడనీ/దేశమేమన్నా గొడ్డుపోయిందా/దేశపు గొంతులేమన్నా వొట్టిపోయాయా/కాలం యల్లకాలం/'మోస'పు మంటలచుట్టూ చలికాచుకుంటూ/సంకలెగరేయదు గదా"

'వైదిగం జెయ్యాలి'లో గ్రామీణ జీవన నేపథ్యాలను వివరిస్తూ, ఆయా జీవనాల్ని నాశనం చేస్తున్న పెట్టుబడిదారీ మూకస్వామ్యాన్ని ఎండగడుతున్నాడు కవి. రైతు, శ్రామికుల జీవితాల్లో ఎదురయ్యే భౌతిక సమస్యలకు అనేకానేక మూలికా రసవైద్యాలు చేస్తూ సాంత్వన పొందుతారు. అలానే ఈ నీచ నికృష్ట దొంగ రాజకీయాలకు వాతపెట్టే వైద్యం చేయాలంటాడు కవి. "రాజకీయ గత్తరుపట్టి/రాజ్జెమంతా కుములుతుండాది/'మోసా'లు మేపుతున్న కుత్రపురుగునాకి/దేశం గొడ్డజబ్బు చేసుండాది/ఏ మందోమాకో నూరిపోసి బాగుచేయాల/గొడ్డూగోదా పిల్లాజెల్లా సల్లగుండాలంటే/మనమిప్పుడే కళ్ళు తెరవాల/పెంచుకున్నవే అయినా/మదంపట్టిన పొట్టేళ్ళ కొమ్ములిరిచి పులుసుగాయాల/వెన్నుపూసలకు దన్నుగావాల/ఏదోవొక వైదిగంజేసి/గొడ్డనైనా బిడ్డనైనా కాపాడుకోవాల/బిడ్డలుబతికే కాలాన్ని కంటిలో వొత్తులేసుకుని మరీ/కాపాడుకోవాల" ఈ కైత ధిక్కార స్వరానికి ప్రతీక. ధైర్యసాహసాలతో రాసిన కవిత. కవిత నిండా దగాపడ్డ మనిషి ఆక్రోశం, ఆక్రందన, ఆందోళన ఉంది.




'మోసగాడి వలపు గేయం'లో దేశ రాజకీయాలలో 'మోసా'ల శకం సాగుతోంది. ఈ శకానికి వాళ్ళు స్వర్ణ భారత్ అని పేరుపెడుతన్నారు. వాస్తవానికిది స్వర్ణ భారత్ కాదు. రానురాను స్మశాన భారత్ గా మారుతున్నది. ఈ నిజాన్ని ప్రజలు ఎప్పుడు గ్రహిస్తారో? అనే సందేహాన్ని కవి వ్యక్తం చేస్తాడు. "కాలానికి చెవుడయితే/ పేగులుతెగేలా అరచి మరీ చెబుదునుగాని/నటించే బానిసకు ఏ బాసలో చెప్పగలను/ఎన్ని తూర్లని చెప్పగలను/ఎప్పటికైనా.. గాయాలు సత్యాన్ని కనుగొంటే చాలు/కుట్రల ముసుగులు తొలిగిపోయిన రోజు/మోసకారి పుర్రె వీధిగుమ్మానికి/వికతంగా వేలాడటం మనమంతా చూస్తాం" సమాజం మారుతుందని ఆశావహంగా కవి ఎదురుచూస్తాడు.

'పొలిటికల్ టెర్రరిస్ట్' కైతలో...రాజ్యాంగ వ్యతిరేక విధానాలను తీవ్రంగా గర్హిస్తాడు కవి. దేశమంతా రాజకీయ విద్వేషాలు పెచ్చుమీరుతుండడం పట్ల ఆందోళన చెందుతాడు. "డెమోక్రసీని గాలికి వదిలి/నమోక్రసీలో సాగే గాలిమాటలై/సమూహాల మధ్యన గాజుపెంకులు నాటి/మనుషులు మనుషులుగా బతకనీక/మతానికి పుట్టిన పుట్టగొడుగులుగానో/కులంగొడ్డు ఈనిన బలిపశువులుగానో/ రాజకీయ కంటికురుపు కళ్ళతో చూసేవాడు/వాడెవడైనా గానీ పొలిటికల్ ఉగ్రవాదే/రంగుపేరా రూపుపేరా/జాతిపేరా మనుషుల్ని చీల్చి/కల్లోలపు కమురువాసన పొగరాజేసేవాడు/ఎవడైనా గాని/అతను పోగేస్తున్నది పొలిటికల్ టెర్రరిజమే/అతను రాజేస్తున్నది దురహంకారపు నిప్పే/ఏ స్వతంత్ర దేశంలోనైనా/ మనిషి మనుగడకే గండమై పాలించేవాడు/ వాడు దేవుడైనా సరే రాజకీయ ఉగ్రవాదే"

'బత్తాయిరంగు ద్వేషం' కైతలో పాలకుల వైఖరిని తూర్పార బడతాడు కవి. "ఏమని చెప్పను నేస్తం/ వెనక్కిపాకుతున్న వేయి తలల వెర్రితనం గురించి/నేలంతా కురుస్తున్న/బత్తాయి రంగు యిషపువానలో/మునగ తడిసి నానిపోయిన తరం/నానా రకాలుగా నాశనాన్ని పులుముకొంటూ/ పూనకమొచ్చి ఊగిపోతావుంది/ బహుశా ఏ కాలంలోనూ/ ఈ నేల చూడనంత విద్వేషం/ వీధుల నిండా ఎల్లవలై పారతావుంది" ఇలా బత్తాయిలు విర్రవీగిపోయి ప్రశ్నించే ప్రజలపై దాడిచేస్తూ చెలరేగిపోవడాన్ని గట్టిగా నిరసిస్తాడు. "మిత్రమా..సత్యాన్ని మాట్లాడే నీ చేతులకు/సంకెళ్లు వేస్తున్నప్పుడు కూడా/నినాదంగా మాకో మాటిచ్చే వెళ్లావు కదా/'మోసా'లు కడుతున్న కుట్రగోడలు/కూలిపోయే రోజులు ఎంతో దూరంలేవని/దేశం పసిగట్టాలే గాని/దేశం పూనుకోవాలే గాని/ద్వేషానికి బుద్ధిచెప్పడం ఎంతసేపూ" అర్బన్ నక్సల్స్ పేరిట ప్రజాస్వామ్య గొంతుకలను చెరసాలల్లో బంధించడం పట్ల కవి ఖిన్నుడై గట్టిగా గొంతెత్తుతున్నాడు. ఈ సంపుటిలోని కవితలు పాఠకులకు మరింత రాజకీయ అవగాహననందిస్తాయి. కవి తన కవిత్వంతో రాజ్యంపై ఎదురుతిరుగుతాడు. పవర్ఫుల్ పొలిటికల్ పొయిట్రీని పలికించిన పల్లిపట్టుకు ప్రణామాలు.

– పిల్లా తిరుపతిరావు
70951 84846



## ఊపిరి తీసిన కల

కన్నదెవరు కల?
ఎవరిదీ కల?
మొలకెత్తే కల కంటుంది
మట్టి
కురిసే కల కంటుంది
మేఘం
గాలిని చీల్చే కల కను
వెలుగు, నీడల పెనుగులాటల్లో
వెలుతురు కల కను
జీవుతాన్ని
తేజోమయం చేసే
పాలపుంత లాంటి కల కను

వేల కోట్ల వ్యాపార హార్మ్యాల కింద
ప్రాణాలు సమాధి అయ్యే కలలెందుకు?

మన ఇంటిని నిలబెట్టే
పునాది లాంటి కల
దుఃఖాన్ని దూరం చేసే కల
ఉద్యమానికి ఊరట నిచ్చే కల
రైతు ముఖం మీద
పాల కంకుల కల
జీవితాల చుట్టూ
ఆక్రమించిన వ్యాపార ధూళిని దులిపే కల
నువ్వు నిచ్చెన అయ్యే కల
నిన్ను నిలబెట్టే కల
బతుకును ఛిద్రం చేసే కలలెందుకు?
మనవి కానీ కలలు
మనల్ని దూరంచేసే కలలు వద్దు
కల పగిలిపోయే గుడ్డు కాదు
తీరాన్ని చేరే ఒడ్డు!

– డాక్టర్ సుంకర గోపాలయ్య
94926 38547

## ముత్తైదువ

ఇక్కడొక రచ్చబండుండాలి
పల్లెనిండా పచ్చని మాటలు పండిస్తూ
ఇక్కడొక రచ్చబండుండాలి.
అమాయక నవ్వులు చిందిస్తూ
నిండు దారిద్ర్యంలోనూ
అనుబంధాల కలిమిని ఆస్వాదించిన రచ్చబండ

చినుకు కురిస్తే ఆత్మంతా చిగురించేలా
వసంతం రాకున్నా
పల్లెకు జీవశ్వాస ప్రసాదించే రచ్చబండ
పగలంతా అరకల సంగీతం
ఇల్లంతా పల్లెపదాల పంట
మోటకిర్రులో
కోతకొచ్చిన కలలు తిలకిస్తూ
అందరినీ పలకరిస్తూ పరవశిస్తూ
అలరించిన మా రచ్చబండ

మడవ ప్రవాహంలో మనసుల పడవై
దేవుడి పెళ్ళైనా దీనుడి శవమైనా
సాముహిక కెరటమై కదిలిన రచ్చబండ .
టీవీ సీరియళ్ల సందడైనా
నెట్లు వాట్సప్లు పందిర్లేసుకొన్నా
పల్లె చివర్లో మందుపాకలు మొలిచినా
నిత్య సంత మా రచ్చబండ..

ఏసీ గదుల చదువులతో
ప్రతి వ్యక్తి ఒంటిరాయి ధ్వజస్తంభమై
మొలుచుకువస్తున్నా
రచ్చబండ మీద అచ్చేసిన
పులి మేక, దాయాలాటలు మాత్రం
సాముహిక కెరటమై సాగుతున్నాయి!
ఈ సాముహిక కెరటం
బిందు సేద్యంలో తుంపర్లుగా
చెల్లాచెదురై ఇంకిపోయినా
పిల్లకాయలు వలసపోయినా
ఊరు చెరువు దిగులు పడినా
రచ్చబండ మాత్రం పెద్ద ముత్తైదువులా
గంగిరాయి చెట్టు కింద నిరీక్షిస్తూనే...

– ఈతకోట సుబ్బారావు,
94405 29785

## చదువుకుందాం.. రండి!

చదువు..
చదివితే వస్తుంది
కళ్ళు మూసుకొని జపం చేస్తే రాదు
పరిశీలిస్తే.. పరిశోధిస్తే
బుద్ధి వికసిస్తుంది
తవ్వితేనే లోతు తెలుస్తుంది
నడిస్తేనే అలసట తెలుస్తుంది
మంత్రాలకు చింతకాయలు రాలవని
ఎంత కష్టానికి అంత ఫలితం ఉంటుందని
డిగ్రీలు చదివి సర్టిఫికెట్‌లు సంపాయించిన
మీకే తెలియకపోతే
పిల్లలకేం చెప్పి ఉంటారు?

ఆగమనం.. నిగమనం
ఆర్కిమెడీస్ అర్థశాస్త్రం, అశోకుని ధర్మచక్రం
మార్క్స్ మేనిఫెస్టో, చాణుక్యుని రాజనీతి
శ్రీశ్రీ ప్రతిజ్ఞ, గురజాడ దేశభక్తి
జాషువా గబ్బిలం.. చదివారా ఎప్పుడైనా?

కార్యకారణ సిద్ధాంతానికి
కారణాలు కనిపెట్టకుండా
శాస్త్రీయ విజ్ఞానాన్ని అందిపుచ్చుకోకుండా
చైతన్యాన్ని ప్రబోధించాల్సిన బోధకులే
మోకాలికి బోడిగుండుకు ముడిపెట్టి
అజ్ఞానాన్ని వ్యాప్తి చేస్తూ
భావితరాల భవిష్యత్‌ను అంధకారం చేయకండి

చదువంటే విజ్ఞానం
చదువంటే వాస్తవం
చదువంటే తెలుసుకోవడం
చదువు.. ఒక సామాన్యుని పోరాటం
శ్రమైక జీవన సౌందర్యం!

రండి, మళ్ళీ చదువుకుందాం!
అంధకార సామాజిక అవ్యవస్థలో
సమైక్యతా కాగడాలు వెలిగించి నడుద్దాం!
(ఇంకా మూఢనమ్మకాలు వీడని కొందరు గురువుల కోసం)

– సునీత గంగవరపు
94940 84576

## 15న 'జీవన సౌరభాలు' ఆవిష్కరణ

జూన్ 15 ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు ప్రముఖ రచయిత్రి డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతి పద్య కవితా సంపుటి 'జీవన సౌరభాలు' ఆవిష్కరణ సభ విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ మీటింగ్ హాల్లో జరుగుతుంది. గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షతన జరిగే సభలో పుస్తకాన్ని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరిస్తారు. డాక్టర్ గుమ్మ సాంబశివరావు పుస్తక సమీక్ష చేస్తారు. డాక్టర్ జివి పూర్ణచందు గౌరవ అతిథిగా పాల్గొంటారు.

చలపాక ప్రకాష్, కార్యక్రమ నిర్వాహకుడు
9247475975

## 15న 'అల్లిక' ఆవిష్కరణ

ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి కవితా సంపుటి 'అల్లిక' ఆవిష్కరణ జూన్ 15 ఆదివారం సాయంత్రం 5 గంటలకు విజయ వాడలోని బాలోత్సవ్ భవన్, రెండో అంతస్తులో జరుగుతుంది. జి.లక్ష్మీనరసయ్య, శిఖామణి, యాకూబ్, గూడూరు సీతామాలక్ష్మి తదితరులు మాట్లాడతారు. – తంగిరాల సోనీ

## పైడి తెరేష్‌బాబు స్మారక సంచిక కోసం...

ప్రముఖ దళిత కవి, కథకుడు పైడి తెరేష్ బాబు స్మారక సంచిక వెలువరిస్తున్న నేపథ్యంలో తెరేష్ బాబు గురించిన వ్యాసాలు, కవితలు, జ్ఞాపకాలు లేదా మరేదైనా రచనలు జూన్ నెలాఖరులోగా పంపించవలసిందిగా మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆహ్వానిస్తోంది. సాహితీవేత్తలు డా. జి.వి.రత్నాకర్, పి.శ్రీనివాస్ గౌడ్ సంపాదకత్వం వహిస్తారు. 70135 07228, 99494 29449 నెంబర్లకు వాట్సప్‌లో గాని, లేదా srinivasgoudpoet@gmail.com ఈమెయిల్‌కి గాని పంపవచ్చు. పూర్తి వివరాలకు 99494 29449 నెంబరులో సంప్రదించవచ్చు. – కలిమిశ్రీ

## ఏది నిజం!

భూమి ఎలా ఏర్పడిందని
ఆమె నడిగాను
నమ్మకంతో చెప్పింది
వ్యోమ సీమలోని ప్రేమ భావమంతా
ఘనీభవించి పృథివిగా మారిందట
అందుకే అంతటా వింత కాంతులేనట.
నిజమేనా అని అతడిని అడిగాను
అదేమీ కాదని వాదన చేశాడు
హృదయమేదో విస్ఫోటమై
విశ్వమై మిగిలిందట
సకలమూ శకలాలై,
అనంత శూన్యంలో చెదిరేనట
నిశీధిలో పయనమే జీవన విధానమట
ఏది నిజం?
ఆశ నిరాశల నాణెంలో
ఏది మీ ముఖం?

– డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ. 94408 36931.

## ఈదురుగాలులు, భారీ వర్షం

- విద్యుత్ తీగలపై చెట్లు పడి నిలిచిన విద్యుత్ సరఫరా

**ప్రజాశక్తి - ముసునూరు**

ముసునూరు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. బలంగా వీచిన ఈదురు గాలులకు మండలంలోని లోపూడి గ్రామంలో విద్యుత్ స్తంభంపై తాటిచెట్టు పడింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. వెంటనే స్థానిక నాయకులు, విద్యుత్ శాఖాధికారులు స్పందించి విద్యుత్ స్తంభంపై పడిన తాటిచెట్టుకు పక్కకు తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించి సమస్యను పరిష్కరించారు.

## గోదావరిలో స్నానానికి దిగి యువకుడు మృతి

**వేలేరుపాడు రూరల్ :** చాగరపల్లి గ్రామానికి చెందిన చరణ్ గోదావరిలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. కుక్కునూరు మండలం మాధవరం గ్రామంలో స్నేహితుడి వివాహ వేడుకకు శనివారం ముగ్గురు స్నేహితులతో కలిసి వెళ్లిన చరణ్ భోజనం అనంతరం అక్కడ మరో నలుగురు స్నేహితులతో కలిసి కౌండిన్య ముక్తేశ్వర స్వామి ఆలయ సమీపంలో గోదావరిలో స్నానానికి వెళ్లారు. అక్కడ స్నానం చేస్తుండగా చరణ్ ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఫ్రెండ్స్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్, సభ్యులు చాగరపల్లి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖర్చుల నిమిత్తం ఫ్రెండ్స్ ఆటో యూనియన్ తరపున రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు.

## పులిచెర్లలో ఏనుగుల సంచారం

**రొంపిచర్ల :** పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ ఎద్దులవారిపల్లి రైతులకు చెందిన పంట పొలాల్లో ఆదివారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు మామిడి తోటలో ప్రవేశించి మామిడి కొమ్మలు విరిచి కాయలను నేలరాల్చి, పొలాలను తొక్కుకుంటూ అడవిలోకి ప్రవేశించాయి. ఈ విషయం స్థానికులు ఫారెస్ట్ అధికారులకు తెలియజేశారు. ఎఫ్‌బిఒ శ్రీదేవి మాట్లాడుతూ... కల్లూరు రిజర్వ్ ఫారెస్ట్ పరిసరాలలో ఏనుగుల గుంపు తిష్ట వేసిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పాతపేట, గంటావారిపల్లి, చల్లావారిపల్లి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజలు అటవీ ప్రాంతంలోకి వెళ్ళరాదని సూచించారు.

## ప్రాణం తీసిన ఈత సరదా

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం**

ఈత సరదా ప్రాణం తీసిన సంఘటన ఆదివారం మండలంలోని తగ్గువారిపల్లి గ్రామసమీపంలో చోటు చేసుకున్నది. సిఐ శ్రీనివాస్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా ములబాగులు తాలూకా చాపలదీన్నే గ్రామానికి చెందిన వెంకట్ రమణ కుమారుడు మురళి (23) అదే గ్రామానికి చెందిన ఐదుగురుతో కలిసి బంగారుపాళ్యం మామిడి మండిలలో పనిచేసేందుకు వచ్చారు. ఆదివారం మధ్యాహ్నం ఉక్కపోతకు తగువారిపల్లి గ్రామంలోని వ్యవసాయ బావ వద్ద ఈత కొట్టేందుకు వెళ్లారు. మురళి బావిలో దూకి పైకి రాకపోవడంతో తోటి స్నేహితులు అజయ్, విశ్వనాథ్, విజయ్, రాజశేఖర్, గణేష్ బావిలో గాలించగా అతడు నీటిలోనే మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం మృతుని తండ్రి వెంకటరమణ సమాచారం తెలపడంతో వెంకటరమణా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# గొర్రెల పెంపకం క్షేత్రంపై నీలినీడలు

- కాగితాలకే పరిమితమైన శిక్షణకేంద్రం
- వేలల్లో ఉన్న గొర్రెలు.. నేడు వందల్లోకి..!
- వేధిస్తున్న నిధులు, సిబ్బంది కొరత
- వందల ఎకరాల భూములు ధారాదత్తం

**ప్రజాశక్తి-పెనుకొండ**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం తర్వాత జీవాల పెంపకంపై ఆధారపడి రైతులు జీవిస్తున్నారు. అందులో గొర్రెల పెంపకం ముఖ్యమైనది. చాలా మంది దీనిపై ఆధారపడి ఇప్పటికీ సంప్రదాయ పద్ధతిలో గొర్రెల పెంపకాన్ని చేపడుతున్నారు. ఉమ్మడి అనంతలో 49 లక్షల గొర్రెలు ఉన్నాయి. 44 వేల కుటుంబాలు గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. పెరిగిన అవసరాలు, మారుతున్న కాలానికి అనుగుణంగా గొర్రెల పెంపకంలో రైతులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఆ దిశగా ప్రభుత్వాలు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో రానురాను గొర్రెల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతూ పోతోంది. గొర్రెల పెంపకందారుల కోసం పెనుకొండ గొర్రెల పెంపక క్షేత్రంలో శిక్షణకేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఏళ్లుగా ఉంది. గత ప్రభుత్వంలో శిక్షణకేంద్రానికి రూ.2.50కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ప్రకటన వరకు బాగానే ఉన్నా ఒక్క రూపాయి కూడా అప్పటి ప్రభుత్వం విదిల్చిన దాఖలాలు లేవు. కేవలం కాగితాలకే ఆ ప్రకటన పరిమితమైంది. కూటమి ప్రభుత్వమైనా గొర్రెల పెంపక క్షేత్రం అభివృద్ధికి చేయూతనందిస్తుందని ఈప్రాంత రైతులు ఆశగా ఉన్నారు.

**పెనుకొండలో గొర్రెల పెంపక క్షేత్రం**

ఉమ్మడి అనంతపురం జిల్లా ఉన్న సమయంలో పెనుకొండ సమీపంలో 1959లో 578 ఎకరాల విస్తీర్ణంలో గొర్రెల పెంపక క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం ఆస్ట్రేలియా తరహా వాతావరణం ఉంటుందనే ఉద్దేశంతో ఇక్కడ దానిని నెలకొల్పారు. గొర్రెలకు అవసరమైన షెడ్లు, సిబ్బంది నివాసాలు నిర్మించారు. ఈ భూముల్లోనే గొర్రెలకు గడ్డి సాగు చేసే ఏర్పాటు చేశారు. ఇక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకుని జీవించే విదేశీ జాతులను ఈ కేత్రంలో పెంపకం చేయవచ్చు. ప్రస్తుతం నెల్లూరు బ్రౌన్‌జాతి గొర్రెలను ఈ క్షేత్రంలో పెంచుతున్నారు.

**గొర్రెల పెంపక క్షేత్రం ఏర్పాటు లక్ష్యం**

పెనుకొండ గొర్రెల పెంపక క్షేత్రంలో ఫ్రెంచ్, మెరినో, కరిడేల్, బళ్లారిడ్రక్కన్ జాతికి చెందిన గొర్రెలను పెంచాలని సంకల్పించారు. వీటితో సంతానోత్పత్తి చేసి ఆ పిల్లలను రైతులకు అమ్మడానికి వీలుగా దీనిని ఏర్పాటు చేశారు. గొర్రెల ద్వారా లభించే ఉన్నితో నాణ్యమైన ఉన్ని వస్త్రాలు తయారు చేయాలని భావించారు. వాతావరణంలో అనూహ్య మార్పులు కారణంగా ఈజాతి గొర్రెలు అభివృద్ధి చెందలేదు. దీంతో నెల్లూరు బ్రౌన్‌జాతి గొర్రెల పెంపకం చేపట్టారు.

**వేధిస్తున్న నిధులు, సిబ్బంది కొరత..**

గొర్రెల పెంపక క్షేత్రంలో గతంలో వేల సంఖ్యలో గొర్రెల పెంపకం చేపట్టేవారు. ప్రస్తుతం కేవలం 600 మాత్రమే ఉన్నాయి. ఎనిమిది మంది సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం డీడీ, సీనియర్ అసిస్టెంట్, టైపిస్టు, మరో ఇద్దరు సిబ్బంది ఉన్నారు. గొర్రెలను మేపడానికి 20 మంది దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. గొర్రెలు అనారోగ్యం, వ్యాధుల బారినపడితే చికిత్స అందించేదుకు వైద్యుడు లేరు. ఉన్న వైద్యుడు బదిలీపై వెళ్లి రెండేళ్లు గడుస్తున్న మరో వైద్యున్ని ప్రభుత్వం నియమించలేదు. మరో పక్క గొర్రెల పెంపక క్షేత్రం అభివృద్ధికి ప్రభుత్వం నిధులు నామామాత్రంగా విడుదల చేస్తోంది. దీంతో లక్ష్య సాధనకు అమడదూరంలో ఈ గొర్రెల పెంపకక్షేత్రం ఉంది. గతంలో గొర్రెల అభివృద్ధి చేసి అమ్మకాలు చేయడంతో నిధులు విరివిగా ఉండేవి. ప్రస్తుతం ఆదరణ కోల్పోవడంతో నిధులు కొరత తీవ్రంగా ఉంది. 2015-16లో ఈ క్షేత్రం అభివృద్ధికి రూ.25 లక్షలు నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో గొర్రెలు, పొట్టేళ్లు కొనుగోలు, షెడ్ల మరమ్మతులు చేపట్టారు.

**వందల ఎకరాల భూములు ధారాదత్తం**

గొర్రెల పెంపకక్షేత్రానికి సంబంధించి 578 ఎకరాల భూమి ఉంది. అందులో వందల ఎకరాలు ఇతర అవసరాలు ధారాదత్తం చేశారు. దీనిని సంబంధించిన భూమిన ఇతర వాటికి కేటాయించడం చూస్తే షీఫారం అభివృద్ధిపై ఏ మాత్రం చొరవ ఉందో అర్థమౌతుంది. వైద్య కళాశాలనిర్మాణంకు 58 ఎకరాలు, యంఏజీ లేఅవుట్‌కు 32 ఎకరాలు, గిరిజన గురుకుల పాఠశాలకు ఆరు ఎకరాలు తీసుకున్నారు. ప్రస్తుతం పెనుకొండ పరిధిలో ఏ ప్రభుత్వ కార్యాలయాలకు భూమి కావాలన్న ఈ క్షేత్రం భూములనే అధికారులు సిఫార్సు చేస్తున్నారు. ఫలితంగా గొర్రెల పెంపక క్షేత్రం ప్రధాన లక్ష్యం నీరుగారిపోతోంది.

**శిక్షణ కేంద్రం కాగితాలకే పరిమితం**

పెనుకొండలో గొర్రెల పెంపకంపై రైతులకు శిక్షణ ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి చేసే దిశగా గతప్రభుత్వం రూ.2.50 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించింది. ప్రకటన చేసినా ఐదేళ్లల్లో ఒక్క రూపాయి కూడా ఇచ్చిన దాఖలాల్లేవు. శిక్షణ కేంద్రం ఏర్పాటు కేవలం కాగితాలకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వంలోనైనా శిక్షణకేంద్రం ఏర్పాటు చేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఆశగా రైతులున్నారు.

**వేలల్లో ఉన్న గొర్రెలు.. నేడు వందల్లోకి..**

గొర్రెల పెంపకం క్షేత్రంలో గతంలో గొర్రెలతో కళకళలాడుతుండేది. వేల సంఖ్యలో గొర్రెలు, సిబ్బందితో ఎంతో ప్రాచుర్యం పొందింది. ప్రస్తుతం ఆదరణ కోల్పోయి కళావిహీనంగా మారిపోయింది. వేల సంఖ్యలో గొర్రెలు ఉండే క్షేత్రం నేడు వందల్లోకి దిగజారిపోయింది. గొర్రెల షెడ్లు, సిబ్బందినివాస గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

గాయపడిన భద్రతా సిబ్బందితో మాట్లాడుతున్న తేజస్వి యాదవ్

## భారీ ప్రమాదం నుంచి తప్పించుకున్న తేజస్వియాదవ్

- కాన్వాయ్‌ను ఢీకొట్టిన ట్రక్
- ముగ్గురు భద్రతా సిబ్బందికి గాయాలు
- ప్రమాదంపై విచారణ జరపాలి : సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి

**పాట్నా :** బీహార్ శాసనసభలో ప్రతిపక్ష నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ భారీ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. శనివారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో వైశాలి జిల్లా హాజీపూర్‌లోని గోరౌల్ సమీపంలో వేగంగా వెళ్తున్న ట్రక్ ఆయన కాన్వాయ్‌ను బలంగా ఢీకొంది. మధేపురాలో పార్టీ బహిరంగ సభలో పాల్గొని వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నేషనల్ హైవే 22 వద్ద తేజస్వీ యాదవ్, పార్టీ నాయకుడు శక్తి యాదవ్ టీ తాగడానికి ఆగిన సమయంలో, ట్రక్ కాన్వాయ్‌లోని రెండు వాహనాలను ఢీకొట్టింది. ఈ సందర్భంగా తేజస్వి యాదవ్ మీడియాతో మాట్లాడుతూ వైశాలిలో టీ తాగడానికి ఆగిన సమయంలో ట్రక్ తన సమీపంలో ఒక్క సారిగా అదుపుతప్పి తన కాన్వాయ్‌లోని రెండు మూడు వాహనాలను ఢీకొట్టిందని చెప్పారు. తన భద్రతా సిబ్బందిని ట్రక్ ఢీకొందన్నారు. ఈ ఘటన తనకు ఐదడుగుల దూరంలోనే జరిగిందని చెప్పారు. ఆ ట్రక్ మరికొంతగా ఇటువచ్చి వుంటే తనను కూడా ఢీకొట్టేదని చెప్పారు.

కాన్వాయ్‌ను ఢీకొట్టిన తరువాత ట్రక్ డ్రైవర్ పరారయ్యాడు. సరాయి పోలీస్ స్టేషన్ అధికారులు టోల్‌గేట్ సమీపంలో అతన్ని అరెస్టు చేసి, విచారిస్తున్నారు.

**కుట్ర ఉంది : రోహిణీ ఆచార్య**

ఈ రోడ్డు ప్రమాదంలో కుట్ర ఉందని, తన సోదరుడికి హాని కలిగించే ఉద్దేశంతో ఈ సంఘటన జరిగిందా అని తేజస్వీ యాదవ్ సోదరి రోహిణి ఆచార్య ప్రశ్నించారు. "తేజస్వీ భద్రతలో స్థానిక పరిపాలనా యంత్రాంగం చూపిన నిర్లక్ష్యం తీవ్ర ఆందోళనకరం. దీనిపై వెంటనే విచారించాలి. ట్రక్ ఎలా తేజస్వీ వాహనానికి కేవలం ఐదు అడుగుల దూరంలోకి వచ్చింది? తేజస్వికి హాని కలిగించే ఉద్దేశంతోనే భద్రతా రంగంలో లోపం, నిర్లక్ష్యం జరిగిందా? తేజస్వీ కాన్వాయ్‌లో ఇలాంటి సంఘటన మొదటిసారి కాదు, గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగాయి," అని ఆచార్య తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

**ప్రమాదంపై విచారణ జరపాలి : సిపిఎం**

తేజస్వీ యాదవ్ కాన్వాయ్‌కు సంబంధించిన ప్రమాదంపై సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎక్స్‌లో ఈ మేరకు ఆయన పోస్ట్ చేశారు. వైశాలీలో తేజస్వీ యాదవ్ కాన్వాయ్‌కు ప్రమాదం జరిగిందని తెలియడం తీవ్ర ఆందోళన కలిగించింది. అయితే, తేజస్వి సురక్షితంగా ఉన్నారని తెలుసుకోవడం ఉపశమనం కలిగించిందని ఆయన పేర్కొన్నారు. గాయపడిన సిబ్బంది త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, ఈ ఘటన వెనుక కుట్రకోణం ఉందేమో తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఏనుగుల దాడిలో పంట నష్టం

- పేటూరులో తిష్టవేసిన ఏనుగుల మంద

**ప్రజాశక్తి- సోమల (చిత్తూరు)**

చిత్తూరు జిల్లా సోమల మండలంలోని పేటూరు, అన్నెమ్మగారిపల్లి, పెద్దఉప్పరపల్లి అటవీ ప్రాంతాలలో ఏనుగుల మంద సంచరిస్తూ రాత్రి వేళల్లో అటవీ సమీప గ్రామాలలోకి రావడం పంటపొలాలపై దాడులు చేయడం చేస్తూ ఈ ప్రాంత ప్రజలను రైతులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. గత పదిరోజులుగా ఈ ప్రాంతంలో 14 ఏనుగుల గుంపు సంచరిస్తూ రాత్రి వేళల్లో మామిడి, టమాటా, బొప్పాయి పంటలపై దాడులు చేస్తూ రైతులకు తీవ్రనష్టాన్ని కలిగిస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు ఏనుగుల దాడిలో నష్టపోతూ ఉంటే అటు ఆర్థికంగా ఇటు మనోవేదనతో ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నిత్యం ఏనుగుల సంచరిస్తూ పంటలపై దాడులు చేయడం, పంటలను ధ్వంసం చేయడం గ్రామాలకు దగ్గరకు రావడం చేస్తూ ఈ ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రి పేటూరు దేసయ్య, చిట్టి, ప్రసాద్, పెద్దఉప్పరపల్లికు చెందిన ప్రకాష్, సుబ్రహ్మణ్యం, రమేష్, చంద్రయ్య రైతులకు చెందిన మామిడి, టమాటా పంటలపై దాడిచేసి తోటలు మొత్తం తిరుగాడి పంటలను తొక్కి, కొమ్మలను విరిచి తీవ్రంగా నష్టపరిచాయని రైతులకు తెలిపారు. కనిగలచెరువు వద్ద తిష్టవేసిన ఏనుగుల మందను అటవీశాఖ అధికారులు తరిమివేసి రైతుల పంటలను కాపాడాలని ఈ ప్రాంత ప్రజలు రైతులు కోరుతున్నారు.

## మద్యం మత్తులో ఘర్షణ

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి :**

మద్యం మత్తులో మిద్దెపై నుండి యువకులు కిందపడడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు..నెల్లిపట్ల గ్రామంలో ఆదివారం గంగమ్మ జాతర సందర్భంగా శనివారం రాత్రి గ్రామానికి చేరుకున్న నంద కుమార్(25) తమిళనాడుకు చెందిన శర్వణ (29) గ్రామంలో గంగమ్మ జాతర సందర్భంగా అమితంగా మద్యం తాగారు. ఘర్షణ పడటంతో ఇద్దరూ మిద్దె పైనుండి కింద పడ్డారు. ఈ సంఘటనలో నందకుమార్ బలమైన గాయాలు తగిలి రక్తం అధికంగా పోయిందని, స్థానికులు 108 ద్వారా బైరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. శర్వణ చికిత్స తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ పరశురాముడు సంఘటన స్థలానికి చేరుకొని నందకుమార్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 48 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- నలుగురు స్మగ్లర్ల అరెస్టు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):**

శేషాచలం అటవీ పరిధి, అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లి అటవీ ప్రాంతంలో 48 ఎర్రచందనం దుంగలతో సహా నలుగురు స్మగ్లర్లను, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ చిరంజీవులు ఆధీనంలోని ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బృందం శనివారం అన్నమయ్య జిల్లా బురకాయల కోట అటవీ ప్రాంతంలో స్థానిక అటవీశాఖ అధికారులు జయప్రసాదరావు, మోహన్ రెడ్డి, షబీన్ తాజ్ రసాకారంతో వేపూరి కోట ఫారెస్ట్ బీట్ పరిధిలో డంపింగ్ పాయింట్ల తనిఖీలు చేపట్టరన్నారు. ఆదివారం తెల్లవారుజామున అన్నగారి పల్లి సమీపంలో వంక గట్టు వద్ద ఒక మోటార్ సైకిల్ కనిపించిందని, దానిని సమీపిస్తుండడంతో ఆ ప్రాంతానికి కొంత దూరంలో కొంతమంది గుమికూడి ఉన్నారని టాస్క్ ఫోర్స్ సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. పారిపోతున్న వారిని వెంబడించి నలుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకుందామన్నారు. పట్టుబడ్డ నలుగురు అన్నమయ్య జిల్లాకు సంబంధించిన వారుగా గుర్తించామన్నారు. దీనిపై టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో సిఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పోక్సో కేసులో ఇద్దరు అరెస్టు

**ప్రజాశక్తి- భీమునిపట్నం (విశాఖ జిల్లా)**

విశాఖ జిల్లా భీమునిపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో 14 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... పాఠశాలలకు సెలవు దినాలు కావడంతో విజయనగరానికి చెందిన 14 ఏళ్ల బాలిక భీమిలిలో అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఓ మహిళ మాయమాటలు చెప్పి బాలికను చేపల తిమ్మాపురంలో ఉన్న నూకరాజు ఇంటికి శనివారం తీసుకెళ్లింది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఆ బాలికపై నూకరాజు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నూకరాజుతోపాటు అందుకు సహకరించిన మహిళపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షలు నిమిత్తం కెజిహెచ్‌కు తీసుకెళ్లారు.

## బేతంచెర్ల స్టేషన్‌లో రైళ్లను ఆపాలి

- సిపిఐ, సిపిఎం నేతలు డిమాండ్

**ప్రజాశక్తి - బేతంచెర్ల**

బేతంచర్ల మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ళను ఆపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సిపిఎం సీనియర్ నాయకులు వై.ఎల్లయ్యలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బేతంచెర్లలోని పాత బస్టాండ్‌లో ఉన్న భారత్ బేకరీ సర్కిల్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో బేతంచెర్ల రైల్వే స్టేషన్ మీదుగా వెళ్లే అన్ని రైళ్ళను ఆపాలని కోరుతూ సిపిఐ మండల కార్యదర్శి వై భార్గవ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2020లో కరోనా కారణం చేత బేతంచెర్ల రైల్వే స్టేషన్లో రైళ్ళను ఆపడం బంద్ చేశారన్నారు. కరోనా పోయి 5 సంవత్సరాలు అవుతుందని, ప్రస్తుతం కేవలం నంద్యాల టు కర్నూల్ డెమో, గుంటూరు టు కాచిగూడ రైళ్ళను మాత్రమే ఆపుతున్నారని తెలిపారు. మిగతా రైళ్లను కూడా ఆపాలని డిమాండ్ చేశారు. బేతంచెర్ల వ్యాపారస్తులకు, ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఎంతో సౌకర్యవంతంగా ఉన్న రైల్వే స్టేషన్లో రోజుకు వేల రూపాయలు ఆదాయాన్ని సమకూరుస్తున్నా రైల్వే అధికారులు మాత్రం స్టేషన్లో రైలు ఆపక పోవడం దారుణమన్నారు. రైళ్ళను ఆపకపోవడం వలన ప్రజలు, వ్యాపారస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత రైల్వే అధికారులు స్పందించి అన్ని రైళ్ళను బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో ఆపాలని కోరారు. లేనిపక్షంలో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను, ఉద్యోగులను, వ్యాపారస్తులను కలుపుకొని నిరాహార దీక్షలు చేయడానికి కూడా వెనుకాడబోమని అన్నారు.

## కల్యాణగుమ్మిలో ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేయరూ!

- కడరేవు వద్ద గిరిజనుల ఆందోళన

**ప్రజాశక్తి- అనంతగిరి (అల్లూరి జిల్లా)**

అల్లూరి జిల్లా అనంతగిరి : మండలం కల్యాణగుమ్మిలో ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేయాలని గిరిజన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆదివారం కడరేవు గ్రామం వద్ద ఆందోళన నిర్వహించారు. అందుబాటులో పాఠశాల లేక తమ బిడ్డలు చదువుకు దూరమైపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు గెడ్డలు దాటి, కొండల చుట్టూ తిరిగి పాఠశాలలకు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని, తమ గ్రామంలో తక్షణమే పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి తండ్రి ఎన్ రామారావు. మాట్లాడుతూ పాఠశాల ఏర్పాటు చేయాలని మండల విద్యాశాఖ అధికారికి గత ఏడాది విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరంలోనైనా పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో 12 మంది బడిఈడు పిల్లలు ప్రస్తుతమున్నారని, వారంతా పిన్నకోట పంచాయతీ పరిధి మదన గరువు. సొల్లుబొంగు పాఠశాలలకు కాలినడకన వెళ్లాల్సి వస్తోందన్నారు. మార్గమధ్యలో రైవాడ, గోస్తని గెడ్డ దాటి వెళ్లాల్సిన పరిస్థితుల్లో వర్షాలు కురిస్తే ఉధృతంగా ప్రవహించే ఆయా గెడ్డలను నాటు పడవలో దాటి వెళ్లాల్సి రావడం ప్రాణసంకటంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలకు వెళ్లే క్రమంలో రానుపోను నాలుగు కిలోమీటర్ల దూరం రైవాడ జలాశయం మీదుగా బోటు సహాయంతో అనకాపల్లి జిల్లా దేవరపల్లి మండలం తామరభ ఎంపిపి పాఠశాలకు వెళ్తున్నారని, గుమ్మ. పిన్నకోట .పంచాయతీల పరిధి కడరేవు, .కొట్టంగుడ, గొప్పలపాలెం, అనకాపల్లి జిల్లా దేవరపల్లి మండలం మోడుగరువు పాఠశాలకు రానుపోను ఏడు కిలోమీటర్లు దూరాన్ని ఉప్పొంగిన గెడ్డలు కొండ కోనలు దాటి వెళ్లిరావడం ప్రమాదకరంగా ఉందన్నారు. తమ పిల్లలను చదువుకు దూరం చేయొద్దని, తక్షణం తమ గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. అధికారులు స్పందించకుంటే ఐటిడిఎ, జిల్లా పరిషత్‌లను ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అత్యవసర, అనారోగ్య సమయంలో ప్రాణాల మీదకు వస్తోందని వాపోయారు. అటవీ శాఖ అభ్యంతరాలతో నిలిచిపోయిన రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు

# మళ్లీ కుంగిన ఎస్ఎస్ ట్యాంక్

- పురవాసులకు తాగునీటి కష్టాలు తప్పవా
- పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు

**ప్రజాశక్తి-ఆదోని**

పాలకులు,అధికారుల ముందు చూపు కొరవడంతో ఆదోని ప్రజలకు నీటి కష్టాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి. కావలసినంత ఆదాయం మున్సిపాలిటీకి వస్తున్నా కనీస మౌలిక సదుపాయాలు కల్పనలో మాత్రం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనపడుతుందని పలువురు పేర్కొం టున్నారు. ఆదోని ప్రజల దాహార్తి తీర్చే బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పటిష్టత రోజురోజుకు తరుగుతుండడంతో ఆందోళన కలిగిస్తున్న పరిస్థితి. తాగునీటిని నిలువ ఉంచడంలో కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆదోని అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ప్రజలు విమర్శిస్తున్నారు. స్టోరేజ్ ట్యాంకులో నీరు తగ్గిపోతోంది. కనీసం నివారణ చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఎమ్మెల్యే అధికారులతో చర్చించిన దాఖలాలు లేవని పలువురు చెబుతున్నారు. వాటాలపై ఉన్న శ్రద్ధ ప్రజల బాగోగులపై పాలకులు చూపడం లేదన్న విమర్శలు వినపిస్తున్నాయి. బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు మళ్లీ కుంగిపోతున్నా... కనీస్పందన లేదు.

**ముంచుకొస్తున్న నీటి కష్టాలు:** ఆదోని పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. 2004లో జనాభాను దృష్టిలో పెట్టుకొని ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ సామర్థ్యం 3110 మిలియన్ లీటర్లు, రామజల చెరువు 1000 మిలియన్ లీటర్ల నీటి నిల్వ ఉండేలా నిర్మాణం చేశారు. ప్రస్తుతం ఆదోని మున్సిపాలిటీ పరిధిలో సుమారు రెండు లక్షల జనాభా ఉంది. రోజుకు బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి 26 మిలియన్ లీటర్లు, రామజల చెరువు నుండి 4 మిలియన్ లీటర్లు చొప్పున 30 మిల్లీలీటర్లు రోజుకు అవసరం బసాపురం సమ్మర్ స్టోర్ బ్యాంకులో 1000 మిలియన్ లీటర్లు రామజల చెరువులో 350 మిల్లీలీటర్లు నీరు నిల్వ ఉంది. ఈ నీరు ఆదోని పురవాసులకు 30 రోజులకు సరిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రాయ నగర్, క్రాంతినగర్ ,విజయభాస్కర్‌రెడ్డి నగర్, వైయస్సార్ నగర్ , అమరావతి నగర్ ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని ఆ కాలనీవాసులు చెబుతున్నారు. మూడు రోజులకు ఒకసారి నీరు సరఫరా అవుతుందని, ఇప్పుడే పరిస్థితి ఎలా ఉంటే ముందు ముందు ఎలా ఉంటుందో అన్న ఆందోళన వ్యక్తం అవుతుంది.

**నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు :** బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, రామజల చెరువులో నీటి నిల్వను దృష్టిలో ఉంచుకొని నాలుగు రోజులకు ఒకసారి నీరు సరఫరా చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ లోకేశ్వరి అధికారులకు సూచించారు. చేతిపంపులు, ట్యాంకులు, బోర్ల మరమ్మతులు చేయించి వాడుకునేందుకు నీటి కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. నీటి వృథాను చేయొద్దని ఉచిత సలహాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న పరిస్థితి కనపడుతుందని పాలకుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**తుంగభద్ర కాలువలో నీరు ఇప్పట్లో లేనట్లే:** తుంగభద్ర డ్యాం నుండి కాలువ ద్వారా తాగునీటి అవసరాల నిమిత్తం నీరు సరఫరా కావలసి ఉంది. ప్రస్తుతం తుంగభద్ర దిగువ కాలువ మర మ్మతు పనులు జరుగుతున్నాయి. డ్యాములో కూడా నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ మరమ్మతులు జరుగు తూ ఉండటం వల్ల ఇప్పట్లో నీరు వదిలే అవకాశాలు లేనట్లు కనపడుతున్నాయని అది . కారులు చెబుతున్నారు. తుంగభద్ర దిగువ కాలు వకు నీరు వస్తేనే బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు పంపింగ్ చేసుకునే సౌకర్యం ఉంది. ప్రజా అవసరాలు దృష్టిలో ఉంచుకొని సకాలంలో నీళ్ల వదిలేలా చూడాలని తుంగభద్ర డ్యామ్ అధికారులను కోరుతామని కౌన్సిలర్లు చెబుతున్నారు.

**కుంగిన బసాపురం చెరువు కట్ట:** బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ సైడ్ గోడలు మళ్లీ కుంగిపోయాయి. ఇప్పటికే పలుసార్లు మరమ్మతులు చేయించినా నిలువకపోవడంతో ఎప్పుడు గండి పడుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇసుక సంచులు పేర్చి తాత్కాలిక మరమ్మతు పనుల కోసం సుమారు రూ.80 లక్షలు గత ప్రభుత్వంలో పనులు జరిగాయి. పనిచేసిన చోట కాకుండా మరో సైడ్ గోడ కూడా మట్టి కృంగిపోయింది. చెరువు సైడ్ గోడలు 250 మీటర్లు రాళ్లతో పరుపుపరిచి పట్టిష్టం చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అమృతఫేస్ 2 కింద రూ.20 కోట్లు మంజూరు అయినట్లు అధికారులు చెబుతున్నారు. రూ. 10 కోట్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పటిష్ట పనులకు వినియోగిస్తామని చెబుతున్నారు. ఇప్పటికే టెక్నికల్ శాంక్షన్ వచ్చిందని త్వరలోనే పనులు చేపట్టి చెరువు మరమ్మతులు చేయిస్తామని చెబుతున్నారు.

# ప్రయివేటులో పుస్తకాల దందా

- యూనిఫాం, బెల్టుల పేరుతోనూ దోపిడీ
- పాఠశాలలోనే కొనాలంటూ నిబంధన

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలన్న విద్యార్థుల తల్లిదండ్రుల ఒకే ఒక్క ఆశ కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలకు ఆదాయం తెచ్చి పెడుతోంది. తల్లిదండ్రుల నుంచి పాఠశాలల యాజమాన్యాలు వేలకు వేలు ఫీజుల భారం మోపుతున్నాయి. అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్స్, స్పెషల్ డేస్, కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూ ఇప్పటికే వేలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యాలు మళ్లీ పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫారం, షూ, టీ షర్ట్ అంటూ అందినకాడికి దోచుకుంటున్నాయి. కర్నూలు జిల్లాలో 745 ప్రయివేటు పాఠశాలలు, నంద్యాల జిల్లాలో 559 ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి. దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఎంఇఒ కార్యాలయం ద్వారా పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి. ఆ రేట్లకే విద్యార్థులకు పుస్తకాలను ఇవ్వాలి. నోటు పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టి తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు విక్రయాల్లో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేసి వ్యాపారం చేస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు ధరల కంటే రెట్టింపు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. నిబంధలకు విరుద్ధంగా యూనిఫాం, టై, బెల్టు, బ్యాడ్జీ, షూ ఇలా అన్నీ తమ దగ్గరే కొనుగోలు చేసి తీరాల్సిందేనంటూ ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు హుకుం జారీ చేస్తున్నాయి, దీంతో తప్పక అడిగిన డబ్బులు చెల్లించి షాపుల్లో మాదిరిగా ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వాటిని కొనుగోలు చేస్తున్నారు మౌలిక వసతుల లేమి, విద్యార్థులకు సరిపడా ఆటస్థలాలు లేవు. తరగతి గదుల కొరత ఉంది. అయినప్పటికీ, అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా, ఫీజుల వసూళ్లలో మాత్రం పోటీపడి మరి వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పుస్తకాల దోపిడీ అదనంగా ఉంటోంది. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ధరలు రూ.280 నుంచి 700 వరకు ఉన్నాయి. వీటికి తోడు అదనంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది. పెద్ద తరగతులకు నోటు పుస్తకాల ఖర్చు కాస్త ఎక్కువగా ఉంటుందనుకున్నా గరిష్టంగా రూ.1500 మించి ఉండదు. అన్నీ కలిపి పదో తరగతికి కూడా రూ.2 వేలతో పుస్తకాల ఖర్చు సరిపోవాల్సి ఉంది. అయితే ప్రయివేటు పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి. ఎల్‌కెజి, యుకెజి తరగతులకే రూ.3 వేలకు పైగా వసూలు చేస్తున్నాయి. పెద్ద తరగతులకు రూ.5 వేల నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. తమ పిల్లల్ని ఎక్కడ వేధిస్తారోననే భయంతో తల్లిదండ్రులూ ప్రశ్నించడం మానేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయాలపై ఎస్ఎఫ్ఐ ప్రశ్నించినప్పుడు మాత్రమే నామమాత్రంగా అధికారులు వెళ్లి చర్యలు తీసుకుంటున్నారు. అంతేతప్ప దోపిడీని అరికట్టే చర్యలు మాత్రం జిల్లాలో ఎక్కడా కానరావడం లేదు.

## జీవన సౌరభం

ఉత్సాహంతో శ్రమించడం, అలసటను ఆనందంగా అనుభవించడం విజేతల ప్రాథమిక లక్షణం.

## మీకోసం

పాలు తోడు పెట్టేటప్పుడు పెరుగుతో పాటు చిటికెడు పంచదార వేయండి. పెరుగు త్వరగా పులుపెక్కదు. రుచిగా కూడా ఉంటుంది.

# ఎవరి ప్రత్యేకత వారిది

ఒక పంట కాలువలో నిగర్వి అనే కప్ప, గర్విష్ఠి అనే చేప నివసిస్తున్నాయి. వారిద్దరూ స్నేహితులే కానీ గర్విష్ఠికి ఈదటంలో తనని మించిన వారు లేరని నిగర్వితో చాలా సార్లు గొప్పలు చెప్పేది. చాలా సార్లు అలా అనడం చూసిన తర్వాత ఒకసారి నిగర్వి ఇలా అంది.

'ఈ పంట కాలువ ఇలా కిందికి ప్రవహిస్తుంది కదా, ఇక్కడ నుంచి మనం బయలు దేరి పంట కాలువ మలుపు వరకు వెళ్ళి తిరిగి మనం ఇక్కడకు ఎవరు ముందుకు చేరుకుంటారో వారే గొప్ప, సరేనా' అంది.

'ఓస్! అదెంత పని, ఇప్పుడే బయలుదేరుదాం' అని పోటీకి సిద్ధమైంది గర్విష్ఠి. ఇద్దరూ అలా ఆ పంట కాలువలో నీటి ప్రవాహం దిశగా ఈదడం మొదలుపెట్టారు. నీటి ప్రవాహం వాలుగా ఉండటంతో కప్ప కన్నా వేగంగా చేప ఈదుతూ మలుపు వద్దకు చేరుకుని తిరిగి ప్రవాహానికి ఎదురీదడం మొదలుపెట్టింది కానీ ఇంతకుముందు అంత వేగంగా ఈదలేక నెమ్మదిగా ఈదటం మొదలు పెట్టింది.

ఈలోపు మలుపు వద్దకు చేరుకున్న కప్ప ఈసారి ప్రవాహానికి ఎదురీదడం కాకుండా పెద్ద పెద్దగా గెంతుతూ సునాయాసంగా తిరిగి బయలుదేరిన ప్రదేశానికి చేరుకుంది. కాసేపటికి అక్కడకు చేరుకుని ఓడిపోయానని ఒప్పుకుంది గర్విష్ఠి.

'చూసావా మిత్రమా! ప్రతి జీవికి ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. నేను నీలాగ ఈదలేకపోవచ్చు అలాగే నీవు నాలాగ గెంతగలవా? అందుకే మనకుండే ప్రత్యేకతమ చూసుకుని గొప్పలు చెప్పుకోకూడదు' అని హితబోధ చేసింది నిగర్వి. దాంతో తన తప్పుని తెలుసుకుని 'ఇకపై గొప్పలు చెప్పన'ని హామీ ఇచ్చింది గర్విష్ఠి.

**- కొమ్ముల వెంకట సూర్యనారాయణ,**
**99496 02721.**

## సరి చేయండి

**పిల్లలూ, ఇక్కడ కొన్ని పండ్లు, వాటికెదురుగా గజిబిజిగా కొన్ని అక్షరాలు ఇచ్చాం. వాటిని సరైన క్రమంలో రాస్తే ఆ పండ్ల పేర్లు వస్తాయి. ట్రై చేయండి మరి..**




## నేను గీసిన బొమ్మ

సిహెచ్.రోహిత,
6వ తరగతి,
సత్తెనపల్లి, పల్నాడు జిల్లా



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# సివిల్ సర్వీసుకు దారి దీపం

**'బాబూ.. పెద్దయ్యాక ఏమవుదామనుకుంటున్నావ్...' అని పిల్లలనడిగితే- కలెక్టర్ (ఐఎఎస్) నవుతా.. ఎస్‌పి (ఐపిఎస్) అవుతా అంటారు చాలామంది. 'కలెక్టర్ అయ్యి మంచి పనులు చేస్తా. పోలీసునై దోషులను శిక్షిస్తా. లాయర్‌నై న్యాయాన్ని పరిరక్షిస్తుంటా' అనటం వింటుంటాం. సివిల్ సర్వీసెస్‌లోకి వెళ్లాలంటే ఏవేమి కావాలో వాళ్లకు తెలియదు. పిల్లలకే కాదు, ఉన్నత విద్యలో చేరాక కూడా చాలామందికి సివిల్ సర్వీసు గురించి పూర్తి అవగాహన ఉండదు. అలాంటి వారికి అవగాహన, తర్ఫీదు ఇచ్చే పనిని గుంటూరులోని సన్, కెవిఆర్ ఎడ్యుకేషన్ సంస్థలు ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా చేస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ఎందరో అభ్యర్థులకు, విద్యార్థినీ విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షపై అవగాహన కల్పిస్తున్నాయి.**

గుంటూరు నగరంలోని బ్రాడీపేట 2/6లోని యూటిఎఫ్ కార్యాలయంలో సివిల్ సర్వీసెస్‌పై విద్యార్థి దశలో అవగాహన కల్పించాలనే స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్), కెవిఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా ఐఎఎస్ పౌండేషన్ పేరుతో ఉచిత అవగాహనా తరగతులు నిర్వహిస్తున్నాయి. దీనికి పూర్వ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు నేతృత్వం వహిస్తున్నారు. గుంటూరు నగరంలో కొన్ని రోజులుగా ఈ తరగతులు సాగుతున్నాయి. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్ సర్వీస్ పరీక్ష తీరుతెన్నులపై నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. కీలక విషయాలు వెల్లడిస్తూ సివిల్స్‌లో విజయ సాధనకు ఆంగ్లతోపాటు జాగ్రఫీ, సమకాలీన అంశాలు, ప్రపంచ రాజకీయాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, రీజనింగ్, ఆప్టిట్యూట్, దినపత్రికల అధ్యయనం కీలకం. ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో పరీక్ష రాయొచ్చు. గతంతో పోలిస్తే ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం పెరిగింది. ప్రజలతో మమేకమయ్యే అవకాశం ఉండటమే దీని ప్రత్యేకత.

**ప్రిపరేషన్ ఎలా జరుగుతుందంటే...**

సివిల్ సర్వీసులకు సంబంధించిన పరీక్షలు, వాటి నియామకాలు, సిలబస్, ఇతర ముఖ్యమైన విషయాలపై ఈ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) ద్వారా నిర్వహించబడే సివిల్ సర్వీసెస్ పరీక్షలు, ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఎఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపిఎస్) ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) వంటి ఆలిండియా సర్వీసులకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియల గురించి సోదాహరణంగా వివరిస్తున్నారు. మూడు దశల్లో ప్రిలిమ్స్ (ప్రాథమిక పరీక్ష), మెయిన్స్ (ప్రధాన పరీక్ష), ఇంటర్వ్యూలను అభ్యర్థులు ఎదుర్కోవాల్సి వుంటుంది. ఆయా పరీక్షల సిలబస్, వివిధ అంశాల గురించి క్షుణ్ణంగా అవగాహన ఏర్పర్చుకోవాలి. అర్హతలు, సన్నద్ధతపై లోతుగా అధ్యయనం చేయాలి. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు కూడా సివిల్ సర్వీసెస్‌కు ప్రత్యేకంగా కోచింగ్ ఇస్తున్నాయి. ఇవి పరీక్షకు సిద్ధం కావటానికి దోహదపడతాయి. అవగాహన కల్పించే సదస్సులు, వర్క్‌షాపులు జరిగినప్పుడు వాటిని సద్వినియోగం చేసుకోవాలి. సమర్థవంతమైన సన్నద్ధతతో ముందుకు సాగితే తమ కలలను అభ్యర్థులు నయం చేసుకునే అవకాశం ఉంటుంది.

**ప్రణాళికతో కృషిచేస్తే విజయం తథ్యం**

సివిల్ సర్వీసెస్‌పై సమగ్రమైన అవగాహన ఏర్పర్చుకోవాలి. ఆ తర్వాత నిరంతర కృషితో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే విజయాన్ని సొంతం చేసుకోవచ్చు. విశ్లేషణతోపాటుగా స్వీయ నోట్సు తయారీ, కరెంట్ ఎఫైర్స్‌పై పట్టు, దీక్షతో ప్రాక్టీస్, గణిత అంశాలపై పట్టు,

నిరంతర రివిజన్ వంటి అంశాలు కీలకపాత్ర పోషిస్తాయి. అభ్యర్థులు ఆయా అంశాలపై పట్టుపెంచుకోవటం ద్వారా నిరంతర సాధనతో ముందుకు సాగితే మంచి ఫలితాలను సాధించొచ్చు. సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూట్ టెస్ట్ (సీశాట్), జనరల్ స్టడీస్ (జీఎస్) వంటి అంశాలపై మూడేళ్ల వరకూ గతేడాది ప్రశ్నలను (పీవైక్యూ) విశ్లేషించటం ద్వారా వ్యూహాత్మక సన్నద్ధతకు పునాది మొదలవుతుంది. ఎంపిక చేసుకున్న సబ్జెక్టులకు సంబంధించి కీలక అంశాలను గుర్తించటానికి కృషి కొనసాగాలి. వర్తమాన అంశాలపై అవగాహన, పరిణామక్రమ వంటి కీలక అంశాలను గుర్తిస్తూ అప్‌డేటెట్ సమాచారాన్ని సేకరించాలి. వెయిటేజీని అర్థం చేసుకోవాలి. ప్రిపరేషన్‌ను క్రమబద్ధీకరించుకోవాలి. తద్వారా సమయం సద్వినియోగం అవ్వటంతోపాటుగా కీలక అంశాలపై సమగ్ర విశ్లేషించే సామర్థ్యంతోపాటుగా సబ్జెక్టుపై పట్టు వస్తుంది. హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ, ఎన్విరాన్మెంట్ వంటి కీలక సబ్జెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి. అభ్యర్థులు స్వయంగా నోట్సు తయారుచేసుకోవాలి. లేటెస్ట్ మెటీరియల్‌ను ఎప్పటికప్పుడు సేకరించుకోవాలి. ప్రామాణిక రిఫరెన్స్ పుస్తకాలు దీనికి దోహదపడతాయి. ఏడాది పొడవునా కరెంట్ అఫైర్స్‌ను స్థిరంగా రివిజన్ చేయడం కూడా ముఖ్యం. క్యూరేటెడ్ సంకలనాల కోసం కొన్ని మ్యాగజైన్లు, వెట్‌సైట్లు అందుబాటులో ఉన్నాయి. కేంద్రబడ్జెట్‌తోపాటుగా వివిధ రకాల సర్వేలు, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభావాలు వంటి అంశాలపై కూడా పట్టు పెంచుకోవాలి. సబ్జెక్టుల వారీగా, ఫుల్‌లెంగ్త్ మాక్‌టెస్ట్‌లను ప్రాక్టీస్ చేయాలి. సీ శాట్ క్వాలిఫయింగ్ పేపర్ అయినా మ్యాథ్స్‌లో మంచి ప్రావీణ్యం ఉంటే బేసిక్ న్యూమరసీ, లాజికల్ రీజనింగ్‌పై దృష్టి పెట్టాలి. సబ్జెక్టులను విభాగాల వారీగా ఎప్పటికప్పుడు రివిజన్ చేసుకోవాలి.

**- కెఎస్.లక్ష్మణరావు,**
**పూర్వ శాసనమండలి సభ్యులు**

### ఆత్మవిశ్వాసం పెరిగింది

సివిల్ సర్వీసెస్ పరీక్షలపై సమగ్ర అవగాహన ఏర్పడింది. ఈ తరగతుల ద్వారా సమకాలీన అంశాలకు ప్రాధాన్యం ఉందని తెలుసుకున్నా. వార్తా పత్రికలు చదవటమే కాకుండా వాటి కోసం ప్రత్యేకంగా నోట్స్ తయారుచేసుకోవాలని గ్రహించా. కెఎస్ లక్ష్మణరావు గారితోపాటుగా మరికొంతమంది నిపుణులు ఇస్తున్న సమాచారంతో ఆత్మవిశ్వాసం పెరిగింది.

**టి.ఆశీశ్ (కోఆర్డినేటర్),**
**ఎం.మల్లిక, జి.రాజశ్రీ, జి.అమర్నాథ్, వై.రమ్య,**
**అభినయ మానిష్**

# వక్రీకరణకు పురస్కారాలా?

ఇటీవల తెలంగాణా ప్రభుత్వం గద్దర్ పేరిట ఇచ్చిన సినిమా అవార్డులు ఆయన స్ఫూర్తిని అవమానించేలా ఉన్నాయని తీవ్ర విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరించి, అందులో కమ్యూనిస్టుల పాత్రను, త్యాగాలను తక్కువ చేసిన 'రజాకార్' సినిమాకు అవార్డునివ్వడం చరిత్రకు తీవ్ర అవమానమనే విమర్శలు వచ్చాయి. మత సామరస్యాన్ని పెంచటం ఏ కళ అయినా చేయాల్సిన సామాజిక విధి. కానీ, ఈ సినిమాలో కాషాయవాదుల రాజకీయ లక్ష్యానికి అనుగుణంగా ముస్లిం వ్యతిరేకతను పెంచటమే 'రజాకార్' దర్శక నిర్మాతల లక్ష్యంగా సాగింది. బిజెపి నాయకులు పనిగట్టుకొని ఈ సినిమాకు ప్రచారం కల్పించినా – పెద్దగా ప్రేక్షకులు ఆదరించలేదు.

అలాంటి సినిమాకు పురస్కారం ఇవ్వటం ద్వారా తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఉన్మాద భావాలకు ఊతమిచ్చినట్టుగా ఉంది. తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ఎంతో కీలక పాత్ర పోషించిన గద్దర్ పేరుతో ఏటేటా సినీ రంగంలోని ప్రముఖులకు ఇచ్చే అవార్డులను ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. స్వాతంత్ర్యం రాకముందు బ్రిటిష్ రాజ్యాన్ని వ్యతిరేకించిన గదర్ పార్టీకి గుర్తుగా గద్దర్ ఆ పేరు పెట్టుకున్నారు. తెలుగు సినీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ కమిటీ ఛైర్మన్, నటి జయసుధ, ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు వీటిని ప్రకటించారు. 2014 నుంచి 2023 వరకు సెన్సారైన చిత్రాలను అవార్డుల కోసం ఎంపిక చేశారు. ప్రస్తుతం 2024 ఏడాదికి సంబంధించి అన్ని విభాగాల్లో అవార్డ్స్ అందుకున్న వారి వివరాలు ప్రకటించారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం నుంచి చలన చిత్ర అవార్డులను ఇచ్చే సమయంలో అభివృద్ధిని కాంక్షించే అభ్యుదయ సినిమాలకు కాకుండా చరిత్రను వక్రీకరించి మతం పేరుతో సమాజాన్ని విభజించేలా ఉన్న 'రజాకార్' సినిమాకు అవార్డు ప్రకటించటం ఆర్‌ఎస్‌ఎస్ ఒత్తిళ్లకు తలొగ్గినట్లుగా కనిపిస్తోంది.

**రాజకీయ కోణంలో అవాస్తవాలు**

ఒక వాస్తవ సంఘటనను తీసుకొని సంకుచిత రాజకీయ దృష్టితో అవాస్తవాలు చెప్పడం ఈ చిత్రాల ప్రత్యేకత. ప్రతి చారిత్రక సినిమాలోనూ కొంత కాల్పనికత తప్పదు. ఆ కాల్పనికత ఉత్తమ విలువలను, సౌభ్రాతృత్వాన్ని పెంచాలి. బాధితుల పట్ల సానుభూతిని కల్గించాలి. అలాంటి చిత్రాలను ప్రేక్షకులు ఆదరించారు, ఆదరిస్తారు. మనదేశంలో అప్పటికీ ఇప్పటికీ జనం ఆదరించే 'మొఘల్ ఎ ఆజం'ను చూడండి. అందులో ప్రేమను భూమికగా ఎంచుకున్నారు. అన్ని భాషల్లోని ఉత్తమ సాహిత్యంలో మనకు ఇలాంటి పాత్రలు కన్పిస్తాయి. ఈ పాత్రలను సృష్టించడం వెనుక ఒక ప్రయోజనం ఉంది. రజాకార్ చిత్రం వెనుక చరిత్రను

వక్రీకరించే అసత్యాలు కోకొల్లలు.

చరిత్రను కనుమరుగుచేసి అభూతకల్పనలను చరిత్రగా చూపించే సామాజిక లక్ష్యం ఇందులో ఇమిడి ఉంది.

**చరిత్ర వక్రీకరించిన 'రజాకార్'కు అవార్డా?**

చరిత్రను వక్రీకరించిన రజాకార్ సినిమాకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తమ చారిత్రక సినిమాగా గద్దర్ అవార్డు ప్రకటించింది. భూమి కోసం, వెట్టి చాకిరి, ఫ్యూడల్ దుర్మార్గపు వ్యవస్థ నుంచి విముక్తి కోసం హైదరాబాద్ రాజ్యంలో 1946 నుంచి 1951 దాకా వీరోచిత సాయుధ పోరాటం జరిగింది. ఆ పోరాటాన్ని ముస్లిం నిజాంపై హిందువులు జరిపిన పోరాటంగా చరిత్రను వక్రీకరించి తీసిన సినిమా 'రజాకార్'. అలాంటి చిత్రాన్ని ఉత్తమ చారిత్రక సినిమాగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడం యాదృశ్చికంగా జరిగింది కాదు. వీరోచిత తెలంగాణ పోరాటాన్ని వక్రీకరించడమే ఆ ఎంపిక వెనుక ఉన్న లక్ష్యం. దేశంలోని జనాన్ని మత ప్రాతిపదికపై విడగొట్టి ఉంచడానికి నేడు సినిమాల నిర్మాణం కొనసాగుతోంది. ఆ పరంపరలోనిదే రజాకార్. ఆ సినిమాలను ప్రేక్షకులు ఆదరించలేదు. వందల కోట్లు వెచ్చించి నిర్మించిన సినిమా 'ఆదిపురుష్'ను కూడా భారతీయులు తోసి పుచ్చారు. సినిమాలో చూపినట్లు రజాకార్లు యూనియన్ సైన్యంపై తిరగబడలేదు. ఎలాంటి ప్రతిఘటన లేకుండా నిజాం నవాబులాగే వారూ లొంగిపోయారు. ముస్లింల పట్ల ద్వేషం రెచ్చగొట్టడమే తమ సంకుచిత రాజకీయ లక్ష్యం గనుక వాస్తవ ఘటనలకు మసిబూసి అబద్ధాలను జనం ముందుంచారు. నిజాంకు దొరలతో మంచి దోస్తానా ఉండింది. దొరల నుండి విలువైన కానుకలు అందేవి. అందమైన మహిళలను కూడా దొరలు నిజాంకు నజరానాగా బహుకరించేవారు. దొరలు ప్రజలను పశువుల కంటే హీనంగా చూసేవారు. ప్రశ్నించే వారిని చంపేసేవారు. కాంగ్రెస్‌ను వదలి బీజేపీలో చేరిన గూడూరు నారాయణ రెడ్డి రజాకార్ చిత్ర నిర్మాత కాగా బీజేపీ సీనియర్లు తెరవెనుక నుండి కథ నడిపించారు. సినిమాలో పదే పదే హైదరాబాద్‌కు తుర్కిస్తాన్‌గా మార్చడానికి నిజాం ప్రయత్నిస్తున్నట్లు చూపారు. మొదటి నిజాం ఇరాన్ నుంచి వచ్చినవాడు. టర్కీతో నిజాం కుటుంబాలకు పెళ్లి సంబంధాలున్నా, టర్కీతో పాలనా సంబంధాలు లేవు. సినిమాలో వాడిన తుర్కిస్తాన్ అనే మాట మనకు చరిత్రలో కన్పించదు. నిజాం ఒక దశలో మత మార్పిడులు చేయించాడు. అతనే వాటిని నిలిపేశాడు.

కారణం మళ్లీ దొరలే. మతమార్పిడి వల్ల ఇస్లాంను స్వీకరించిన మాల మాదిగలు, ఇతర శూద్రులు వెట్టిచాకిరీని నిరాకరిస్తే మా గతేమిటి? మీ అధికారుల గతేమిటి? అని దొరల ప్రతినిధి వర్గం నిజాంను కలిసి ప్రశ్నించింది. వెంటనే నిజాం మతమార్పిడులను నిలిపి వేయించాడు. సినిమాలో ఈ విషయం ప్రస్తావన రాకుండా జాగ్రత్త పడ్డారు. గద్దర్ స్ఫూర్తి లేని, చరిత్రను పూర్తిగా వక్రీకరించిన సినిమాకు అవార్డు ఇవ్వటం ద్వారా తెలంగాణా ప్రభుత్వం ఆయన్ను అవమానించిందని పలువురు అభ్యుదయవాదులు విమర్శిస్తున్నారు. ఈ విధంగా గద్దర్ పేరిట ఇచ్చిన తొలి సినీ అవార్డులే విమర్శలను ఎదుర్కోవల్సి రావడం విచారకరం.

# అభిమన్యు, రాహుల్ అర్ధ సెంచరీలు

- 184 పరుగుల ఆధిక్యంలో భారత్-ఏ
- ఇంగ్లాండ్ లయన్స్‌తో రెండో అనధికార టెస్టు

**నార్తాంప్టన్ (ఇంగ్లాండ్) :** ఇంగ్లాండ్ పర్యటనను సెంచరీతో ఘనంగా మొదలెట్టిన కెఎల్ రాహుల్.. మరో అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (80, 92 బంతుల్లో 10 ఫోర్లు), కెఎల్ రాహుల్ (51, 64 బంతుల్లో 9 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా ఇంగ్లాండ్ లయన్స్‌తో రెండో అనధికార టెస్టులో భారత్-ఏ రెండో ఇన్నింగ్స్‌లో 163/4 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంలో కలిపి ప్రస్తుతం 184 పరుగుల ముందంజలో నిలిచింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (5) మరోసారి నిరాశపరిచాడు. కెఎల్ రాహుల్, అభిమన్యు ఈశ్వరన్‌లు రెండో వికెట్‌కు 87 పరుగులు జోడించారు. అర్ధ సెంచరీలతో నిలదొక్కుకున్న రాహుల్, అభిమన్యు ఈశ్వరన్ మూడో సెషన్లో పెవిలియన్‌కు చేరుకున్నారు. కరుణ్ నాయర్ (15) రెండో ఇన్నింగ్స్‌లో అంచనాలను అందుకోలేదు. ధ్రువ్ జురెల్ (6 నాటౌట్), నితీశ్ కుమార్ రెడ్డి (1 నాటౌట్) అజేయంగా నిలిచారు. 33 ఓవర్లలో 4 వికెట్లకు రెండో ఇన్నింగ్స్‌లో భారత్-ఏ 164 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ లయన్స్ పేసర్ క్రిస్ వోక్స్ (2/31) రెండు వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు, భారత పేసర్లు ఖలీల్ అహ్మద్ (4/70), అన్షుల్ (2/56), తుషార్ దేశ్‌పాండే (2/62) విజృంభించారు. ఇంగ్లాండ్ లయన్స్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 89 ఓవర్లలో 327 పరుగులకే కుప్పకూల్చారు. ఓపెనర్ టామ్ హేన్స్ (54), ఎమిలియో (71) సహా జోర్డాన్ (45), జోశ్ టాంగ్ (36 నాటౌట్) రాణించటంతో ఆతిథ్య ఇంగ్లాండ్ లయన్స్ 300 పరుగుల మార్క్ దాటింది. భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 348 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. భారత్-ఏ, ఇంగ్లాండ్ లయన్స్ అనధికార టెస్టులో నేడు ఆఖరు రోజు ఆట.

## ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ విజేత అల్కరాజ్

**పారిస్ :** డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాజ్ మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. మొదటి రెండు సెట్‌లను కోల్పోయిన తర్వాత, అల్కరాజ్ అద్భుతమైన పునరాగమనం చేసి అద్భుతమైన విజయాన్ని సాధించాడు. హెూరాహెూరీగా సాగిన ఫైనల్‌లో సినర్‌పై 4-6, 6-7 (7/4), 6-4, 7-6 (7/3), 7-6 (10/2) తేడాతో అల్కరాజ్ విజయం సాధించాడు. దాదాపు ఐదున్నర గంటలపాటు సాగిన ఈ పోరు రికార్డు సృష్టించింది. సుదీర్ఘంగా సాగిన ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ మ్యాచ్‌గా ఘనత సాధించింది. ఈ మ్యాచ్ 1982లో విలాండర్ మరియు విలాస్ మధ్య జరిగిన 4 గంటల 42 నిమిషాల ఫైనల్ మ్యాచ్ రికార్డును బద్దలు కొట్టింది.

## ఘనంగా రింకు నిశ్చితార్థం

**లఖ్‌నవూ:** సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియ సరోజ్‌తో టీమిండియా క్రికెటర్ రింకు సింగ్ నిశ్చితార్థం ఆదివారం ఘనంగా జరిగింది. లఖ్‌నవూలోని సెంట్రమ్ హోటల్‌లో జరిగిన ఈ వేడుకకు మాజీ క్రికెటర్లు ప్రవీణ్ కుమార్, పీయూష్ చావ్లా, ఉత్తరప్రదేశ్ రంజీ జట్టు కెప్టెన్ ఆర్యన్ జుయల్ హాజరయ్యారు. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, ఎంపీ డింపుల్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత ప్రొఫెసర్ రామ్ గోపాల్ కాంగ్రెస్ నేత రాజీవ్ శుక్లా తదితర రాజకీయ ప్రముఖులు కూడా హాజరయ్యారు. ఈ ఏడాది నవంబరు 18న వారణాసిలో సంప్రదాయబద్ధంగా రింకు, ప్రియ వివాహం జరగనుంది. క్రికెట్, బాలీవుడ్, వ్యాపార, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులను వివాహానికి ఆహ్వానించనున్నారు. 27 ఏళ్ల రింకు రెండు వన్డేలు, 33 టి20ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 26 ఏళ్ల ప్రియ ఉత్తర్‌ప్రదేశ్‌లోని మచిలీషహర్ నుంచి సమాజ్‌వాదీ పార్టీ తరపున లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆమె గతంలో సుప్రీం కోర్టు న్యాయవాదిగా కూడా పనిచేశారు.

## ఘనంగా ఒలింపిక్ డే రన్ ఏర్పాట్లు!

**శాట్స్, టీఓఏతో జితేందర్ రెడ్డి సమీక్ష సమావేశం**

**హైదరాబాద్ :** అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 23న అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో ఒలింపిక్ డే రన్‌ను నిర్వహిస్తున్నారు. భారీ స్థాయిలో నిర్వహించనున్న ఒలింపిక్ డే రన్‌ను విజయవంతం చేసేందుకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్జ్), తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ) ఉన్నతాధికారులతో రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు, టీఓఏ అధ్యక్షులు ఏపీ జితేందర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. శాట్జ్, టీఓఏ సమన్వయం చేసుకుని ఒలింపిక్ డే రన్ ఏర్పాట్లు చేయాలని జితేందర్ రెడ్డి ఆదేశించారు. ఒలింపిక్ డే రన్ నిర్వహణ కమిటీపై తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. తెలంగాణ ఒలింపిక్ సంఘం కార్యదర్శి మల్లారెడ్డి, కోశాధికారి సతీశ్ గౌడ్, బిలియర్డ్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అప్పారావు, ఉషు అసోసియేషన్ కార్యదర్శి మనోహర్ జాలా, స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఉమేశ్, శాట్జ్ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్ సహా పిఆర్‌ఓ కాలేరు సురేశ్ తదితరులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## మోడీ హయాంలో రాజ్యాంగ సంస్థల హైజాక్

- తేజస్వీయాదవ్

**పాట్నా :** ప్రధాని మోడీ ప్రభుత్వంలో రాజ్యాంగ సంస్థలు హైజాక్ అయ్యాయని ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్ వ్యాఖ్యానించారు. మోడీ ప్రభుత్వం ఎన్నికల సంఘం (ఇసి) వంటి రాజ్యాంగ సంస్థలను హైజాక్ చేస్తోందని, ఎన్నికల తేదీలు ప్రకటించకముందే అధికారిక బిజెపి ఎన్నికల షెడ్యూల్ గురించి ఎలా తెలుసుకుంటుందని అన్నారు. "2014లో కేంద్రంలో మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చినప్పటి నుండి అన్ని రాజ్యాంగ సంస్థలు హైజాక్‌కు గురయ్యాయి. ఎన్నికల తేదీలను ఇసి ప్రకటించడడానికి ముందే బిజెపి ఐటి సెల్ తెలుసుకుంటోంది. ఇలా చాలా పరిణామాలను గమనించాం' అని అన్నారు. రాజ్యాంగ సంస్థలు స్వతంత్రంగా పనిచేయాల్సిన అవసరం ఉందని, వాటిపై ప్రభావం పడితే ప్రజలు ఎలా న్యాయం ఆశించగలరని ప్రశ్నించారు. 2020లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నిష్పక్షపాతంగా, న్యాయంగా జరగలేదని విమర్శించారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి వుందని అన్నారు. సాయంత్రానికి ఓట్ల లెక్కింపు ఆగిపోయిందని, సమర్థించుకునేందుకు ఇసి మూడు మీడియా సమావేశాలను నిర్వహించిందని అన్నారు. రాత్రిపూట తిరిగి లెక్కింపు ఎందుకు ప్రారంభించారని, విజేతలుగా ప్రకటించబడిన మహాఘట్‌బంధన్ అభ్యర్థులు తరువాత ఓడిపోయినట్లుగా వెల్లడించారని, వీటికి ఇసి సమాధానమివ్వాల్సి వుందని తేజస్వీయాదవ్ పునరుద్ఘాటించారు. మహారాష్ట్ర ఎన్నికలపై ఇండియా బ్లాక్ నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యలకు మద్దతు ప్రకటిస్తున్నానని అన్నారు.

## 6 వేలు దాటిన కరోనా కేసులు

**న్యూఢిల్లీ :** దేశంలో కరోనా కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆదివారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. గత 48 గంటల్లో 769 కొత్త కేసులు నమోదవ్వగా, ఆరుగురు మరణించారు. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య ఆరు వేలు దాటింది. అత్యధికంగా ప్రభావితమైన రాష్ట్రంగా కేరళ కొనసాగుతోంది. ఆ తర్వాత గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ ఉన్నాయి. కరోనా కేసులు పెరుగుతున్న కారణంగా ఆరోగ్య కేంద్రాల్లో వసతులను తనిఖీ చేయడానికి కేంద్రం మాక్ డ్రిల్స్ నిర్వహిస్తోంది. ఆక్సిజన్, ఐసోలేషన్ బెడ్లు, వెంటిలేటర్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని అన్ని రాష్ట్రాలకూ సూచించింది. దేశంలో ప్రస్తుతం 6,133 యాక్టివ్ కేసులు ఉన్నాయి. చాలా కేసుల తీవ్రత స్వల్పంగా ఉన్నాయని, హోం క్వారంటైన్‌లోనే చికిత్స అందిస్తున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. జనవరి నుండి దేశంలో 65 మరణాలు నమోదయ్యాయి. కరోనా పరిస్థితికి అనుగుణంగా తగిన చర్యలను అంచనా వేయడానికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ సునీతా శర్మ అధ్యక్షతన జూన్ 2, 3 తేదీల్లో సాంకేతిక సమీక్ష సమావేశాలు నిర్వహించారు. విపత్తు నిర్వహణ విభాగం, ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్ సెల్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్, ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వాస్పత్రులు, అన్ని రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## మాస్కోపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి

**మాస్కో :** రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ దాడికి పాల్పడింది. ఈ దాడి కారణంగా రెండు కీలక విమానాశ్రయాలను మూసివేసినట్లు రష్యా అధికారులు తెలిపారు. భద్రత కోసం వ్నుకోవో, డొమోడెడోవో విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలను నిలిపివేసినట్లు రష్యా పౌర విమానయాన సంస్థ రోసావియాట్సియా పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారుజామున 4.00 గంటల సమయంలో మాస్కో వైపు దూసుకువస్తున్న తొమ్మిది ఉక్రేనియన్ డ్రోన్‌లను రష్యా వైమానిక రక్ష విభాగాలు ధ్వంసం చేయాని మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. ఉక్రెయిన్ డ్రోన్ దాడితో తులా ప్రాంతంలోని అజోట్ కెమికల్ ప్లాంట్‌లో స్వల్పకాలిక మంటలు చెలరేగాయని, ఇద్దరు సిబ్బంది గాయపడ్డారని పేర్కొన్నారు. కలుగ ప్రాంతంలో ఏడు డ్రోన్లను కూల్చివేసినట్లు ప్రాంతీయ గవర్నర్ తెలిపారు. ఈ రెండు ప్రాంతాలు మాస్కోకు దక్షిణంగా, రాజధానికి సరిహద్దుగా ఉన్నాయి.

## అభివృద్ధిని పునర్ నిర్వచించాం

- ఎన్‌డిఎ ప్రభుత్వ వార్షికోత్సవంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ :** బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో మహిళా నేతృత్వంలోని అభివృద్ధికి కొత్త అర్థం చెప్పిందని ప్రధాని నరేంద్రమోడీ తెలిపారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా సోషల్ మీడియాలో ఆయన ఈ మేరకు పోస్ట్ చేశారు. సైన్స్, విద్య, క్రీడలు, స్టార్టప్‌లు, సాయుధ దళాలతో సహా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తూ అనేక మందికి స్ఫూర్తినిస్తున్నారని ప్రధాని ఎక్స్‌లో పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ ద్వారా గౌరవం కల్పించడం నుండి జన్‌ధన్ ఖాతాల ద్వారా ఆర్థికంగా చేర్చడం వరకు పలు కార్యక్రమాల ద్వారా మహిళా సాధికారతపై దృష్టి సారించామని ఆయన తెలిపారు. 'ఉజ్వల యోజన' కింద పేద కుటుంబాలకు గ్యాస్ సిలిండర్లను సబ్సిడీకి అందించినట్లు తెలిపారు. 'ముద్ర' రుణాలు లక్షలాది మంది మహిళా పారిశ్రామికవేత్తలు తమ కలలను కొనసాగించడానికి వీలు కల్పించాయని అన్నారు. 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమం బాలికను రక్షించడానికి జాతీయ ఉద్యమాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు. పేదలు, రైతులు, యువతతో సహా సమాజంలోని వివిధ వర్గాల కోసం తన ప్రభుత్వం కృషి చేసిందన్నారు.

# పాఠశాల విద్యార్థులకు సైనిక శిక్షణ

- మహారాష్ట్ర ప్రభుత్వ వివాదాస్పద నిర్ణయం
- సంఘ్ పరివార్ ప్రభావంతోనే మార్పులు!
- గుడ్డి విధేయత కోసమేనా? : ప్రశ్నిస్తున్న మేధావులు

**ముంబయి :** భారతదేశంలో అత్యంత ధనిక రాష్ట్రమైన మహారాష్ట్ర పాఠశాల విద్యలో కొత్త పథకాన్ని ప్రకటించింది. 1వ తరగతి నుండి విద్యార్థులకు ప్రాథమిక సైనిక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. దేశభక్తి, క్రమశిక్షణ, శారీరక దఢత్వాలను చిన్న వయసు నుండే విద్యార్థుల్లో పెంపొందిస్తామని, ఈ శిక్షణ కోసం 2.5 లక్షల మంది మాజీ సైనికులను నియమిస్తామని, దీనిని దశలవారీగా అమలు చేస్తామని ప్రకటించింది. చిన్న వయసు పిల్లలకు సైనిక శిక్షణ అందించడం అనేది మానసిక, మేధో వికాసానికి హానికరం. బాల్యంలో విద్య ఆలోచనా సామర్థ్యం, సజనాత్మకత, ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించాలి. అలా కాకుండా గుర్తింపు, గుడ్డి విధేయత నేర్పించకూడదు. ఈ సైనిక శిక్షణ వారి మనసులో 'ఎవరో తెలియని శత్రువు' గురించి అనవసర భయాన్ని కలిగించవచ్చు. ఇది వారి సున్నితమైన మనసును దెబ్బతీసి, మానసిక సమస్యలకు దారితీస్తుంది. మహారాష్ట్ర విద్యారంగంలో అనేక సమస్యలన్నాయి. వాటన్నింటినీ పక్కన పెట్టి మరీ ఫడ్నవీస్ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకురావడంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం**

మహారాష్ట్రలోని పాఠశాలలను మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల కొరత వేదిస్తుంది. సవాళ్ల ను అదిగమించడంలో విధానపరమైన అనేక లోపాలున్నాయి. దీనివల్ల విద్యార్థుల మార్కులు తగ్గడం, తరగతి గదులు తగ్గిపోవడం, కనీస సౌకర్యాలూ లేవు. ఇలాంటి పరిస్థితుల్లో తక్కువగా ఉన్న వనరులను, సమయాన్ని ఈ శిక్షణ కోసం ఉపయోగించడం వల్ల సంక్షోభానికి దారితీస్తుందని విద్యారంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ప్రభుత్వ స్కూళ్ల మూసివేత**

ఎఎస్‌ఆర్‌ఈ నివేదిక ప్రకారం మహారాష్ట్రలో విద్యారంగ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రాష్ట్రంలో చాలా మంది విద్యార్థులు ప్రాథమిక లెక్కలు చేయలేక పోతున్నారు. చిన్న పదాలు చదవడంలో ఇబ్బంది పడుతున్నారు. గత దశాబ్ద కాలం నుండి వనరుల కొరత, కార్పొరేట్ అనుకూల సంస్కరణల కారణంగా వేల సంఖ్యలో ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయి. అనేకమంది పిల్లలు విద్య నుండి దూరమయ్యారని నివేదికలో పేర్కొంది. బిజెపి ప్రభుత్వం విద్యను దీర్ఘకాలిక దష్టితో చూడ్డం లేదనే విమర్శలున్నాయి. రాష్ట్ర సొంత పాఠ్యాంశాలు, పుస్తకాలను వదిలేసి సిబిఎస్‌ఇ పాఠ్యాంశాలను హడావిడిగా ప్రవేశపెట్టింది. ఇది 2.1 కోట్ల విద్యార్థులు, 6.8 లక్షల ఉపాధ్యాయులు, 1.11 లక్షల స్కూళ్లపై ప్రభావం పడింది. ఈ సమయంలో సైనిక శిక్షణకు ప్రాధాన్యతనివ్వడం నిజమైన విద్యావసరాలను నిర్లక్ష్యం చేయడమే.

**ప్రజాస్వామ్య విలువలకు ముప్పు:**

ఈ పథకం గురించి విస్తత చర్చ జరగలేదు. ప్రభుత్వం మేధావులతో, విద్యావేత్తలతో, మానసిక నిపుణులతో సంప్రదించ లేదు. ప్రశ్నలను ఆహ్వానించలేదు. బిజెపి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వేగంగా అమలు చేయాలనుకుంటుంది. ఈ పథకం ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఒ) గతంలో ప్రతిపాదించిన సైనిక్ స్కూల్ మోడల్‌కు ఆధారంగా ఉంది. కీలకమైన విద్యారంగంలో ఏకపక్ష నిర్ణయాలు ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తాయి.

**సంఘ్ పరివార్ ప్రభావం**

రిపోర్టర్స్ కలెక్టివ్ సంస్థ నివేదిక ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం 67% సైనిక్ స్కూళ్ళను సంఘ్ పరివార్, బిజెపి నాయకులు, వారి మిత్రులకు అప్పగించింది. విద్యను "హిందూ రాష్ట్ర" ఆదర్శాల ప్రకారం మార్చడం ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం. ఇది సమాజంలో సైనికీకరణను పెంచే ప్రమాదాన్ని సూచిస్తుంది. ఈ పథకం విద్యా వ్యవస్థలో కొత్త సమస్యలను తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఇది పిల్లల సజనాత్మకత, స్వేచ్ఛను హరించడంతో పాటు "దేశభక్తి" పేరుతో పిల్లలను సైనికీకరిస్తుంది. థామస్ ఎడిసన్ చెప్పినట్లుగా "విద్య ప్రధాన లక్ష్యం ప్రజలు ఎలా ఆలోచించాలో నేర్పడం" కానీ సైనిక విద్య "గుర్తింపు, విధేయత" లను నేర్పిస్తుంది. ఈ నిర్ణయంపై విస్తృత పరిశోధన, బహిరంగ చర్చ అవసరమనేది విశ్లేషకుల భావన.

## రాహుల్ లేఖ రాస్తేనే స్పందిస్తాం

- ఎన్నికల కమిషన్

**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో అవకతవకలు జరిగాయంటే లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర ఎన్నికల కమిషన్ వర్గాలు స్పందించాయి. ఎన్నికల కమిషన్‌కు రాహుల్ ఇప్పటి వరకూ లేఖ రాయలేదని, సమావేశం ఏర్పాటు చేయాలని కూడా కోరలేదని అంటూ ఆయన ఆ పని చేసినప్పుడే కమిషన్ స్పందిస్తుందని ఆదివారం తెలిపాయి. 2019, 2024 శాసనసభ ఎన్నికలతో పోలిస్తే మహారాష్ట్రలో 2024 లోక్‌సభ, శాసనసభ ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని రాహుల్ ఆరోపించిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికలలో బిజెపి పనితీరు బాగా లేని 85 నియోజకవర్గాలలోనే అదనపు ఓటర్లు అధిక సంఖ్యలో చేరారని ఆయన తెలిపారు. మహారాష్ట్ర ఎన్నికలలో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని కూడా ఆరోపించారు. దీనిపై శనివారం నాడే స్పందించిన ఎన్నికల కమిషన్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు.

మహారాష్ట్ర ఎన్నికలపై తన అభ్యంతరాలను రాహుల్ ఇసికి తెలియజేయలేదని కమిషన్ వర్గాలు చెప్పాయి. 'ఫిబ్రవరిలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆరు జాతీయ పార్టీలతో సమావేశం కావాలని భావించారు. గత నెల 15వ తేదీన కాంగ్రెస్‌ను ఆహ్వానించారు. అయితే సమావేశాన్ని వాయిదా వేయాలని కాంగ్రెస్ కోరింది' అని ఆ వర్గాలు తెలిపాయి. మిగిలిన ఐదు జాతీయ పార్టీలతో ఇసి సమావేశాలు నిర్వహించిందని గుర్తు చేశాయి. రాహుల్ లేఖ రాసిన తర్వాతే ఎన్నికల కమిషన్ స్పందిస్తుందని, ఇసి సహా ఏ రాజ్యాంగ సంస్థలో అయినా ఇదే పద్ధతి అమలులో ఉంటుందని చెప్పాయి. తాను లేవనెత్తిన అంశాలు చాలా తీవ్రమైనవి అంటూనే ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయడానికి రాహుల్ వెనకడుగు వేస్తున్నారని వ్యాఖ్యానించాయి.

సిసి టివి ఫుటేజ్ అందించాలన్న డిమాండ్‌పై ఇసి వర్గాలు స్పందిస్తూ ఏదైనా ఎన్నికను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలైనప్పుడు సంబంధిత హైకోర్టు ఆ ఫుటేజ్‌ని పరిశీలిస్తుందని తెలిపాయి. ఎన్నికల సమగ్రతను, ఓటర్ల గోప్యతను కాపాడేందుకు ఈ ప్రక్రియను అనుసరిస్తున్నామని వివరించాయి.

## భద్రతా ఏర్పాట్లకు సమయం లేదు

- పోలీసుల హెచ్చరికను తోసిపుచ్చిన ప్రభుత్వం !

**బెంగళూరు :** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) విజయ వేడుకల్లో జరిగిన పొరపాట్లపై పోలీసులకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య నిందారోపణలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా విధాన సౌధ డిసిపి విడుదల చేసిన లేఖతో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. విధాన సౌధ ఆవరణలో అధికంగా జనం గుమిగూడతారని, సమయం లేకపోవడం, భద్రతా సిబ్బంది కొరత వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి పోలీసులు తీసుకెళ్లినట్లు లేఖలో స్పష్టమైంది. విధాన సౌధ వేడుకలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదన్నది నిజమే అయినప్పటికీ రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన విధాన సౌధలో బహిరంగ కార్యక్రమం నిర్వహించడం, జూన్ 4 ఉదయం విక్టరీ పరేడ్ ఉంటుందని ఏకపక్షంగా ప్రకటించడంతో లక్షలాది మంది వీధుల్లోకి వచ్చారని, చివరికి అది చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాటకు దారితీసిందని పోలీసుల వాదన. ఆర్‌సిబి జట్టు ఐపిఎల్ ఫైనల్స్‌లో గెలిస్తే వారికి సన్మానం చేయడంపై అభిప్రాయాన్ని కోరుతూ.. జూన్ 3న విధాన సౌధ డిసిపికి పరిపాలనా సంస్కరణలశాఖ (డిపిఎఆర్) లేఖ రాసింది. జూన్ 4న ఈ లేఖపై విధాన సౌధ డిసిపి ఎంఎన్ కరిబసవగౌడ స్పందించారు. ఈ కార్యక్రమానికి లక్షలాది మంది ఆర్‌సిబి అభిమానులు గుమిగూడుతారని, విధాన సౌధ డివిజన్‌లో భద్రతా సిబ్బంది కొరత ఉన్నందున బందోబస్తు చేయడం సమస్యగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బయట నుండి ఎక్కువ మంది సిబ్బందిని మోహరించడం, శాంతిభద్రతలు, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయపరచడానికి సమయం లేదని తెలిపారు. విధాన సౌధలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఎక్కువ సమయం అవసరమని స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి పోలీసులు కట్టుబడి ఉంటారని అన్నారు. సన్నాహాలు చేయడానికి తగినంత సమయం లేదని చెబుతూ, వేడుకలను జూన్ 8 (ఆదివారం)కి వాయిదా వేయాలని సూచించారని పలువురు అధికారులు తెలిపారు. వారి సూచనను తోసిపుచ్చారని సమాచారం.

## ఎన్నికల ప్రచారంలో ఉండగా
# కొలంబియాలో ప్రతిపక్ష నేతపై కాల్పులు

- ఇది ప్రజాస్వామ్యంపై దాడి : అధ్యక్షుడు పెట్రో

**బొగోటా :** కొలంబియా అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేస్తున్న ప్రతిపక్ష అభ్యర్థి, సెనెటర్ మిగుయల్ ఉరిబ్ టర్బేపై రాజధాని బొగోటాలో శనివారం కాల్పులు జరిగాయి. ఓ పార్కులో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తున్న సమయంలో టర్బేపై మూడుసార్లు కాల్పులు జరిపారు. వీటిలో రెండు తూటాలు తలకు తగిలాయి. ఈ ఘటనకు సంబంధించి పదిహేను సంవత్సరాల అనుమానితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాల్పుల ఘటనలో తీవ్రంగా గాయపడిన టర్బే ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ఆయన మృత్యువుతో పోరాడుతున్నారని, ఆయన కోసం ప్రార్థనలు చేయాలని టర్బే భార్య తారాజోనా ప్రజలను కోరారు. ఈ దాడి ప్రజాస్వామ్యానికి, స్వేచ్ఛకు ముప్పు కలిగిస్తోందని టర్బేకు చెందిన సెంట్రో డెమొక్రటికో పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది.

ప్రసంగం మధ్యలో ఉండగా టర్బే తలపై గురి పెట్టి కాల్పులు జరిపారని ఆన్‌లైన్‌లో వైరల్ అయిన ఫొటోలను బట్టి తెలుస్తోంది. కాల్పులు జరిగిన వెంటనే ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీశారు. తల మీద రెండు సార్లు, మోకాలిపై ఒకసారి కాల్పులు జరిపారని వైద్యులు తెలిపారు. టర్బేకు వారు శస్త్ర చికిత్స జరిపారు. సంఘటన జరిగిన వెంటనే పోలీసులు అప్రమత్తమై అనుమానితుని కాలుపై కాల్పులు జరిపి, అతనిని నిర్బంధించారు. అతని వద్ద 9 ఎంఎం తుపాకీ లభించిందని అటర్నీ జనరల్ కార్యాలయం తెలిపింది.

ప్రతిపక్ష అభ్యర్థిపై జరిగిన దాడిని దేశాధ్యక్షుడు గుస్టావో పెట్రో తీవ్రంగా ఖండించారు. ఇది ఓ వ్యక్తిపై జరిగిన దాడి కాదని, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి, టర్బేకు మధ్య విభేదాలు ఉన్నాయని, అయితే అవి కేవలం రాజకీయ పరమైనవేనని చెప్పారు. ఈ ఘటన వెనుక ఉన్న వారిని వదిలేది లేదని స్పష్టం చేశారు. కాల్పుల ఘటన వెనుక ఉన్న వ్యక్తి ఆచూకీ తెలిపితే 730,000 డాలర్ల రివార్డు అందజేస్తామని రక్షణ మంత్రి పెడ్రో శాంచెజ్ ప్రకటించారు. ఈ దాడిని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో కూడా ఖండించారు. కొలంబియాలో అక్టోబరులో జరిగే అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేస్తానని టర్బే ప్రకటించారు.

## మణిపూర్‌లో మళ్లీ అశాంతి

(మొదటి పేజీ తరువాయి)

సూచనల మేరకు మణిపూర్‌లో హింసకు సంబంధించిన కేసులను పరిశీలిస్తున్నామని పేర్కొంది. ఇక్కడి కేసుల విచారణ గౌహతికి మారిందని, కనన్‌సింగ్‌ను ఇంఫాల్ నుంచి గౌహతి తరలించామని, విచారణ కొనసాగుతుందని తెలిపింది.

**గవర్నర్‌ను కలిసిన వివిధ పార్టీల ఎమ్మెల్యేల బృందం**

వివిధ పార్టీల ఎమ్మెల్యేల ప్రతినిధి బృందం గవర్నర్ అజయ్‌కుమార్ భల్లాను రాజ్‌భవన్‌లో కలిసింది. ఆందోళనలను అదుపు చేసి, సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు అవసరమైన అన్ని చర్యలు గవర్నర్ తీసుకుంటారని గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

అదనపు ఎస్పీ అమిత్ ఇంటిపై జరిగిన దాడిలోనూ, 2024 ఫిబ్రవరిలో ఓ సీనియర్ పోలీస్ అధికారి కిడ్నాపింగ్‌లోనూ కరణ్ సింగ్ అనుమానితుడు. అదే నెలలో ఆయన ఓ కమాండో యూనిట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేశారు. విధినిర్వహణల్లోక్ష్యం వహించాడన్న కారణంతో ఆయనను సస్పెండ్ చేశారు. ఆ తర్వాత కరణ్ సింగ్ ఎటిలో చేరారు.

**ముగ్గురిని అరెస్టు చేశాం : ఎన్‌ఐఎ**

తెంగ్నౌపాల్ జిల్లా మోరేహ్‌లో ఇండియన్ రిజర్వ్ బెటాలియన్ పోస్ట్, భద్రతా దళాలపై దాడి కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎన్‌ఐఎ తెలిపింది. 2024 జనవరి 17న జరిగిన దాడిలో ఇద్దరు పోలీసు కమాండోలు మరణించగా, అనేకమంది గాయాల పాలయ్యారు. అరెస్టయిన వారిలో తాంగ్‌మిన్లెన్ మేట్, కామ్గిన్ తాంగే గంగ్లే, హెంటిన్ తాంగ్ కిప్‌గెన్ ఉన్నారు.

మణిపూర్‌లో శాంతిభద్రతలను కాపాడటంలో బిజెపి నేతృత్వంలోని డబుల్ ఇంజన్ సర్కార్ విఫలం కావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 13న రాష్ట్రపతి పాలన విధించారు. మే 20న భద్రతా సిబ్బంది తమ వాహనంపై మణిపూర్ పేరు తొలగించడంలో నిరసనలు చెలరేగాయి. ఆ తరువాత తాజాగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 2023లో మణిపూర్‌లో అల్లర్లు ప్రారంభమైన తరువాత 250 మందికిపైగా మరణించగా, 60 వేల మంది వరకూ నిర్వాసితులయ్యారు. అనేకమంది ఇప్పటికీ సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. అయినప్పటికీ, ఇప్పటివరకూ ఆ రాష్ట్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటించకపోవడం గమనార్హం.

## గాజాలో నరమేధాన్ని ఆపాల్సిందే
### రోమ్‌లో భారీ నిరసన ప్రదర్శన

**రోమ్ :** గాజాలో యుద్ధాన్ని వెంటనే ముగించాలని డిమాండ్ చేస్తూ శనివారం సుమారు 30,000 మంది ప్రదర్శనకారులు రోమ్ వీధుల్లో భారీ ర్యాలీ చేపట్టారు. ఇటలీ ప్రధాన ప్రతిపక్షమైన వామపక్షాలతోపాటు పలు పార్టీల పిలుపుమేరకు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి కుటుంబాలతోసహా వచ్చి నిరసనకారులు ర్యాలీలో భాగస్వాముల య్యారు. ప్రభుత్వం మౌనం వీడాలని, గాజాలో మారణకాండపై ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. పాలస్తీనా, ప్రతిపక్ష పార్టీల జెండాలను చేతబూని "ఊచకోతను ఆపండి, కుట్రను ఆపండి" అనే ప్లకార్డులను నిరసనకారులు ప్రదర్శించారు. పాలస్తీనియన్లను ఊచకోత కోయడాన్ని, ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహూ నేరాలను ఎండగట్టేందుకు ఇది ఒక భారీ ప్రజా ప్రతిస్పందన అని ఇటలీ సెంటర్ లెఫ్ట్ డెమొక్రటిక్ పార్టీ నేత ఎల్లీష్లీన్ పేర్కొన్నారు. మెలోనీ ప్రభుత్వ విధానం మాదిరిగా కాకుండా మౌనంగా ఉండని మరొక ఇటలీ ఉందని ఇటలీ ప్రధాని జార్జి మెలోనీని ఎండగడుతూ ఆమె పేర్కొన్నారు. అసాధారణమైన ఊచకోత జరిగినప్పటికీ, క్రూరమైన అణచివేత కొనసాగుతున్నప్పటికీ ఇటాలియన్ ప్రభుత్వం స్పందించడం లేదని ట్యునీషియా ప్రదర్శనకారుడు ఒకరు అన్నారు.

అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, జి వివేక్ వెంకటస్వామి చేత మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

## కొత్తగా తెలంగాణ మంత్రులు ముగ్గురు ప్రమాణం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగింది. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో ఆదివారం ఎమ్మెల్యేలు జి వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. వారితో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రమాణం చేయించారు. సిఎం ఎ రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారలు హాజరయ్యారు. నూతనంగా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఆహ్వానితులందరూ అభినందనలు తెలిపారు.

నూతనంగా ముగ్గురు మంత్రుల ప్రమాణ స్వీకారం తర్వాత తెలంగాన రాష్ట్ర మంత్రివర్గం సంఖ్య15కు చేరింది. అంతకుముందు సిఎంతో సహా 12 మంది మంత్రులు ఉన్నారు. ఆరు మంత్రిపదవులు ఖాళీగా ఉన్నాయి. విస్తరణలో వాటిని పూర్తిగా భర్తీ చేస్తారని భావించారు. కానీ ముగ్గురికి మాత్రమే అవకాశం కల్పించారు. అసంతృప్తుల్ని బుజ్జగించే పనిలో కాంగ్రెస్ అధిష్టానం బిజీగా ఉంది. మరో మూడు మంత్రి పదవుల్ని భర్తీ చేసుకొనే అవకాశం సిఎం రేవంత్‌రెడ్డికి ఉంది. త్వరలో వాటిని కూడా భర్తీ చేస్తారని ప్రచారం జరుగుతుంది.

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి

- నివాళులర్పించిన రేవంత్, కెసిఆర్, లోకేశ్
- అధికారిక లాంఛనాలతో రాయదుర్గం మహాప్రస్థానంలో అంత్యక్రియలు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తీవ్ర అనారోగ్య సమస్యతో గచ్చిబౌలి ఎఐజి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ (62) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య సునిత, ఒక కుమారుడు వాత్సల్యానాథ్, కుమార్తెలు అక్షరానాథ్, దిసిర ఉన్నారు. ఈ నెల 5న మాదాపూర్ కావూరిహిల్స్‌లోని తన నివాసంలో గోపీనాథ్‌కు గుండెపోటు రాగా, వెంటనే కుటుంబ సభ్యులు ఎఐజి ఆస్పత్రికి తరలించారు. ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందించినా పరిస్థితి విషమించి బ్రెయిన్‌డెడ్ అయ్యి మరణించారు.

**తెలంగాణ సిఎం, మంత్రులు, మాజీ సిఎం, ప్రముఖుల నివాళి**

ఎమ్మెల్యే మాగంటి భౌతికకాయాన్ని ఎఐజి ఆస్పత్రి నుంచి మాదాపూర్‌లోని ఆయన నివాసానికి ఆదివారం ఉదయం తీసుకొచ్చారు. మాగంటి భౌతికకాయానికి సిఎం రేవంత్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ నివాళులర్పించారు. మాగంటి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాగంటికి నివాళులర్పించిన మాజీ సిఎం కెసిఆర్ భావోద్వేగానికి గురయ్యారు. కుటుంబానికి పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ దంపతులు మాగంటి ఇంటికి చేరుకుని నివాళులర్పించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి ఈటల రాజేందర్, బిఆర్ఎస్ నేతలు కెటిఆర్,హరీశ్ రావు, ఎమ్మెల్సీ కవిత, పలువురు ప్రజా ప్రతినిధులు మాగంటికి నివాళులర్పించారు. ఆదివారం సాయంత్రం రాయదుర్గం మహాప్రస్థానంలో అధికారిక లాంఛనాలతో ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. మాదాపూర్‌లోని ఇంటి నుంచి మహాప్రస్థానం వరకు అంతిమయాత్ర కొనసాగింది. ఈ యాత్రలో కుటుంబ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నేతలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు పాడె మోశారు.

## తమిళనాడు, బెంగాల్‌లో ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తాం : అమిత్ షా

**మధురై :** 2026 ఎన్నికల్లో తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఎన్‌డిఎ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఇక్కడ ఆదివారం జరిగిన 'పార్టీ కార్యకర్తల సమ్మేళనం' లో ఆయన మాట్లాడుతూ.. 2021 ఎన్నికల హామీలన్నీ నెరవేర్చారో లేదో వివరించాలని తమిళనాడు సిఎం స్టాలిన్‌ను ప్రశ్నించారు. పదేళ్లలో కేంద్రం రూ.6.80 లక్షల కోట్లు ఇచ్చిందని చెప్పుకున్నారు.

## పేదల ఇళ్లకు వెంటనే పట్టాలు

(మొదటి పేజీ తరువాయి)

మధ్య తరగతి ప్రజలు నివాసిస్తున్న ఇళ్లను బుల్డోజర్‌తో కూల్చేశారని తెలిపారు. విజయవాడలోని శాతవాహన కళాశాల, అన్నపూర్ణ థియేటర్ లను కూల్చేశారని పేర్కొన్నారు. శాతవాహన కాలేజీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడపాలని ఆయన డిమాండ్ చేశారు. ల్యాండ్ మాఫియాలు విచ్చలవిడిగా చెలరేగిపోతున్నా చూసిచూడనట్లు ప్రభుత్వ యంత్రాంగం వాటికి వత్తాసు పలుకుతోందన్నారు. తెనాలిలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని పోలీసులు ముగ్గురు యువకులను బహిరంగంగా అడ్డగోలుగా కొట్టారని తెలిపారు. రాష్ట్రమంత్రి టిజి భరత్ తండ్రి, మాజీ ఎంపి టిజి వెంకటేష్‌కు చెందిన రసాయనిక పరిశ్రమ నుంచి కాలుష్యం వెదజల్లుతోందన్న ప్రజలపై దౌర్జన్యం చేసి తప్పుడు కేసులు పెట్టారని చెప్పారు. పోలీస్ యంత్రాంగం చట్టబద్ధంగా వ్యవహరిస్తుందా? చట్టాన్ని ధిక్కరించి అధికార పార్టీకి వత్తాసు పలుకుతుందా? అని ప్రశ్నించారు. అమాయకులు, బలహీనులపై చర్యలు తీసుకుంటూ బలవంతులు, పలుకుబడి ఉన్నవారిని వదిలేస్తారా? ఆయన అని నిలదీశారు. ఈ సంస్కృతికి స్వస్తి చెప్పి, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం సృష్టించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**మహిళలను కించపరిచిన వారిపై చర్యలు**

మహిళలను కించపరిచే విధంగా మాట్లాడే ప్రజాప్రతినిధులపై తక్షణమే చర్యలు తీసుకునే విధంగా చట్ట సవరణ చేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అమరావతిలోని మహిళలపై కృష్ణంరాజు సాక్షి ఛానెల్‌లో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న కొమ్మినేని శ్రీనివాసరావు ఇటువంటి వ్యాఖ్యలను ప్రోత్సాహించే విధంగా మాట్లాడటాన్ని ఆయన ఖండించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చట్టబద్ధంగా ప్రభుత్వ యంత్రాంగం, చర్యలు తీసుకోవాలని కోరారు. సాక్షి ఛానల్ సైతం ఇలాంటివి పునరావృతం కాకుండా బాధ్యత తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో కూడా మహిళలను కించపరిచే విధంగా అనేక వ్యాఖ్యనాలు చేశారని తెలిపారు. దీనివల్ల రాష్ట్ర రాజకీయ చర్చలే తప్పుదారి పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నూతన రాజకీయ సంస్కృతి కోసం సిపిఐ(యం) పోరాడుతుందని శ్రీనివాసరావు చెప్పారు.

**గృహాంధ్ర, నివాసంధ్రపై శ్రద్ధ పెట్టాలి: సిహెచ్ బాబూరావు**

యోగాంధ్రపై పెట్టే శ్రద్ధ గృహాంధ్ర, నివాసంధ్రపై పెట్టాలని, కానీ అలాంటి పని ప్రభుత్వం చేయడం లేదని సిహెచ్ బాబూరావు అన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది పూర్తయిందని, ఎంత మందికి ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2014-15లో ప్రారంభించిన టిడ్కో ఇళ్లను గత ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చిందని, పెండింగ్‌లో ఉన్న 2.5లక్షల ఇళ్లను పేదలకు కూటమి ప్రభుత్వం ఏడాది నుంచి ఇవ్వలేదన్నారు. పేదలకు ఇళ్లు ఇవ్వకపోగా కొన్ని చోట్ల పేదలు నివసిస్తున్న ఇళ్లు, కళాశాలలను అడ్డు అదుపు లేకుండా అర్ధరాత్రుళ్లు కూల్చివేస్తున్నారన్నారు. టిడిపి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తనను కిడ్నాప్ చేశారని శాతావాహన కళాశాల ప్రిన్సిపాల్ చేసిన ఫిర్యాదుపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని ప్రశ్నించారు. ఈ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందనే ప్రకటన ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నుంచి ఆదేశాలు ఇప్పించాలని టిడిపి ఎమ్మెల్యేలను డిమాండ్ చేశారు. జివో 30లో 150 చదరపు గజాల వరకు ఉచితంగా ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రస్తుతం మెలికలు పెడుతోందన్నారు. అటవీశాఖ భూములను కేంద్రంతో చర్చించి కార్పొరేట్లకు అప్పగిస్తున్న ప్రభుత్వం రైల్వే భూముల్లో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి నివాసంతోపాటు పలు నివాసాలు కృష్ణనదీ తీరాన ఉన్నాయని, అదే కృష్ణనదీ తీరాన ఉన్న విజయవాడలోని పేదలకు పట్టాలు ఇచ్చేందుకు అభ్యంతరం ఏమిటని నిలదీశారు. పేదలకు ఇళ్లు, పట్టాలు ఇవ్వాలని, క్రమబద్ధీకరించాలని ఇప్పటికే తాము చేస్తున్న ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పుడు ప్రారంభిస్తేనే నాలుగేళ్లల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. . శాతావాహన కళాశాలపై ముఖ్యమంత్రి విచారణ జరిపించి నాయకులపై చర్యలు తీసుకొని మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని డిమాండ్ చేశారు.

## పేదల సంక్షేమం
4 కోట్లకు పైగా కుటుంబాలకు పక్కా ఇళ్ళు లభించాయి
81 కోట్ల మందికి ఉచితంగా నెలవారీ రేషన్
ఆయుష్మాన్ భారత్ కింద 55 కోట్ల మందికి ఉచిత చికిత్స

## యువతకు అవకాశాలు
490 కొత్త విశ్వవిద్యాలయాలు, 8100కు పైగా కొత్త కళాశాలలు 1.6 కోట్లకు పైగా యువతకు ఆధునిక నైపుణ్యాల శిక్షణ దేశవ్యాప్తంగా 1.6 లక్షలకు పైగా అంకురసంస్థలు

## రైతులకు నేరుగా లబ్ధి
పీఎమ్-కిసాన్ కింద రైతులకు రూ. 3.7 లక్షల కోట్లు లభించాయి చారిత్రాత్మకంగా సాగు వ్యయంలో 150 శాతానికి పెరిగిన ఎమ్ఎస్పీ, పీఎమ్ ఫసల్ బీమా యోజన కింద రూ. 1.75 లక్షల కోట్ల ప్రయోజనం

## మహిళలకు గౌరవప్రదమైన జీవితం
12 కోట్ల గృహాల్లో మరుగుదొడ్ల నిర్మాణం
10 కోట్లకు పైగా ఉజ్వల కనెక్షన్స్ 15.6 కోట్లకు పైగా గృహాలకు అందుబాటులోకి వచ్చిన కుళాయి నీరు

## మధ్యతరగతి ఆకాంక్షలకు బలం
రూ. 12 లక్షల వరకు ఆదాయంపై ఎలాంటి పన్ను లేదు,
మధ్యతరగతి కోసం మరింత మదుపు
7 కొత్త ఐఐటీలు, 8 కొత్త ఐఐఎంలు, 16 కొత్త ఎయిమ్స్ ఏర్పాటు.

## ఔత్సాహిక పారిశ్రామికత్వం.. సాధికారత...
చిన్న వ్యాపారాలకు సాధికారత కల్పించేందుకు 52.5 కోట్లకు పైగా ముద్ర రుణాలు: 90 లక్షలకు పైగా స్వయం సహాయక సంఘాల ద్వారా 10 కోట్లకు పైగా గ్రామీణ మహిళలు స్వయం సమృద్ధి సాధించారు.

## తయారీ కేంద్రంగా భారత్
ప్రపంచంలోనే రెండో అతి పెద్ద మొబైల్ ఫోన్ తయారీదారుగా భారత్ పీఎల్ఐ పథకం కింద 14 రంగాల్లో రూ. 1.6 లక్షల కోట్ల పెట్టుబడులు

## రక్షణ రంగంలో ఆత్మనిర్భరత
ఆత్మనిర్భర్ భారత్‌కు గొప్ప ఉదాహరణగా ఐఎన్ఎస్ విక్రాంత్ విమాన వాహక నౌక 33 రెట్లు పెరిగిన రక్షణ ఎగుమతులు

## మెట్రో నెట్వర్క్ విస్తరణ
5 నుంచి 23 నగరాలకు..
248 కిలోమీటర్ల నుంచి 1000కి పైగా కిలోమీటర్ల వరకు

## రెక్కలు తొడిగిన స్వప్నాలు
74 నుంచి 160కి రెట్టింపునకు పైగా పెరిగిన అయిన విమానాశ్రయాల సంఖ్య ఉడాన్ పథకం కింద 1.51 కోట్లకు పైగా మంది సరసమైన విమాన ప్రయాణ అనుభవం పొందారు

## అభివృద్ధికి చోదకశక్తిగా రహదారులు
91,000 కిలోమీటర్ల నుంచి 1.46 లక్షల కిలోమీటర్లకు పెరిగిన జాతీయ రహదారులు, రోడ్డు రవాణా, హైవే బడ్జెట్‌లో 570 శాతం పెరుగుదల

## నవ భారత్ కోసం ఆధునిక రైల్వే
చినాబ్ వంతెన- జమ్మూ కాశ్మీర్‌లో నిర్మించిన ప్రపంచంలోనే ఎత్తయిన రైల్వే ఆర్చ్ వంతెన.. అందుబాటులోకి వచ్చిన 136 ప్రపంచ స్థాయి వందే భారత్ రైలు సేవలు అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం కింద 1300 కు పైగా రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ

## భారత్ పురోగమనం
2025లో నాల్గో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
భారత్-వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ
రూ. 0.90 లక్షల నుంచి రూ. 2.35 లక్షలకు పెరిగిన తలసరి జీడీపీ



## అంతరిక్ష రంగంలో అగ్రగామి
చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొదటి దేశం ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం కల్పించిన అంతరిక్ష రంగం అంతరిక్ష రంగంలో 200కి పైగా అంకురసంస్థలు

## వారసత్వం.. అభివృద్ధి...
అయోధ్యలో అద్భుతమైన రామమందిర నిర్మాణం
ఉత్తరాఖండ్ లోని 12 కిలోమీటర్లకు పైగా పొడవైన హేమకుండ్ సాహిబ్ రోప్ వే ప్రాజెక్ట్, భారత్ నుంచి దొంగతనానికి గురై 2014 నుంచి తిరిగి వెనక్కి తెచ్చుకున్న కళాఖండాలు 642.
2013 వరకు తిరిగి వచ్చినవి 13 మాత్రమే.

CBC 44101/13/0006/2526

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68